PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 273 | విజయవాడ, శనివారం 6 మే 2023 | 8 + 8 పేజీలు వెల : 5. 50

Vol No | Vijayawada, Saturday 6 May 2023 | Rs

గర్జించిన గుజరాత్

- రాజస్థాన్‌పై తొమ్మిది వికెట్ల తేడాతో గెలుపు
- బౌలింగ్‌లో మెరిసిన రషీద్ ఖాన్, నూర్ అహ్మద్


లోపలి పేజీలో..



కారల్‌మార్క్స్ జయంతి సందర్భంగా విజయవాడలోని మార్క్స్, ఏంగెల్స్ విగ్రహాల వద్ద నివాళులర్పిస్తున్న వామపక్షాల నాయకులు, కార్యకర్తలు

7న అల్పపీడనం

- తుపానుగా మారే అవకాశం
- విపత్తుల నిర్వహణ సంస్థలో స్టేట్ కంట్రోల్ రూమ్



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తమిళనాడు తీరంలో సముద్ర మట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తులో ఉన్న ఉపరితల ఆవర్తనం శనివారం ఆగ్నేయ బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనంగా మారే అవకాశాలు ఉన్నాయి. దీని ప్రభావంతో అదే ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడుతుందని పేర్కొన్నారు. తుపానుగా మారే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు పడే అవకాశం ఉందని, ఈదురుగాలులు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే అవకాశాలు ఉన్నట్లు వాతావరణశాఖ పేర్కొంది.

తుపాను బంగ్లాదేశ్, మయన్మార్ దిశగా వెళ్లే అవకాశం ఉందని, రాష్ట్రానికి ఎలాంటి ముప్పు ఉండకపోవచ్చని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. ఏదేమైనప్పటికీ అల్పపీడనం ఏర్పడనున్న నేపథ్యంలో అన్ని జిల్లాల యంత్రాంగాన్ని అప్రమత్తం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఆదివారం నుంచి మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దని, వేటకు వెళ్లినవారు శనివారం లోగా తిరిగి రావాలని కోరారు. అత్యవసర సహాయం, సమాచారం కోసం 24 గంటలు అందుబాటులో ఉండేందుకు స్టేట్ కంట్రోల్ రూమ్ నెంబర్లు 1070, 112, 18004250101 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు. శనివారం అల్లూరి సీతారామరాజు, ఏలూరు, పల్నాడు, ప్రకాశం, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, వైఎస్ఆర్, శ్రీసత్యసాయి, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశముందని పేర్కొన్నారు. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ, పశ్చిమగోదావరి, కృష్ణా, ఎన్‌టిఆర్, గుంటూరు, బాపట్ల, నెల్లూరు, అనంతపురం జిల్లాల్లో తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉందని అంబేద్కర్ తెలిపారు. 7న కృష్ణా, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, వైఎస్ఆర్, శ్రీసత్యసాయి, అనంతపురం, కర్నూలు, నంద్యాల, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు, ఎన్‌టిఆర్, గుంటూరు, పల్నాడు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశముందని పేర్కొన్నారు. 8న విశ్వాస, అన్నమయ్య, వైఎస్ఆర్, శ్రీసత్యసాయి, అనంతపురం, కర్నూలు, నంద్యాల, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు, ఎన్‌టిఆర్, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో తేలికపాటి జల్లులు పడే అవకాశముందని అన్నారు.

రాజౌరిలో ఉగ్రదాడి

- అయిదుగురు జవాన్ల మృతి
- ఇంటర్నెట్ సేవలు నిలిపివేత

జమ్ము : జమ్ముకాశ్మీర్‌లోని రాజౌరిలో ఉగ్రవాదులు జరిపిన బాంబుదాడిలో అయిదుగురు జవాన్లు చనిపోయారు. రాజౌరి సెక్టార్ కండి ఫారెస్ట్‌లో పీర్ పంజల్ వాలీలో శుక్రవారం ఉదయం తనిఖీలు నిర్వహిస్తున్న సైనిక బృందం లక్ష్యంగా ఉగ్రవాదులు పేలుళ్లు జరిపారు. ఒక గుహలో దాక్కొని ఉన్న ఉగ్రవాదులను సైనిక బృందం గుర్తించినప్పుడు వారు ఈ దాడి చేశారు. ఉదయం 7:30 గంటలకు ఈ ఘటన చోటుచేసుకుంది. పేలుళ్ల ధాటికి ఇద్దరు సైనికులు అక్కడికక్కడే చనిపోగా, మరో ముగ్గురు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. గాయపడిన వారి వెంటనే ఉధంపూర్‌లో ఆసుపత్రికి తరలించారు. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. ఉగ్రవాదుల్లోనూ కొందమంది మరణించారని సైనిక అధికారులు చెబుతున్నారు. అయితే ఇప్పటి వరకూ ఏ ఒక్క ఉగ్రవాది మృతదేహం బయటపడలేదు.. కండి ఫారెస్ట్‌లో ఉగ్రవాదులు ఉన్నారనే నిర్దిష్టమైన సమాచారం అందడంతో సైన్యం ఈ గాలింపు చర్యలు చేపట్టింది. రాజౌరి ప్రాంతంలో మొబైల్, ఇంటర్నెట్ సేవలను నిలిపివేసింది. దాడి చేసిన ఉగ్రవాదుల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని, ఈ ప్రాంతం అంతా రాళ్లు, కొండలు, వృక్ష సంపద ఎక్కువగా ఉండటంతో గాలింపు కష్టంగా ఉందరని సైనిక అధికారులు చెబుతున్నారు. ఈ దాడి ఘటనతో రాజౌరిలో ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు.

రాజౌరి జిల్లాలోనే సుమారు రెండు వారాల క్రితం జరిగిన ఉగ్రదాడిలో ఐదుగురు సైనికులు చనిపోయిన విషయం తెలిసిందే. ఏప్రిల్ 20న సైనిక వాహనంపై ఉగ్రవాదులు ఆకస్మిక దాడి చేయడంతో ఐదుగురు సైనికులు సజీవ దహనమైన ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది.

అంతకు ముందు జనవరి 1, రాజౌరీలోని ధంగ్రీ ప్రాంతంలోని ఒక గ్రామంపై ఉగ్రవాదులు దాడి చేయడంతో ఏడుగురు పౌరులు మరణించారు. జి20 సమావేశాల్లో భాగంగా ఈ నెల 22న శ్రీనగర్‌లో టూరిజంపై వర్కింగ్ గ్రూప్ సమావేశం జరగనుంది. ఈ నేపథ్యంలోనే ఉగ్రవాదుల దాడులు జరుగుతున్నాయని సైనిక అధికారులు భావిస్తున్నారు.

ముక్కలుగా అమ్మేసే కుట్ర!

స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణపై కేంద్రం వ్యూహం

రాయబరేలీ రైల్ వీల్ ఫ్యాక్టరీ, విశాఖ హెచ్‌బి కాలనీలోని 24 ఎకరాలు అమ్మకం • తాజాగా హైపవర్ కమిటీ సమావేశం నిర్ణయం

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌పై కేంద్రంలోని బిజెపి సర్కారు తన విధానపైన 'ప్రైవేట్ సేల్' కుట్రను ఎగదోస్తూనే ఉంది. విశాఖ ఉక్కు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా రాష్ట్రంలోని కార్మికవర్గం, ప్రజానీకం రెండేళ్లుగా పోరాడుతున్నా మోడీ సర్కారు వెనక్కు తగ్గడం లేదు. రా మెటీరియల్ సరఫరాకు, వర్కింగ్ కేపిటల్‌కు రూ.1000 కోట్లు సాయం చేయాలని బిజెపి మినహా అన్ని రాజకీయ పార్టీలూ, కార్మిక సంఘాలూ, స్టీల్‌ప్లాంట్ కార్మికులు కేంద్రాన్ని కోరుతున్నా బ్యాంకుల్లో రుణం ఇప్పించకుండా ప్లాంట్ ఆస్తులను తెగనమ్మే సలహాలను ఇస్తోంది. ప్లాంట్‌లోని మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌లలో ఒకటి పూర్తిగానూ, మరొకటి పాక్షికంగానూ పనిచేస్తున్నాయి. మూడో బ్లాస్ట్ ఫర్నేస్‌ను కేంద్ర ఆదేశంతో స్టీల్ ప్లాంట్ యాజమాన్యం మూసేసింది. ఇది నడవాలంటే ఆస్తులమ్మేయాలంటూ కేంద్రం ఆధీనంలోని హైపవర్ కమిటీలు ఉచిత సలహాలు ఇస్తున్నాయి.

డిజిన్వెస్ట్‌మెంట్ హైపవర్ కమిటీలో ఏం తేల్చారంటే...

ఈ నెల రెండున ఢిల్లీలో సమావేశమైన డిజిన్వెస్ట్‌మెంట్ హైపవర్ కమిటీ సమావేశంలో కొన్ని ముఖ్యమైన నిర్ణయాలు చేశారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు చెందిన ఉత్తరప్రదేశ్‌లోని రాయబరేలీలోగల ఫోర్జ్‌డ్ వీల్ ప్లాంట్ (రైలు చక్రాలు తయారు చేసే ఫ్యాక్టరీ)ని, విశాఖ నగరం నడిబొడ్డున హెచ్‌బి కాలనీలోగల 24 ఎకరాల ప్లాంట్ భూమిని అమ్మేయాలంటూ ఆ కమిటీ ఆదేశాలు జారీ చేసింది. కేంద్ర కేబినెట్ ఏర్పాటు చేసిన పూర్వపు ఉక్కు ఆధిపత్యం పెట్టుబడుల ఉపసంహరణ కోర్ గ్రూపు సెక్రటరీలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. రాయబరేలీలోని వీల్ ప్లాంట్‌కు అప్పట్లో రూ.2,250 కోట్లు పెట్టుబడి పెట్టారు. అక్కడ ఏటా లక్ష చక్రాలు తయారు చేయాల్సి ఉండగా ఆర్థిక వనరుల కొరత కారణంగా 2022లో రెండు వేల చక్రాలే తయారు చేశారు. రాయబరేలీ ఫ్యాక్టరీ కోసం అప్పట్లో రూ.1,250 కోట్లు అప్పు చేశారు. దీన్ని అమ్మి అప్పు తీర్చేసి మిగిలిన డబ్బుతో బ్లాస్ట్ ఫర్నేస్–3ని తెరిపించుకోవాలని కేంద్రం చెబుతోంది. వీల్‌ప్లాంట్‌ను అమ్మితే ఎంత వస్తుందో? అనాడు చేసిన అప్పు, దానికి వడ్డీ ఎంత తీర్చాల్సి వస్తుందో చెప్పలేమని స్టీల్‌ప్లాంట్ వర్గాలు తాజాగా చెబుతున్నాయి. స్టీల్‌ప్లాంట్‌లో ఆక్సిజన్ ప్లాంట్‌ను కూడా యాజమాన్యం బిఒటి పద్ధతుల్లో నిర్మించింది. దీనికి సుమారు రూ.500 కోట్లు చెల్లించారు. ఈ మొత్తాన్ని కూడా వీల్ ప్లాంట్‌ని అమ్మేదాంట్లోంచే మినహాయించాల్సి రావడంతో యాజమాన్యం తలలు పట్టుకుంటోంది.



విద్య ద్వారానే పేదరిక నిర్మూలన

- బటన్ నొక్కి కళ్యాణమస్తు, షాదీ తోఫా సొమ్ము జమచేసిన సిఎం జగన్



కళ్యాణమస్తు, షాదీ తోఫా లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న జగన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విద్య ద్వారానే పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందని, అందుకోసమే వైఎస్ఆర్ కళ్యాణమస్తు, వైఎస్ఆర్ షాదీతోఫా పథకానికి పదో తరగతి చదవాలనే నిబంధన తీసుకొచ్చామని సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఎప్పుడైతే ఎస్‌ఎస్‌సి పిల్లలను చదివించాలని మైండ్‌లో రిజిస్టర్ అవుతుందో అప్పుడు కచ్చితంగా పదో తరగతి వరకు చదివించాలన్న తపన ప్రతిఒక్క పేద కుటుంబంలో మొదలవుతుందన్నారు. వైఎస్ఆర్ కళ్యాణమస్తు, వైఎస్ఆర్ షాదీతోఫా కింద జనవరి – మార్చి త్రైమాసికంలో వివాహం చేసుకున్న అర్హులైన 12,132 మంది లబ్ధిదారులకు రూ.87.32 కోట్ల ఆర్థిక సహాయాన్ని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం సిఎం బటన్ నొక్కి వారి ఖాతాల్లో జమచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏ కుటుంబమైనా పదో తరగతి వరకు తమ పిల్లలను చదివించేసరికి 15 ఏళ్ల వయసు వస్తుందని, తర్వాత పెళ్లికోసం 18 ఏళ్ల వయసు వరకు ఆగాల్సి ఉంటుందన్నారు. ఎలాగూ 14 తరగతి నుంచి ఇంటర్‌మీడియెట్ వరకు అమ్మఒడి పథకం ఇస్తున్నామని, ఫలితంగా పిల్లలను ఇంటర్ చదివిస్తారని, ఇంటర్ తర్వాత జగనన్న విద్యాదీవెన కింద పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంటు అందుబాటులోకి వస్తుండటంతో పిల్లల తల్లిదండ్రులకు భారం ఉండదన్నారు. పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంటు కింద కాకుండా జగనన్న వసతి దీవెన కింద డిగ్రీ చదువుతున్న ప్రతి బాబు, పాపకు రూ.20 వేల వరకు తల్లుల ఖాతాల్లో జమచేస్తున్నామన్నారు. జగనన్న అమ్మఒడి ఒక బెంచ్ మార్కు కాగా, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన రెండో బెంచ్ మార్క్ అవుతుందని, వైఎస్ఆర్ షాదీతోఫా, కళ్యాణ మస్తు మూడో బెంచ్ మార్క్ అవుతుందని సిఎం తెలిపారు. పేదరికం పోవాలంటే దానికి ఒకటే మార్గం చదువులని, డిగ్రీలు పాసైతే వీరికి మెరుగైన ఉద్యోగాలు వస్తాయని అన్నారు. ప్రతి పేద కుటుంబం నుంచి చదువుల విప్లవం రావాలని, పేదరికం నుంచి బయటపడే పరిస్థితులు రావాలని తాను కోరుకుంటున్నట్లు సిఎం వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు మేరుగ నాగార్జున, గుమ్మనూరు జయరామ్, కెవి ఉషశ్రీ చరణ్, బిసి వెల్ఫేర్ స్పెషల్ సిఎస్ జి అనంతరాము, గ్రామ, వార్డు సచివాలయాల స్పెషల్ సిఎస్ అజయ్‌జైన్, మైనార్టీ వెల్ఫేర్ సెక్రటరీ ఎమ్‌డి ఇంతియాజ్, సోషల్ వెల్ఫేర్ డైరెక్టర్ కె విజయ, గ్రామ, వార్డు సచివాలయాలశాఖ డైరెక్టర్ లక్ష్మీశా పాల్గొన్నారు.

రాజధానిలో ఇళ్ల స్థలాలను అడ్డుకోలేం

అనుబంధ పిటిషన్‌పై హైకోర్టు తీర్పు



ప్రజాశక్తి-అమరావతి

రాజధాని ప్రాంతంలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్న ప్రభుత్వ ప్రయత్నాలకు తాత్కాలిక ఉపశమనం లభించింది. పట్టాలు ఇవ్వకుండా ఉత్తర్వులు జారీ చేయలేమని హైకోర్టు తేల్చి చెప్పింది. పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వరాదంటూ రాజధాని రైతులు దాఖలు చేసిన మధ్యంతర అనుబంధ పిటిషన్‌ను కొట్టేసింది. అయితే, జిఓ 45ను సవాల్ చేసిన ప్రధాన కేసులో తాము వెలువరించే తీర్పునకు లోబడి ఇళ్ల పట్టాల పంపిణీ ఉంటుందని స్పష్టం చేసింది. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న అర్హులైన పేదలకు రాజధాని ప్రాంతంలో ఇళ్ల స్థలాలు ఇవ్వాలని గతంలో సుప్రీం కోర్టు చెప్పిందని, ఈ వ్యవహారంపై సుప్రీం స్టే ఇవ్వలేదని చీఫ్ జస్టిస్ పికె మిశ్రా, జస్టిస్ రవినాథ్ తిల్హరీతో కూడిన డివిజన్ బెంచ్ గుర్తు చేసింది. రాజధాని ప్రాంతంలో పేదలకు ఇళ్ల స్థలాల నిమిత్తం 1,134 ఎకరాలను గుంటూరు, ఎన్‌టిఆర్ జిల్లాల కలెక్టర్లకు బదలాయింపునకు సిఆర్‌డిఎకు అనుమతినిస్తూ ప్రభుత్వం జిఓ 45 జారీ చేసింది. దీనిని సవాల్ చేసిన ప్రధాన కేసులో వాదనలు గత నెల 21న పూర్తయ్యాయి. తీర్పు రిజర్వులో పెట్టింది. ఈ నేపథ్యంలో రాజధాని రైతుల తరపున న్యాయవాది నూరేని సంజయ్ హైకోర్టు సెలవు రోజున లేఖతో పట్టాలు ఇవ్వకుండా ప్రభుత్వం నిర్వహణలు చేస్తోందని, తక్షణమే అడ్డుకోవాలని కోరారు. దీనిపై హైకోర్టు శుక్రవారం విచారణ జరిపి అనుబంధ పిటిషన్‌ను కొట్టేసింది. ఎలక్ట్రానిక్ సిటీ భూమిని ఇవ్వడం రైతుల హక్కుల హరింపు అనే వివాదం సుప్రీంకోర్టులో ఉందని, ఈ నేపథ్యంలో అనుబంధ వ్యాజ్యాల్లో మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయలేమని తీర్పులో పేర్కొంది.

త్వరలో ఉపాధ్యాయ బదిలీలు

యాప్‌ల భారం తగ్గిస్తాం : మంత్రి బొత్స



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పాఠశాల విద్యలో భాగంగా త్వరలో ఉపాధ్యాయ బదిలీలు చేపడతామని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ వెల్లడించారు. బదిలీలు, పదోన్నతులపై ప్రభుత్వ ఆలోచనను ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులకు వివరించామని, వీటిపై సమగ్రంగా చర్చించి త్వరలో నిర్ణయం తీసుకుంటామన్నారు. ఉపాధ్యాయ సంఘాలతో మంత్రి సమగ్ర శిక్షా కార్యాలయంలో శుక్రవారం చర్చలు జరిపారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. బదిలీలపై ఉపాధ్యాయ సంఘాలు కొన్ని సలహాలు ఇచ్చాయని, ఆదేవిధంగా జిఓ ఉపసంహరణపై కొన్ని మార్పులు, చేర్పులు చేయాలని కోరాయని తెలిపారు. వీటిపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని, వారం, పదిరోజుల్లో ఇందుకు సంబంధించిన ప్రక్రియను మొదలుపెడతామని చెప్పారు. 117 జిఓ వల్ల ఇబ్బంది పడ్డ ఉపాధ్యాయులకు పాత పాయింట్లు ఇవ్వాలని సంఘాలు కోరితే దానికి అంగీకరించామన్నారు. సిఫార్సు బదిలీలు చేస్తే తప్పేంటని ప్రశ్నించారు. పాఠశాలలు, విద్యా సమాచారం ఇవ్వడం ప్రభుత్వ బాధ్యత అన్నారు. బదిలీలు చేయాలని ఏదో సమాధానం చెప్పారు. ఉపాధ్యాయులకు ప్రస్తుతం ఉన్న యాప్‌ల భారం నుంచి కొంత ఉపశమనం కల్పిస్తామని, సచివాలయ విద్య వాలంటీర్లకు కొన్ని బాధ్యతలు అప్పగిస్తామన్నారు. జెవికె కిట్లలో నాణ్యమైన బ్యాగులు, బూట్లు, సాక్సులు అందించకుండా పిల్లలకు ఇస్తున్నామని, అంత నాణ్యత లేదని ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవడం ఎంతవరకు సబబని మంత్రిని విలేకరులు ప్రశ్నించారు. తప్పుంటే సరిచేస్తామని మంత్రి అన్నారు. అందుకే ఈసారి ప్రతి మండలంలో జగనన్న విద్య (జెవి) కిట్ల శాంపిల్ ఉంచుతామన్నారు. మండల కేంద్రంలో ఉంచిన శాంపిల్‌ను ఉపాధ్యాయులు, ఎంఇఒలు తీసుకోవాలని చెప్పారు. శాంపిల్ కిట్ల నాణ్యతతో కూడిన కిట్లు రాకపోతే వెనక్కి పంపుతామన్నారు. శాంపిల్ కిట్ల నాణ్యతను పరిశీలించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలలు ప్రారంభమైన రోజే జెవికె కిట్లు అందిస్తామన్నారు. ఇంటర్ ఫలితాలు, సప్లిమెంటరీ పరీక్షలు పాఠశాలలకు వచ్చేలా ఏర్పాటు చేస్తామని తెలిపారు. విద్యార్థులు వస్తారని చెప్పారు. ఐఎఎస్ అధికారులందరూ ప్రతినెలా కనీసం రెండు పాఠశాలలు సందర్శించాలన్నారు. హైస్కూల్ ప్లస్ జిల్లాల్లో ఇంటర్ ఫలితాల్లో ఉత్తీర్ణత శాతం తగ్గడానికి కారణాలను విశ్లేషించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చామని చెప్పారు. వచ్చే విద్యా సంవత్సరంలో ఉత్తీర్ణత శాతం పెరిగేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో, ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం కావాలో అధికారులను కోరామన్నారు. సమావేశంలో పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్ సురేష్‌కుమార్, మౌలిక వసతుల కమిషనర్ కాటమనేని భాస్కర్, సమగ్ర శిక్ష డైరెక్టర్ బి శ్రీనివాసరావు, జాయింట్ డైరెక్టర్ రామలింగం, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



13న రిలే దీక్షలు

- తడిచిన ధాన్యాన్ని 72 గంటల్లో కొనాలి
- టిడిపి అధినేత చంద్రబాబు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

72 గంటల్లోగా తడిసిన ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలని, లేని పక్షంలో 9న తహశీల్దార్ కార్యాలయాలు, 11న కలెక్టరేట్లకు వినతిపత్రాలు అందించి నిరసన తెలియజేస్తామని మాజీ సిఎం చంద్రబాబు అన్నారు. అప్పటికీ స్పందించకపోతే 13న రిలే దీక్షలకు దిగుతామని హెచ్చరించారు. 'మా పంట మునిగింది– పరిహారం ఇవ్వండి' అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని... రైతులందరూ తమ పంటను వీడియో తీసి పోస్టు చేయాలని కోరారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని వివిఆర్ కన్వెన్షన్ హాల్లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తడిచిన ధాన్యం సేకరణలో ప్రభుత్వం ఎలాంటి నిర్దిష్టతలు పాటించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బస్తాకు రూ.700 నుంచి రూ.800 మించి రావడంలేదని తెలిపారు. మిగిలిన సొమ్ము మిల్లర్లు తింటున్నారా? దళారులు తింటున్నారా? అనేది పరిశీలించి చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. ఆయన వెంట మాజీ మంత్రులు జవహర్, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు, రూరల్ ఎమ్మెల్యే బుచ్చయ్యచౌదరి తదితరులున్నారు.

జిఓ1ని వెనక్కి తీసుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన అప్రజాస్వామిక జిఓ నెంబరు 1కి వ్యతిరేకంగా ఒకవైపు రాష్ట్రంలో ఆందోళనలు జరుగుతుంటే.. జిఓను పకడ్బందీగా అమలు చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పడం బాధ్యతారాహిత్యమని సిపిఎం రాష్ట్ర కమిటీ పేర్కొంది. ప్రజా ఉద్యమాలను, పౌరహక్కులను హరించే జిఓ 1ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో శాంతి భద్రతలను సమీక్షిస్తూ.. జిఓ 1ని పకడ్బందీగా అమలు చేయాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించడం సరికాదన్నారు. జిఓ 1కి వ్యతిరేకంగా రాష్ట్రంలో పోరాటాలు, వివిధ ప్రజా సంఘాలు, న్యాయవాదులు, మేధావులు, ప్రజాస్వామిక వాదులు, రాజకీయ పార్టీలు నిరంతరంగా నిరసనలు, ఆందోళనలు చేస్తుండగా.. ప్రభుత్వం ఏమాత్రం స్పందించకపోగా, మరింత కఠినంగా అమలు చేయాలని చెప్పడాన్ని తప్పుపట్టారు. ప్రజాభిప్రాయాన్ని ఏమాత్రం పరిగణనలోకి తీసుకోకుండా వ్యవహరించడమని విమర్శించారు. ప్రతిపక్ష పార్టీలు, ప్రజా సంఘాల సభలకు అనుమతినివ్వకపోవడం, ముఖ్యమంత్రి జిల్లాల పర్యటనలకు ముందే గృహ నిర్బంధాలు, ముందస్తు అరెస్టులతో రాష్ట్రంలో ఇప్పటికే అప్రకటిత నిషేధాజ్ఞలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. అధికార పార్టీ నిర్వహించే సభలకు ఈ షరతులేవీ వర్తించకపోవడం చూస్తుంటే ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ ప్రతిపక్ష పార్టీలు, ప్రజా సంఘాల నోరు నొక్కేయడమే ముఖ్యమంత్రి వైఖరిగా ఉందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరిని ప్రజాస్వామిక వాదులు, మేధావులు ఖండించాలని కోరారు. జిఓను ప్రజాగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని ప్రభుత్వం ప్రజాగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని పేర్కొన్నారు. ప్రతిపక్షం పోకుండా ఇప్పటికైనా జిఓ 1ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.



నేడు టెన్త్ ఫలితాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పదో తరగతి పరీక్ష ఫలితాలు శనివారం విడుదల కానున్నాయి. విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ విజయవాడలో ఈ ఫలితాలను విడుదల చేయనున్నారు. ఉదయం 11 గంటలకు గేట్‌వే (విజయవాడ)హోటల్‌లో ఈ కార్యక్రమం జరగనుంది. ఏప్రిల్ 3 నుంచి 18 వరకు జరిగిన పదో తరగతి పరీక్షలకు రాష్ట్ర వ్యాప్తంగా 6,64,000 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షలు నిర్వహించిన 18 రోజుల్లోనే ఫలితాలను విడుదల చేస్తున్నట్లు మంత్రి బొత్స విలేకరులతో శుక్రవారం చెప్పారు. ఎలాంటి అవకతవకలు లేకుండా పరీక్షలను విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. పరీక్ష ఫలితాలు ఎస్ఎస్‌సి.శివం.జిఒవి.ఐఎన్,www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో ఉంటాయని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ డి దేవానంద‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులు వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చని వెల్లడించారు.

2024లో మతం కార్డు పని చేయదు

- మోడీ సర్కార్ జిమ్మిక్కులు ప్రజలకు అర్థమయ్యాయి
- ఈ దఫా ఇంటికే
- బిబిసి ప్రత్యేక ఇంటర్వ్యూలో సత్యపాల్ మాలిక్



చైల్డ్ లైన్ 1098 సేవలు భేష్

● కేసలి అప్పారావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆపదలో ఉన్న బాలల రక్షణ కోసం దేశవ్యాప్తంగా పనిచేస్తున్న చైల్డ్ లైన్ 1098 సేవలు భేష్ అని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావు పేర్కొన్నారు. మంగళగిరిలోని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కార్యాలయంలో శుక్రవారం వివిధ జిల్లాలకు చెందిన చైల్డ్ లైన్ కో-ఆర్డినేటర్లు బాలల హక్కుల ఛైర్మన్‌ను కలిశారు. ఈ సందర్భంగా చైల్డ్ లైన్ వారు రూపొందించిన బాలల భద్రత-అందరి బాధ్యత అనే పోస్టరును ఆవిష్కరించారు. అనంతరం కేసలి అప్పారావు మాట్లాడుతూ.. బాల్య వివాహాలు సమాజానికి సిగ్గుచేటని, బాల్య వివాహాలు లేని సమాజ నిర్మాణానికి అందరూ కలిసి కట్టుగా కృషి చేయాలన్నారు. చైల్డ్ లైన్ 1098 ద్వారా బాల్య వివాహాల నిలుపుదలకు కలిసి పనిచేస్తున్న వివిధ సంస్థలు, సంఘాలను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో కమిషన్ సభ్యులు రాజేంద్రప్రసాద్, పద్మావతి, సెక్రటరీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

లొంగిపోయిన గంగిరెడ్డి

● చంచల్‌గూడ జైలుకు తరలింపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ఎర్ర గంగిరెడ్డి శుక్రవారం నాంపల్లిలోని సిబిఐ కోర్టులో లొంగిపోయారు. జూన్ 2వ తేదీ వరకు న్యాయస్థానం ఆయనకు రిమాండ్ విధించింది. వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం ఆయనను చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఛార్జిషీటు దాఖలు చేయడంలో సిబిఐ జాప్యం కారణంగా, ఎ1గా ఉన్న ఎర్ర గంగిరెడ్డికి 2019 జూన్ 27న పులివెందుల కోర్టు బెయిల్ మంజూరు చేసింది. గంగిరెడ్డి బయట ఉండటం వల్ల కేసు దర్యాప్తునకు ఆటంకం కలుగుతోందని, ఆయన బెయిల్ రద్దు చేయాలని తెలంగాణ హైకోర్టును సిబిఐ ఆశ్రయించింది. సిబిఐ వాదనలను సమర్థించిన న్యాయస్థానం గంగిరెడ్డికి బెయిల్ రద్దు చేసింది. మే 5లోగా గంగిరెడ్డి లొంగిపోవాలని, లేని పక్షంలో అరెస్ట్ చేయాలని సిబిఐని ఆదేశిస్తూ గత నెల 27న హైకోర్టు తీర్పు వెల్లడించింది. ఈ నేపథ్యంలో సిబిఐ కోర్టులో గంగిరెడ్డి లొంగిపోయారు.

గృహ నిర్మాణ సంస్థ ఆస్తులు, నిధులు కాపాడేందుకు కృషి

● హౌసింగ్ ఎమ్‌డి లక్ష్మీశా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గృహ నిర్మాణ సంస్థ ఆస్తులు, నిధులను పరిరక్షించడానికి ఉద్యోగులు కృషి చేయాలని రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరెక్టరు లక్ష్మీశా పేర్కొన్నారు. గృహ నిర్మాణ సంస్థ ఆర్థిక, గణాంక, ఆడిట్ విభాగం పురోగతి సాధించిన నేపథ్యంలో విజయవాడలోని ఆటోనగర్‌లో సంస్థ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఎమ్‌డి లక్ష్మీశా మాట్లాడుతూ.. 2016-17కు సంబంధించి అటాచ్ చేసిన రూ.5.45 కోట్లను తిరిగి వడ్డీతో సహా గృహ నిర్మాణ సంస్థకు జమయ్యేలా సంస్థ ఆర్థిక, గణాంక, ఆడిట్ విభాగం కృషి చేసిందన్నారు. ఈ సందర్భంగా ఆయా విభాగాల్లోని ఉద్యోగులను ఎమ్‌డి అభినందించారు. ఉద్యోగులకు ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ సంస్థ అకౌంట్స్, ఆడిట్ విభాగం జనరల్ మేనేజరు ఎన్ అన్నపూర్ణ, పి శ్రీరాములు, ఎన్ శ్రీనివాసరావు, మేనేజర్లు పాల్గొన్నారు.

ఏప్రిల్‌లో వైజాగ్ స్టీల్ అత్యుత్తమ పనితీరు

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

గడిచిన నెలలో విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ అత్యుత్తమ పనితీరును కనబరిచింది. రెండు బ్లాస్ట్ ఫర్నేస్‌ల నుంచి 4 లక్షల 19 టన్నుల హాట్ మెటల్‌ను ఉత్పత్తి చేసింది. గత సంవత్సరం కంటే 20 శాతం అధికమని యాజమాన్యం ఓ ప్రకటనలో పేర్కొంది. బ్లాస్ట్ ఫర్నేస్ - 1 గోదావరి నుంచి 2 లక్షల 2 వేల టన్నులు, బ్లాస్ట్ ఫర్నేస్ - 2 కృష్ణా నుంచి 2 లక్షల 18 వేల టన్నుల హాట్ మెటల్ ఉత్పత్తి అయినట్టు వెల్లడించింది.

స్ట్రక్చరల్ మిల్ నుంచి 61 వేల టన్నుల ఉత్పత్తులు, విస్తరణ యూనిట్ల నుంచి లక్షా నలభై మూడు వేల టన్నుల ఫినిష్ స్టీల్, 80 వేల టన్నుల హై అండ్ వాల్యూ యాడెడ్ స్టీల్ ఉత్పత్తులను విశాఖ స్టీల్ ప్లాంట్ సాధించినట్లు అధికారులు తెలిపారు. సాంకేతికంగానూ ఈ సంవత్సరం ఉత్తమంగా పనిచేసినట్లు పేర్కొన్నారు. అత్యుత్తమ ఉత్పత్తిని సాధించినందుకు ఉక్కు ఉద్యోగుల కృషిని స్టీల్‌ప్లాంట్ సిఎండి అతుల్‌భట్ అభినందించారు.

సోషలిజమే ప్రత్యామ్నాయం

● పెట్టుబడిదారీ వ్యవస్థ సంక్షోభాలమయం

● 'ప్రపంచ ఆర్థిక మాంద్యం- ప్రజలపై ప్రభావాలు' సదస్సులో వి.శ్రీనివాసరావు



సదస్సులో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

పెట్టుబడిదారీ వ్యవస్థ సంక్షోభాలమయమని నాడు కారల్ మార్క్స్ చెప్పిందే నేడు రుజువు అవుతోందని..సోషలిజమే ప్రత్యామ్నాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. కారల్‌మార్క్స్ జయంతిని పురస్కరించుకుని 'ప్రపంచ ఆర్థిక మాంద్యం-ప్రజలపై ప్రభావాలు' అన్న అంశంపై అనంతపురంలోని ఎన్‌జిఒ హోంలో శుక్రవారం సదస్సు నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బాలరంగయ్య అధ్యక్షతన జరిగిన ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా వి.శ్రీనివాసరావు హాజరై ప్రసంగించారు. కమ్యూనిజానికి కాలం చెల్లింది... కాలంతోపాటు మారాలి అని కొందరు అంటున్నారని, కాని, మారాల్సింది కమ్యూనిస్టులు కాదని... పెట్టుబడి మద్దతుదారులన్నది స్పష్టమవుతోందని చెప్పారు. నేడు పెట్టుబడిదారీ వ్యవస్థ తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటోందన్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో కీలకంగా చెలామణి అవుతున్న డాలర్ విలువ రోజురోజుకూ పడిపోతోందని వివరించారు. రెండు వందల సంవత్సరాల క్రితమే ఈ సమాజంలోని అంతరాలు, బాధలకు గల కారణాలను కారల్ మార్క్స్ పరిశోధించి, తర్కించి సమాజంలోని అంతర్గత సూత్రాన్ని గ్రహించి సమాజ గమనానికి మూల కారణం శ్రమ అని తెలియజేశారని గుర్తుచేశారు. ఈ శ్రమ ద్వారానే సంపద సృష్టించబడుతోందని చెప్పారు. అయితే ఇది కొద్ది మంది పెట్టుబడిదారుల చేతుల్లోకి వెళ్తోందన్నారు. దీనికి మద్దతుగా పాలకులు నిలవడం శోచనీయమన్నారు. ఈ దోపిడీకి వ్యతిరేకంగా శ్రమజీవులు ఏకమై పోరాడినప్పుడే సమసమాజ స్థాపన జరుగుతుందని వివరించారు. కారల్‌మార్క్స్ చెప్పిన ఈ సూత్రానికి అనుగుణంగా ప్రజలను సమైక్యపరచి దోపిడీకి, పీడనకు వ్యతిరేకంగా ప్రజలను సన్నద్ధం చేయాలని పిలుపునిచ్చారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ మాట్లాడుతూ.. నేడు ప్రపంచాన్ని సంక్షోభం పట్టి పీడిస్తోందని చెప్పారు. ఇది కమ్యూనిస్టులు చెబుతున్న మాటకాదని, ప్రపంచబ్యాంకు, ఐఎంఎఫ్, ఐక్య రాజ్యసమితి వంటి సంస్థలే చెబుతున్నాయని పేర్కొన్నారు. 2023 అక్టోబరు నాటికి ప్రపంచ ఆర్థిక సంక్షోభం తారా స్థాయికి చేరుతుందని ప్రపంచ బ్యాంకు అధ్యక్షులు ఇటీవల ప్రకటించారని చెప్పారు. ఈ సంక్షోభాలతో ఉపాధి మరింత మందగించడమే కాకుండా ఉన్న ఉపాధిని కోల్పోయే పరిస్థితులు నెలకొంటాయన్న అంచనాలు వేస్తున్నారన్నారు. ఇంతటి తీవ్రమైన సంక్షోభాలకు ఆర్థిక వ్యవస్థలోనున్న లోపాలే కారణమని తెలిపారు. ఇదే విషయాన్నే నాడు మార్క్స్ తన సిద్ధాంతం ద్వారా తెలియజేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక నాయకులు ఎస్‌ఎం.బాషా, చంద్రశేఖర్, రిటైర్డు డిఆర్‌ఒ గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

వేసవి సెలవుల్లోనే బదిలీలు

● సిఫార్సు బదిలీలు వద్దు

● ఉపాధ్యాయ సంఘాల డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధ్యాయ బదిలీలను వేసవి సెలవులు ముగిసేలోపే పూర్తిచేయాలని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణను ఉపాధ్యాయ సంఘాలు కోరాయి. అక్రమ బదిలీలు చేపడితే అడ్డుకుంటామని హెచ్చరించాయి. బదిలీలకు అడ్డంగా ఉన్న నిబంధనలు తొలగించి త్వరగా పూర్తిచేయాలని కోరినట్లు యుటిఎఫ్ అధ్యక్షులు ఎన్ వెంకటేశ్వర్లు విలేకరులతో చెప్పారు. 117 జిఒను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బదిలీల గరిష్ట కాలపరిమితి ఎనిమిదేళ్లు ఉంటుందని తెలిపారు. సమగ్ర మార్గదర్శకాలు బదిలీలకు రూపొందించాలని కోరారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఉమ్మడిగా బదిలీలు నిర్వహించొద్దని కోరామన్నారు. బోధనేతర పనులు అప్పగించొద్దని డిమాండ్ చేశారు. హైస్కూల్ ప్లస్‌లో 1,752 పోస్టులను భర్తీ చేస్తామని మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు. జెవి కిట్లను పాఠశాలల వద్దకే అందించాలని కోరామన్నారు. అన్ని కేడర్లకు పదోన్నతులు చేపట్టాలని ఎస్‌టియు అధ్యక్షులు హెచ్ తిమ్మన్న, సాయిశ్రీనివాస్ కోరారు. ఆదర్శ పాఠశాలలకు 010 హెడ్ ద్వారా జీతాలు, ఆరోగ్యకార్డులు, పదోన్నతులు, బదిలీలు కల్పించాలని కోరారు. మంత్రి జరిపిన చర్చల్లో యుటిఎఫ్ గౌరవ అధ్యక్షులు కె శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి కెఎస్‌ఎస్ ప్రసాద్, కార్యదర్శి మనోహర్, ఎపిటిఎఫ్ (257) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి హృదయరాజు, సిహెచ్ మంజుల, ఆప్టా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రకాష్‌రావు, ఎపిటిఎఫ్ (1938) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి హృదయరాజు, చిరంజీవి, బిటిఎ అమరావతి అధ్యక్షులు శరత్ చంద్ర తదితర సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రతి గింజా కొనాల్సిందే

● గోనె సంచులు ఇవ్వలేని దద్దమ్మ ప్రభుత్వం

● టిడిపి అధినేత చంద్రబాబునాయుడు


రామచంద్రపురం మండలం వేగాయమ్మపేటలో మొలకెత్తిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న చంద్రబాబు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

రైతులకు గోనె సంచులు కూడా సరఫరా చేయలేని దద్దమ్మ ప్రభుత్వం ఇది అని మాజీ ముఖ్యమంత్రి, టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు విమర్శించారు. 40-50 శాతం పంట ఇంకా కళ్లాల్లోనే ఉందన్నారు. రైతులను ఆదుకునే బాధ్యత ఈ ప్రభుత్వానికి లేదా? అని ప్రశ్నించారు. రెండు రోజుల జిల్లా పర్యటనలో భాగంగా ఆయన శుక్రవారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రాపురం మండలం వేగాయమ్మపేట, తూర్పుగోదావరి జిల్లా కడియంలో పర్యటించారు. వర్షాలకు దెబ్బతిన్న పంట పొలాలను, మొలకెత్తిన ధాన్యం రాశులను పరిశీలించి రైతులతో మాట్లాడారు. అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ.. దాళ్వా పంటలకు రాష్ట్ర ప్రభుత్వం ఇన్సూరెన్స్ కూడా కట్టలేదని విమర్శించారు. వెంటనే రైతులకు పంట నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. నిబంధనల పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేయడం తగదని విమర్శించారు. తడిసిన, రంగు మారిన ధాన్యంపై 24 గంటల్లో ప్రకటన చేవ్వకపోతే రైతుల పోరాటానికి టిడిపి అండగా నిలుస్తుందన్నారు. రైతులకు అండగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉండాలని సూచించారు. తమ కార్యకర్తలపై పోలీసు వేధింపులు అధికమయ్యాయని, ఇప్పటికైనా పోలీసులు ఓవరాక్షన్ తగ్గించుకోవాలని హితవు పలికారు. ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, వేగుళ్ల జోగేశ్వరరావు, మాజీ మంత్రులు గొల్లపల్లి సూర్యారావు, పత్తిపాటి పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

ఆదిరెడ్డి అప్పారావు, వాసులను కలిసిన బాబు

ఇటీవల చిట్‌ఫండ్ కేసులో అరెస్టయి రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో రిమాండ్ ఖైదీలుగా ఉన్న మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, ఆయన కుమారుడు, ఎమ్మెల్యే భవాని భర్త వాసును ములాఖత్‌లో భాగంగా చంద్రబాబునాయుడు కలిశారు. అనంతరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు కుటుంబసభ్యులను పరామర్శించారు. అరెస్టుకు సంబంధించిన విషయాలను అడిగి తెలుసుకున్నారు. పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని భవానికి ధైర్యం చెప్పారు. ఆయన వెంట టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు, మాజీ మంత్రి పితాని సత్యనారాయణ తదితరులున్నారు.

నూతన ఆర్థిక విధానాలను తిప్పికొడదాం

● ప్రభుత్వ విద్యా రంగాన్ని కాపాడుకొనేందుకు పోరాటం

● కె శేషగిరి మాస్టరి ద్వితీయ వర్థంతి సభలో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు



యుటిఎఫ్ నాయకులు శేషగిరి వర్థంతి సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి- విజయనగరం ప్రతినిధి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తోన్న వినాశకర ఆర్థిక సంస్కరణలను తిప్పికొట్టడం ద్వారానే ప్రభుత్వ రంగాన్ని రక్షించుకోగలమని, ప్రభుత్వ విద్యను కాపాడుకోగలమని పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అన్నారు. విద్యా రంగంలో ఉపాధ్యాయులకు, విద్యార్థులకు వ్యతిరేకంగా తెచ్చిన మార్పులపైనా, విద్యారంగ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగానూ పోరాడాలని పిలుపునిచ్చారు. ఉద్యోగ, ఉపాధ్యాయ ఐక్య ఉద్యమ నేత, కీర్తిశేషులు కె.శేషగిరి ద్వితీయ వర్థంతి సభ విజయనగరం జిల్లా పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో యుటిఎఫ్ ఆధ్వర్యాన శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా 'భారత రాజ్యాంగం - ఆర్థిక విధానాలు - సామాజిక న్యాయం' అనే అంశంపై లక్ష్మణరావు స్మారకోపన్యాసం చేశారు. సంపద వికేంద్రీకరణ, శ్రమకుతగ్గ వేతనాలు, భూపంపిణీ, విద్య, వైద్యం తదితర రంగాలపై ప్రభుత్వ ఆధిపత్యం వంటివి భారత రాజ్యాంగం కల్పించిందన్నారు. అందువల్లే స్వాతంత్ర్యం అనంతరం దేశంలో స్టీల్‌ప్లాంట్, హెచ్‌పిసిఎల్, పోర్టు వంటి ఎన్నో ప్రభుత్వ రంగ పరిశ్రమలు ఏర్పడ్డాయని, తద్వారా దేశం ఆర్థికంగా నిలదొక్కుకోవడంతోపాటు రిజర్వేషన్లు, ఉద్యోగ భద్రత వంటివి అందుబాటులోకి వచ్చాయని తెలిపారు.

1991 తరువాత నూతన ఆర్థిక విధానాల వల్ల రాజ్యాంగ హక్కులకు తూట్లు పడుతున్నాయన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చాక ఈ విధానాలను వేగవంతం చేస్తూ స్టీల్‌ప్లాంట్ వంటి పెద్దపెద్ద పరిశ్రమలను ప్రయివేటీకరించేందుకు యత్నిస్తోందన్నారు. విద్య, వైద్యం సహా అన్ని రంగాలూ ప్రయివేటుపరం అవుతున్నాయని తెలిపారు. నూతన విద్యా విధానాన్ని, విద్య వ్యాపారీకరణను అందరూ వ్యతిరేకించాలని కోరారు. శాస్త్రీయ ఆలోచనలతో ఉన్న పాఠ్యాంశాలను తొలగించి, వాటి స్థానంలో మతతత్వాన్ని పెంచే పాఠాలు చేర్పిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రయివేటీకరణ, కార్పొరేటీకరణ, మతతత్వానికి వ్యతిరేకంగా పోరాడడమే శేషగిరి మాస్టారుకు అర్పించే నిజమైన నివాళని పేర్కొన్నారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు రమేష్ చంద్ర పట్నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో యుటిఎఫ్, ఎపిటిఎఫ్ (1938), వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం, వివిధ ప్రజా, ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు. తొలుత శేషగిరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఎన్నికల ముందు వైసిపి డ్రామాలు

● టిడిపి ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నాలుగేళ్లపాటు నిద్రపోయి, ఎన్నికల ముందు కళ్యాణమస్తు అంటూ సిఎం జగన్ డ్రామాకు తెరతీశారని టిడిపి ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ విమర్శించారు. టిడిపి కార్యాలయం ఎన్‌టిఆర్ భవన్‌లో శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న పెళ్లికానుక నిధులను ఇప్పటివరకు విడుదల చేయలేదన్నారు. ఫిబ్రవరిలో 4,500 మందికి పెళ్లికానుక బటన్ నొక్కారని, లబ్ధిదారుల ఖాతాల్లో మాత్రం జమకాలేదని విమర్శించారు. ఏప్రిల్ 26న సిఎం జగన్ విడుదల చేసిన వసతి దీవెన నిధులు ఇప్పటికీ 80 శాతం మంది విద్యార్థులకు అందలేదని ఎమ్మెల్సీ భూంరెడ్డి రాంభూపాల్ రెడ్డి ఒక ప్రకటనలో విమర్శించారు. రైతుల్ని వేధిస్తున్న జగన్‌కు కౌంట్‌డౌన్ మొదలైందని మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర మరో ప్రకటనలో విమర్శించారు. పంటలు కొట్టుకుపోతున్నా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. 2022లో గుడివాడ కె-కన్వెషన్ సెంటర్‌లో నిర్వహించిన అక్రమ కేసినోల నిర్వహణలపై సమగ్ర విచారణ చేసి నేరస్తులను కఠినంగా శిక్షించాలని ఇడికి టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య ఫిర్యాదు చేశారు. దళితుణ్ని చంపిన ఎమ్మెల్సీ అనంతబాబును మంత్రి పినిపే విశ్వరూప్ గృహ ప్రవేశ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పిలవడం దళితజాతిని అవమానించడమేనని టిడిపి అధికార ప్రతినిధి మహాసేన రాజేష్ విమర్శించారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురు దుర్మరణం

● దైవదర్శనానికి వెళ్లి ముగ్గురు

● కూలి పనులకెళ్లి ఇద్దరు



ప్రజాశక్తి - శ్రీకాళహస్తి/ తిరుపతి అర్బన్

వేర్వేరు ప్రమాదాల్లో తిరుపతి జిల్లాలో శుక్రవారం ఐదుగురు దుర్మరణం పాలయ్యారు. దైవదర్శనానికి వెళ్లి ముగ్గురు, మామిడికాయల ట్రాక్టర్ బోల్తా పడి ఇద్దరు కూలీలు మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తమిళనాడు రాష్ట్రంలోని తొట్టంబేడు మండలం కంచనపల్లి గ్రామానికి చెందిన దయాసాగర్‌రెడ్డి తమ కుటుంబంతో కలిసి శ్రీకాళహస్తి పట్టణం బంగారమ్మ కాలనీలో ఉంటూ సిమెంటు రాళ్ల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. దయాసాగర్ రెడ్డి తన భార్య మధుమతి, కుమారుడు సూర్యతేజరెడ్డి, కోడలు మౌనికతో కలిసి కారులో తిరువన్నామలైకి దైవర్శనానికి వెళ్లారు. అనంతరం తిరిగి వస్తున్న సమయంలో వేలూరు వద్ద కారు ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో దయాసాగర్ రెడ్డి (52), సూర్యతేజరెడ్డి (35) అక్కడకక్కడే మతిచెందారు. మధుమతి, మౌనిక (32)కు తీవ్రగాయాలు కావడంతో సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మౌనిక మృతి చెందింది. సూర్యతేజ రెడ్డి, మౌనికకు ఇటీవలే వివాహమైంది. వీరిద్దరూ డాక్టర్లు. తిరుపతి జిల్లా రామచంద్రాపురం మండలం నెత్తకుప్పం ఎల్‌విపురం దగ్గర మామిడికాయల లోడ్‌తో వెళుతున్న ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ ఘటనలో వడమాలపేట మండలం అబ్బికండ్రిగకు చెందిన విద్యాశ్రీ (20), ఎర్రబ్బ (45) మృతి చెందారు. ట్రాక్టర్ డ్రైవర్‌తోపాటు మరో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. అబ్బికండ్రిగ నుంచి మామిడికాయలను చిత్తూరుకు తరలించే క్రమంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. రామచంద్రాపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


ఉక్కు దీక్షల్లో కూర్చున్న కెఎ.పాల్

స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే ఉంచాలి

● ప్రజాశాంతి పార్టీ అధ్యక్షులు కెఎ పాల్


ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

రాష్ట్రాభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తామని కేంద్ర ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షులు కెఎ పాల్ డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 813వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో కూర్చున్న నేతలకు, కార్మికులకు ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 32 మంది ప్రాణదానంతో, 26 వేల ఎకరాల భూ త్యాగంతో వచ్చిన స్టీల్‌ప్లాంట్‌ను అంబానీ, అదానీలకు కట్టబెడితే సహించేది లేదని హెచ్చరించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు నాడు రూ.ఐదు వేల కోట్లను ప్రభుత్వం పెట్టుబడిగా పెడితే, తిరిగి ప్రభుత్వానికి ప్లాంట్ పన్నులు, డివిడెంట్ల రూపంలో రూ.50 వేల కోట్లు చెల్లించిందని తెలిపారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ భూముల విలువ రూ.నాలుగు లక్షల కోట్లు ఉంటుందని, ఆ విలువైన సంపదను దోచుకోవడానికి అంబానీ, అదానీవంటి వారు చూస్తున్నారని తెలిపారు. ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న కార్మిక వర్గానికి ఎల్లవేళలా తాను అండగా ఉంటానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ చైర్మన్లు డి ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, సిఐటియు నాయకులు యు రామస్వామి, ఎఐటియుసి నాయకులు కెఎస్‌ఎన్ రావు, టిఎన్‌టియుసి నాయకులు విల్లా రామ్మోహన్‌కుమార్, కార్మిక సంఘాల నేతలు బి అప్పారావు, వరసాల శ్రీనివాసరావు, నీరుకొండ రామచంద్రరావు పాల్గొన్నారు.

హైకోర్టు తీర్పు వారికి చెంపపెట్టు

● సజ్జల రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు అమరావతిలో ఇళ్ల స్థలాలను ఇస్తుంటే పేదలు ఆ ప్రాంతంలో వుండరాదనే అన్యాయమైన డిమాండ్‌తో కొందరు పిటిషన్ వేశారని, ఆ పిటిషన్‌పై హైకోర్టు తీర్పు వారికి చెంపపెట్టులాంటిందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. తాడేపల్లిలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. అమరావతిలో పేదలకు ఇళ్లస్థలాలు ఇస్తే సామాజిక అసమతుల్యత వస్తుందనే వారికి ఈ తీర్పు చెంపదెబ్బ లాంటిదని అన్నారు. న్యాయం ఎలా ఉండాలో ఈ కోర్టు తీర్పు అలా ఉందన్నారు. పేదలకు అమరావతిలో నివసించే అవకాశం లేదనడం సరికాదన్నారు. అమరావతి నగరం నిర్మాణం కోసం అడుగు ఇప్పుడు పడుతుందని తెలిపారు. కార్మికులు, శ్రామికులు లేకుండా ఏ నగరమూ ఉండదన్నారు. త్వరలోనే ఆ ప్రాంతంలో అర్హులైన వారందరికీ ఇళ్ల స్థలాలను పంపిణీ చేస్తామన్నారు. వర్షాలు పడితే జగనన్న కాలనీల్లో నీళ్లు నిలవడం సహజమని అన్నారు. ఇప్పటికే అధికారులు పంట నష్టం అంచనా వేస్తున్నా.. చంద్రబాబు రాజకీయం చేసేందుకు గోదావరి జిల్లాల పర్యటన పెట్టుకున్నారని విమర్శించారు. 2014-19 మధ్య కాలంలో చంద్రబాబు నష్టపరిహారం ఎలా ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు.

ధాన్యం కొనుగోళ్లపై దుష్ప్రచారం : మార్గాని

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ఉదారంగా ఆదుకోండని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశిస్తే.. ప్రచారం కోసం పొలాలమీదికి వెళ్లి చంద్రబాబు దుష్ప్రచారం చేస్తున్నారని రాజమండ్రి ఎంపి మార్గాని భరత్ విమర్శించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రైతు పండించిన ప్రతి గింజనూ కొనాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగానే ఉభయగోదావరి జిల్లాల పర్యటనలను చంద్రబాబు పెట్టుకున్నారని విమర్శించారు. రాజమండ్రిలో అక్రమ మార్గాల్లో చిట్‌ఫండ్ సంస్థను నడిపిస్తుంటే.. సంఘీభావం తెలపడం ఏమిటని ప్రశ్నించారు.



ధర్నా చేస్తున్న మెప్మా ఆర్‌పిలు

అటెండెన్స్ విధానాన్ని రద్దు చేయాలని మెప్మా ఆర్‌పిల ధర్నా

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

మెప్మా ఆఫీసులో ఆర్‌పిలకు అటెండెన్స్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కర్నూలు జిల్లా మెప్మా కార్యాలయం ఎదుట ఆర్‌పిలు శుక్రవారం ధర్నా చేశారు. ధర్నాలో మెప్మా ఆర్‌పిల సంఘం జిల్లా కార్యదర్శి ఉమాదేవి, నగర కార్యదర్శి షబానాలు మాట్లాడుతూ.. కర్నూలు కార్పొరేషన్ పరిధిలోని మెప్మా ఆర్‌పిలు రోజు ఆఫీసుకు వచ్చి సంతకం చేయాలని నిబంధన పెట్టడం సరికాదన్నారు. వెంటనే అటెండెన్స్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఏ పథకం ప్రవేశపెట్టినా పని భారం ఆర్‌పిలపై పడుతుందని, ఆర్‌పిలపై పని భారాన్ని తగ్గించాలని కోరారు. ఆర్‌పిలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, టిఎ ఇవ్వాలని, కనీస వేతనాలు అమలు చేయాలని, హెచ్‌ఆర్ పాలసీ కల్పించాలని డిమాండ్ చేశారు. ఆందోళనకారులతో మెప్మా పిడి, ఐబి మురళి మాట్లాడారు. అటెండెన్స్ విధానం రద్దు చేస్తున్నామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ధర్నాలో ఆర్‌పిలు సంఘం నగర అధ్యక్షులు రుద్రమ్మ, తదితరులు పాల్గొన్నారు. అర్‌పిల ఆందోళనకు సిఐటియు నాయకులు మద్దతు తెలిపారు.

డ్రెయినేజీలో పడి బాలుడు మృతి

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్



ప్రమాదవశాత్తు డ్రెయినేజీలో పడి బాలుడు మృతి చెందిన సంఘటన ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గురునానక్ నగర్ ప్రాంతానికి చెందిన అభిరామ్ (6) నాక్ కల్యాణమండపం వద్ద ఆడుకుంటూ ప్రమాదవశాత్తూ డ్రెయినేజీలో పడి వర్షపు నీటి ప్రవాహం కారణంగా గల్లంతయ్యాడు. పోలీసులు, మున్సిపల్ కార్పొరేషన్, ఎన్‌డిఆర్‌ఎఫ్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. గురునానక్ కాలనీకి కిలోమీటర్ దూరంలో ఉన్న భారతీ నగర్ కాలువ వద్ద బాలుడిని కనుగొన్నారు. వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే ప్రాణాలు కోల్పోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. అల్లారుముద్దుగా పెంచుకున్న కుమారుడు చనిపోవడంతో తల్లిదండ్రులు వీరబాబు, నూకరత్నం కన్నీరుమున్నీరయ్యారు. మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే బాలుడు డ్రెయినేజీలో పడి మృతిచెందాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. గురునానక్‌నగర్‌లో భారీ మురుగు కాలువ ఉందని, దానిని పూర్తి స్థాయిలో మూసేయకపోవటంతో ఈ ప్రమాదం చోటుచేసుకుందని వాపోయారు.

సిపిఎం ఆందోళనతో రూ.5 లక్షలు ఇచ్చేందుకు అధికారుల హామీ

బాలుడి కుటుంబ సభ్యులను ప్రభుత్వం ఆదుకోవాలనీ, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కార్పొరేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీ వద్ద సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్. బాబూరావు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. సిపిఎం ఆందోళనతో దిగొచ్చిన అధికారులు మున్సిపల్ కార్పొరేషన్ నుండి రూ.లక్ష, ప్రభుత్వం నుండి రూ.3.50 లక్షలు, వైసిపి తూర్పు నియోజకవర్గ ఇన్‌ఛార్జి దేవినేని అవినాష్ ట్రస్టు నుండి రూ.50 వేలు మొత్తం రూ.5 నష్టపరిహారం అందజేస్తామని హామీ ఇచ్చారు.

దుర్గగుడి అధికారి నగేష్ సస్పెన్షన్


విధుల నుండి సస్పెండ్ అయిన దుర్గగుడి అధికారి వాసా నగేష్ (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి-వన్‌టౌన్
శ్రీ వెంకటేశ్వర స్వామివారి దేవస్థానం, ద్వారకాతిరుమల నుండి శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానానికి సాధారణ బదిలీపై వచ్చి సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న వాసా నగేష్ ఆదాయం మించి ఆస్తులు కలిగి ఉన్నట్లు ఎసిబి అధికారుల తనిఖీల్లో బయటపడడంతో శుక్రవారం ఆయనను అరెస్టు చేశారు. ఈ నేపథ్యంలో నగేష్‌ను విధుల నుండి సస్పెండ్ చేస్తున్నట్లు ఆలయ ఇఒ దర్భముళ్ల భ్రమరాంబ ఆదేశాలు జారీ చేశారు. నగేష్‌పై చట్ట పరమైన విచారణ పూర్తి అయ్యేవరకు ఈ సస్పెన్షన్ కొనసాగుతుందని ఆమె తెలిపారు.

కౌలురైతు ఆత్మహత్య


విశ్వనాథరెడ్డి

ప్రజాశక్తి-ములకలచెరువు (కడప జిల్లా)
అప్పుల బాధతో కౌలురైతు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కడప జిల్లా ములకలచెరువు మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పర్తికోట పంచాయతీ పరిధిలోని ఆవులవారిపల్లెకు చెందిన బి.విశ్వనాథెడ్డి (40) జీవనోపాధి నిమిత్తం బొలేరో వాహనాన్ని ఫైనాన్స్ కంపెనీలో రూ.8 లక్షలు అప్పులు చేసి కొనుగోలు చేశారు. బాడుగలు సక్రమంగా రాకపోవడంతో వాహనంపై తీసుకున్న ఫైనాన్స్ సకాలంలో చెల్లించలేకపోయారు. దీంతో కంపెనీ నిర్వాహకులు వాహనాన్ని జప్తు చేశారు. ఈ క్రమంలో స్వగ్రామంలోనే రెండు ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని టమోటా పంట సాగు చేశారు. ధరలు తగ్గిపోవడంతో తీవ్రంగా నష్టపోయారు. సుమారు రూ.4 లక్షల వరకు అప్పులు మిగిలాయి. పిల్లల చదువులు భారం కావడంతోపాటు చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక మనస్తాపానికి గురై టమోటా పంట సాగు చేసిన పొలం వద్దనే గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డారు. స్థానిక రైతులు, కుటుంబ సభ్యులు ఆయనను మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు.

ప్రజానుకూల విధానాల కోసం
సమరశీల పోరాటాలు


సాంస్కృతిక ప్రదర్శనలిస్తున్న చిన్నారులు


సభలో మాట్లాడుతున్న సిహెచ్ నర్సింగరావు

- కార్మిక రాజ్యం ఏర్పడితేనే కార్మికుల సమస్యలు పరిష్కారం
- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి-విజయవాడ
ప్రజానుకూల విధానాల కోసం సమరశీల పోరాటాలు చేయాల్సిన ఎంతైనా ఉందని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు అన్నారు. మేడే స్ఫూర్తితో సమ సమాజం కోసం, కార్మిక హక్కుల పరిరక్షణ కోసం పోరాడుదామని పిలుపునిచ్చారు. విజయవాడ బీసెంట్ రోడ్డులోని మహంతి మార్కెట్ వద్ద మేడే సందర్భంగా శుక్రవారం జరిగిన బహిరంగ సభలో ఆయన ముఖ్యవక్తగా పాల్గొని మాట్లాడారు. కార్మికరాజ్యం ఏర్పడితేనే కష్టజీవుల సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. కార్మికులకు సంబంధించిన అనేక సంక్షేమ చట్టాలు, హక్కులు మేడే స్ఫూర్తితో సాధించుకున్నామని తెలిపారు. [illegible] కార్మికుల పోరాటంలో కార్మికులు చనిపోవడాన్ని ప్రస్తావించారు. అనేక పోరాటాలు, త్యాగాలతో సాధించుకున్న చట్టాలను మోడీ ప్రభుత్వం కుదించి నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చిందన్నారు. వీటిని కార్మికుల హక్కులను హరించేట్టు, యజమానులకు అనుకూలంగా ఉండేట్టు రూపొందించిందని తెలిపారు. వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మోడీ సర్కారు కార్పొరేట్లకు అనుకూలమైన విధానాలను అమలు చేస్తోందన్నారు. ప్రజాధనంతో నిర్మించిన ప్రభుత్వ సంస్థలను, మౌలిక సదుపాయాలను ప్రయివేట్ వ్యక్తులకు కారుచౌకగా కట్టబెడుతోందని తెలిపారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణను నిరసిస్తూ కార్మికులు సుమారు రెండేళ్లుగా పోరాడుతున్నారని గుర్తు చేశారు. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్, విద్యుత్, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో కార్మికులు అప్పుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం సైతం బిజెపి విధానాలనే అమలు చేస్తోందని విమర్శించారు. జిఒ నెంబర్ ఒకటి తెచ్చి ప్రజా ఉద్యమాల అణచివేతకు పాల్పడుతోందన్నారు. కార్మిక, ప్రజా, రైతు వ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలు చేపట్టాల్సిన అవసరముందని తెలిపారు. సభలో సిఐటియు, హమాలీ యూనియన్, షాప్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు, చేపల మార్కెట్ కార్మికుల నాయకులు పాల్గొన్నారు. సభ ప్రారంభానికి ముందు ప్రజానాట్యమండలి అప్పన్న, రాజేశ్వరి బందం ఆధ్వర్యంలో సింగినగర్ కార్మికుల పిల్లలతో నిర్వహించిన కళా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.


అనంతపురం సర్వజన ఆస్పత్రిలో గర్భిణితో మాట్లాడుతున్న మంత్రి రజిని

రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజిల నిర్మాణం

- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్
దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజీలు మంజూరు చేసి నిర్మాణాలు ప్రారంభించామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. అనంతపురం జిల్లాలో శుక్రవారం ఆమె పర్యటించారు. ఎంపి తలారి రంగయ్య, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, జడ్‌పి చైర్మన్ గిరిజమ్మతో కలిసి ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిని తనిఖీ చేశారు. పిల్లలు, గర్భిణుల విభాగాలను పరిశీలించారు. అక్కడ అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. ఆస్పత్రిలో ఎంఒటి ఆపరేషన్ థియేటర్‌ను ప్రారంభించారు. అనంతరం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో వైద్య సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలలను నిర్మిస్తున్నామని తెలిపారు. వాటిలో ఐదు కాలేజీలలో వచ్చే విద్యా సంవత్సరం నుంచి అడ్మిషన్లు, బోధన తరగతులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. విజయనగరం, నంద్యాల, ఏలూరు, మచిలీపట్నం కాలేజీల్లో అడ్మిషన్లకు అనుమతులు వచ్చాయని, రాజమండ్రి మెడికల్ కాలేజీకి సైతం అనుమతి దక్కుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైద్యాన్ని పటిష్టం చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు అన్ని చర్యలూ తీసుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కలెక్టర్ ఎమ్.గౌతమి, ఎపిఎంఎస్ఐడిసి రాష్ట్ర డైరెక్టర్ మురళీధర్ రెడ్డి, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి డిఎంఇ సత్యవర ప్రసాద్, సూపరింటెండెంట్ రఘునందన్, డిఎంహెచ్ఒ వీరబ్బాయి, ఆర్‌డిఒ మధుసూదన్ పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం

- ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డిమాండ్

ప్రజాశక్తి - ఏలూరు
అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన రైతాంగానికి నష్టపరిహారమిచ్చి ఆదుకోవాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఏలూరులోని అన్నే భవనంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా అకాల వర్షాలు, వడగళ్ల వానలు, ఈదురు గాలుల వల్ల వరి, మొక్కజొన్న, పసుపు, అరటి, మిర్చి, కూరగాయలు తదితర పంటలు దెబ్బతిన్నాయన్నారు. పంట నష్టాలకు వెంటనే ఎన్యూమరేషన్ చేయాలని కోరారు. వరి, మొక్కజొన్న తదితర పంటలకు ఎకరాకు రూ.20 వేలు, పసుపు, అరటి, మిర్చి తదితర వాణిజ్య పంటలకు ఎకరాకు రూ.50 వేలు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నష్టపోయిన రైతుల పంట రుణాలు మాఫీ చేయాలని, బీమా పరిహారం అందజేయాలని కోరారు. ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు నిమ్మగడ్డ నరసింహ, జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు గంటా పాపారావు మాట్లాడుతూ.. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. నష్టపోయిన రైతులను ఆదుకోకపోతే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.విద్యార్హతగా నిర్ణయించామని తెలిపారు. ఎస్‌సిలకు గతంలో రూ.40 వేలుంటే ఇప్పుడు రూ.లక్ష ఇస్తున్నామన్నారు. కులాంతర వివాహాలు చేసుకున్న దళితులకు గతంలో రూ.75 వేలు ఇస్తే.. ఇప్పుడు రూ.1.20 లక్షలకు పెంచారని తెలిపారు. బిసిలకు రూ.50 వేల నుంచి రూ.లక్షకు పెంచామన్నారు. కళ్యాణమస్తు, షాదీతోఫా పథకంపై చర్చకు రావాలని డిమాండ్ చేశారు.

ఎయు ఇంజనీరింగ్ ఫలితాలు విడుదల


ఫలితాలు విడుదల చేస్తున్న ఎయు విసి ప్రసాదరెడ్డి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)
ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాలలో నాలుగు సంవత్సరాల ఇంజనీరింగ్ (సెల్ఫ్ సపోర్ట్) కోర్స్ ప్రవేశాలకు నిర్వహించిన ఎయుఇఇటి - 2023 ప్రవేశ పరీక్ష ఫలితాలను శుక్రవారం ఎయు విసి ఆచార్య పివిజిడి.ప్రసాద రెడ్డి విడుదల చేశారు. కడలి తేజశ్వి (విశాఖ) మొదటి ర్యాంక్, రెడ్డి జ్యోతి భాస్కర్ (శ్రీకాకుళం) రెండో ర్యాంక్, దువ్వి నక్షత్ర మానస (గుంటూరు) మూడో ర్యాంక్, జి.కిషోర్ (విశాఖ) నాలుగో ర్యాంక్, జిఎస్.చంద్రశేఖర్ (పశ్చిమ గోదావరి) ఐదో ర్యాంక్ సాధించారు. కేవలం ఒక్క రోజు వ్యవధిలోనే పరీక్ష ఫలితాలను విడుదల చేయడం విశేషం. ఈ పరీక్షకు 3952 మంది దరఖాస్తు చేయగా 3542 మంది హాజరయ్యారు. ఫలితాలను ఎయు వెబ్‌సైట్‌లో పొందుపరిచామని విసి తెలిపారు. త్వరలో ప్రవేశాల తేదీలను ప్రకటిస్తారు. ప్రవేశ పరీక్షలో విద్యార్థులు సాధించిన ర్యాంకుల ఆధారంగా ప్రవేశాలు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో ఎయు రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ప్రవేశాల సంచాలకులు ఆచార్య డి.ఎ.నాయుడు, సహాయ సంచాలకులు సివి.నాయుడు, వెంకటాద్రి పాల్గొన్నారు.

'పెళ్లికానుక' పై చంద్రబాబుకు మాట్లాడే అర్హత లేదు

- మంత్రి మేరుగ నాగార్జున

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
రాష్ట్రంలో పెళ్లికానుక ఎగ్గొట్టిన చంద్రబాబుకు కళ్యాణమస్తుపై మాట్లాడే అర్హత లేదని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగ నాగార్జున విమర్శించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో వైఎస్ఆర్ కళ్యాణమస్తు, షాదీతోఫా కింద 12,132 మంది జంటలకు రూ.87.32 కోట్లను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేరుగా వారి ఖాతాల్లో జమచేశారని తెలిపారు. ఇప్పటి వరకు 16,668 కుటుంబాలకు రూ.125.50 కోట్లు అందించారని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో పెళ్లికానుక కోసం 17,709 జంటలు దరఖాస్తు చేసుకుంటే ఇవ్వాల్సిన రూ.68.90 కోట్లను చంద్రబాబు ఎగ్గొట్టారని అన్నారు.

వైసిపి భూ దందాలపై సిట్ వేస్తా

- యువగళంలో నారా లోకేష్


కల్లూరు మండలంలో గొర్రెపిల్లను సంకనబెట్టుకుని నడుస్తున్న లోకేష్

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి
టిడిపి అధికారంలోకి రాగానే వైసిపి నాయకుల భూ అక్రమాలపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) వేసి విచారణ చేపడతామని, వైసిపి నాయకులు లాక్కున్న పేదల భూములను తిరిగి పేదలకు ఇప్పించేలా చూస్తామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ తెలిపారు. ఆయన చేపట్టిన యువగళం పాదయాత్ర శుక్రవారం కర్నూలు జిల్లా కల్లూరు మండలం పెద్దకొట్టాల విడిది కేంద్రం నుండి ప్రారంభమైంది. ఎ మార్కాపురం, సల్కాపురం, పెద్దపాడు మీదుగా కర్నూలు శివారు రేడియో స్టేషన్ వరకు సాగింది. పెద్దపాడు వద్ద బహిరంగ సభలో లోకేష్ మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి రాగానే కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని, తాము శంకుస్థాపన చేసిన వాటికే జగన్ మళ్లీ శంకుస్థాపన చేస్తున్నారని, చివరికి వైసిపి కూడా ఇతరులు రిజిస్టర్ చేసిన పార్టీ అని తెలిపారు. రేపో మాపో అబ్బాయిల లెక్కలన్నీ సిబిఐ తేలుస్తుందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మహిళలు, ప్రజలు, రైతులను జగన్ మోసం చేశారని విమర్శించారు. రైతుల మెడకు ఉరితాడు వేసేలా వ్యవసాయ మోటర్లకు మీటర్లు బిగించేందుకు వచ్చే వాళ్లను తరిమి కొట్టాలని, రైతులకు టిడిపి అండగా ఉంటుందని అన్నారు. దళితులకు జగన్ ప్రభుత్వం కట్ చేసిన 27 పథకాలను పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. మాజీ మంత్రులు భూమా అఖిల ప్రియ, ఏరాసు ప్రతాపరెడ్డి, ఎమ్మెల్సీ బిటి నాయుడు, టిడిపి నంద్యాల జిల్లా అధ్యక్షులు గౌరు వెంకటరెడ్డి, నియోజకవర్గ ఇంచార్జి గౌరు చరిత రెడ్డి, నంద్యాల జిల్లా టిడిపి మహిళా విభాగం అధ్యక్షులు పార్వతమ్మ, మాజీ ఎమ్మెల్యే బిసి.జనార్ధన్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం పాదయాత్రగా వెళ్లి విడిది కేంద్రంలో లోకేష్ బసచేశారు. శనివారం కర్నూలు నగరంలో పాదయాత్ర సాగనుంది.



శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

ప్రజాశక్తి -తిరుమల
తిరుమల శ్రీవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ జితేంద్ర కుమార్ మహేశ్వరి, రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శుక్రవారం ఉదయం స్వామివారి అభిషేక సేవలో పాల్గొన్నారు. ఆలయ అధికారులు వీరికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. విశాఖ శారద పీఠం పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి విఐపి ప్రారంభ విరామ దర్శన సమయంలో ఆయన ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతితో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు. సేవలో పాల్గొన్నారు. ఇఒ ధర్మారెడ్డి ఆలయ మహాద్వారం వద్ద స్వాగతం పలికారు. అనంతరం ఆలయం వెలుపల మీడియాతో స్వామి నందేంద్ర సరస్వతి మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 700 వేదపారాయణదారుల పోస్టులు భర్తీ చేయడం శుభపరిణామన్నారు. సినీ నటుడు హీరో నిఖిల్ కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడుతూ కార్తికేయ పార్ట్ రెండుగా వచ్చిన చిత్రాన్ని ప్రేక్షకులు గొప్ప విజయాన్ని ఇచ్చారని, తాను కొత్తగా నటించిన స్పై చిత్ర ప్రమోషన్ శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయని తెలిపారు.

47 వేల మంది పేదలకు
ఇళ్ల స్థలాలు

రాజధానిలో సిద్ధం చేస్తున్న అధికారులు



ప్రజాశక్తి-గుంటూరు
రాజధానిలోని ఆర్-5 జోన్ పరిధిలో ఎన్‌టిఆర్, గుంటూరు జిల్లాలోని పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. కోర్టు నుంచి ఎటువంటి అడ్డంకులు లేకపోవడంతో అధికారులు తమ ప్రక్రియను వేగవంతం చేశారు. రాజధానిలోని ఏడు గ్రామాల్లో మొత్తం 21 లే అవుట్‌లు సిద్ధం చేస్తున్నారు. మొత్తం 47 వేల మందికి పట్టాలు ఇవ్వనున్నారు. ఈ నెల 15 నాటికి ఇళ్ల పట్టాలకు లే అవుట్‌ల నిర్మాణం పూర్తి చేయాలని నిర్ణయించారు. ఎన్‌టిఆర్ జిల్లాలో 569.46 ఎకరాల్లో 24 వేలమందికి పేదలకుగాను తొలి విడతలో 20,684 మందికి ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి పట్టాలను సిద్ధం చేస్తున్నారు. ఇందుకుగాను కురగల్లు, నిడమర్రు, మందడం తదితర గ్రామాల్లో 11 లే అవుట్‌లు ఏర్పాటు చేస్తున్నారు. గుంటూరు జిల్లాలో 550 ఎకరాల్లో 23 వేల మంది పేదలకుగాను తొలివిడతలో 20 వేల మందికి పట్టాలు ఇవ్వనున్నారు. ఇందులో పెదకాకాని, తుళ్ళూరు, మంగళగిరి, తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో పేదలకు మందడం, కృష్ణాయపాలెం, నవులూరు, నిడమర్రు, ఐనవోలు గ్రామాల్లో పట్టాలు ఇవ్వనున్నారు. పెదకాకాని, తుళ్ళూరు, మంగళగిరి, తాడేపల్లి నగరపాలక సంస్థ, మంగళగిరి మండలాల్లోని పేదలందరికీ ఇంటి స్థలాల పంపిణీకి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

సొంతపార్టీ వాళ్లే శత్రువులు

- ఎంత కష్టం వచ్చినా కార్యకర్తలకు బాసటగా ఉంటా : బాలినేని

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్
సొంతపార్టీ వాళ్లే తన మీద తప్పుడు ప్రచారం చేస్తున్నారని, తన శత్రువులు తన పార్టీలోనే ఉన్నారని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకాశం జిల్లా ఒంగోలులోని తన నివాసంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సొంతపార్టీ నేతలే తనను అప్రతిష్టపాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. పార్టీలో తనకు ఎదురవుతున్న పరిణామాలు పట్ల చాలా బాధగా ఉందన్నారు. గతంలో చైన్నైలో బంగారు వ్యాపారుల వద్ద డబ్బులు పట్టుబడితే అది తన హవాలా డబ్బులు అన్నారని, ఆ తరువాత భూ కబ్జాలు చేస్తున్నారంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు తెలంగాణకు చెందిన గోనె ప్రకాశరావు తాను రూ.వంద కోట్లు సంపాదించానని అంటున్నాడని చెప్పారు. ఎక్కడో తెలంగాణకు చెందిన వ్యక్తి నా గురించి మాట్లాడాల్సిన అవసరం ఏముంది...? ఆయన చెబుతున్న వంద కోట్లు ఎక్కడున్నాయో చెబితే వెళ్లి తెచ్చుకుంటా..' అని అన్నారు. వైవి.సుబ్బారెడ్డి తనకు రాజకీయ భిక్ష పెట్టాడని మాట్లాడుతున్నాడని, తన తండ్రి 1977 నుంచే రాజకీయాల్లో ఉన్నారని, 1987లో యూత్ కాంగ్రెసులో తన రాజకీయ ప్రస్థానం మొదలైందని చెప్పారు. వైఎస్ రాజశేఖరరెడ్డి తన రాజకీయ గురువని, ఆయనే తనకు రాజకీయ భిక్ష పెట్టారని తెలిపారు. తన మీద తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, ఆరోపణలు రుజువు చేస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానని అన్నారు. ఎన్ని ఇబ్బందులు వచ్చినా పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటానని చెప్పారు. మూడు జిల్లాల రీజనల్ కో ఆర్డినేటర్ పదవికి రాజీనామా చేయడానికి కారణాలను వివరించారు. సొంత నియోజకవర్గానికి ఎక్కువ సమయం కేటాయించలేకపోతున్నాని, అందుకే ఆ పదవికి రాజీనామా చేశానని తెలిపారు. సమావేశంలో బాలినేని తనయుడు ప్రణీత్‌రెడ్డి, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత పాల్గొన్నారు.

సంపాదకీయం

గాలి బుడగ వ్యవస్థ


అమెరికాలో ప్రాంతీయ బ్యాంకులు వరుసగా దివాళా తీస్తున్న వైనం ప్రపంచ ఆర్థిక వ్యవస్థను కలవర పాటుకు గురిచేస్తోంది. ఉక్రెయిన్ వంటి దేశాలను బలవంతంగా యుద్ధంలోకి నెట్టేసి ఆయుధాల విక్రయాల ద్వారా తన పబ్బం గడుపుకోవాలని చూస్తున్న అమెరికా ఎంతసేపూ యుద్ధానికి రంకెలేయడం తప్ప...ప్రజల కొనుగోలు శక్తిని పెంచే ఉపాధి సృష్టి, నూతన అవకాశాల అన్వేషణ వంటి సంస్థాగత చర్యలకు ఉపక్రమించకపోవడం ప్రస్తుత సంక్షోభానికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. అమెరికా ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతోందంటూ ఆర్థిక వేత్తలు లబోదిబోమంటున్నారు. ఫెడరల్ రిజర్వ్ ఛైర్మన్ జెరోమి పావెల్ మాత్రం అబ్బే అదేం లేదు..ప్రాంతీయ బ్యాంకుల్లో పరిస్థితి అంతా నియంత్రణలోనే ఉందంటున్నారు. కానీ పావెల్ ఈ మాటలు అన్న మరుసటి రోజే పసిఫిక్ వెస్టన్ బ్యాంకు దివాళా తీస్తున్న బ్యాంకుల సరసన చేరిపోయింది. ఇప్పటికే సిల్వర్‌గేట్ బ్యాంకు, సిగ్నేచర్ బ్యాంకు, సిలికాన్ వేలీ బ్యాంకు, ఫస్ట్ హారిజోన్, టిడి బ్యాంక్, వెస్టన్ అలయన్స్, కెబిడబ్ల్యు నాజ్‌డాక్ వంటి చిన్న, పెద్దా అనే తేడా లేకుండా బ్యాంకులు ఒక్కటొక్కటిగా దివాళా తీస్తున్నాయి. తాజాగా ఫస్ట్ రిపబ్లిక్ బ్యాంకును అమ్మేయడం అమెరికా బ్యాంకింగ్ వ్యవస్థ కుప్పకూలిపోతోందన్న ఆందోళనలకు మరింత బలం చేకూర్చుతోంది. ఇదంతా ఒక్క అమెరికానే కాదు...బ్రిటన్, ఫ్రాన్స్ వంటి పెట్టుబడిదారీ దేశాలన్నింటినా ఇదే పరిస్థితి. అభివృద్ధి చెందిన పెట్టుబడి దేశాలకు వంత పాడుతున్న వర్ధమాన దేశాల్లో ఆర్థిక పరిస్థితులూ దిగజారుతున్నాయన్నది కాదనలేని సత్యం. శ్రీలంక, పాకిస్తాన్ ఎంతటి రుణ సంక్షోభాల్లో చిక్కుకుపోయాయో చూశాం.

భారత్‌లో సుదీర్ఘకాలంగా నడుస్తున్నవాటిలో ఒకటైన వాడియా గ్రూప్‌నకు చెందిన చౌక ధరల విమానయాన సంస్థ గో ఫస్ట్ ఎయిర్‌వేస్ దివాళా తీసింది. ఇది ఇక్కడితో ఆగేపోయేలా లేదు.

అమెరికాకు కానీ, పెట్టుబడిదారీ దేశాలకు గానీ సంక్షోభాలు కొత్త కాదు. అవి నిత్యం కొనసాగుతూనే వుంటాయి. గాలి బుడగల్లా వ్యవస్థలు కుప్పకూలుతూనే వుంటాయి. సంక్షోభ నివారణకు చేదు గుళికలంటూ శ్రమ దోపిడిని తీవ్రతరం చేయడం, ప్రజల మూలగలను సైతం జుర్రుకునేలా భారాలు మోపడం మళ్లీ అంతా బాగుందంటూ గప్పాలు పోవడం రివాజు. ప్రస్తుత సంక్షోభం కూడా అలాంటిదే. 2008లో అమెరికా సబ్‌ప్రైమ్ రుణాలు ఊబిలో చిక్కుకుపోయి ప్రపంచాన్ని మాంద్యంలోకి నెట్టిన వైనాన్ని చూశాం. ఆ సంక్షోభ పరిస్థితులు అంతకంతకూ విస్తరిస్తున్నాయే తప్ప తగ్గుముఖం పట్టింది లేదు. మహాశయుడు కార్ల్‌మార్క్స్ సంక్షోభం 'పెట్టుబడి' విత్తులోనే దాగుందని ఆనాడే ఉద్ఘాటించాడు. సంక్షోభాలకు తెర పడాలంటే శ్రమ దోపిడి వ్యవస్థకు సమాధి కట్టి కార్మిక నేతృత్వ సమతా సమాజానికి పురుడు పోయాలని ప్రపంచ కార్మిక లోకానికి లక్ష్యాన్ని నిర్దేశించారు.

అమెరికా బ్యాంకింగ్ వ్యవస్థలో పొడచూపిన తాజా సంక్షోభం ఇప్పటికే కోవిడ్ మహమ్మారి కారణంగా చితికిపోయిన దేశాల ఆర్థిక వ్యవస్థల పరిస్థితి పెనం మీది నుంచి పొయ్యిలో పడ్డ చందంగా తయారైంది. సంపద కేంద్రీకరణ, శ్రమదోపిడి, వనరుల దోపిడి వంటి వాటితో ప్రజలను పీల్చిపిప్పి చేస్తుండటంతో భారత్‌లోనూ దారుణ పరిస్థితులు నెలకొన్నాయి. అమెరికా బ్యాంకింగ్ వ్యవస్థ సంక్షోభ పరిస్థితుల్లో దేశ బ్యాంకింగ్ వ్యవస్థపై దాని ప్రభావంపై కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ఇటీవల సమీక్ష నిర్వహించారు. రుణాల రేట్ల విషయంలో మధ్యవర్తిత్వాన్ని తగ్గించడంపై దృష్టి పెట్టాలని, ప్రజల నుంచి డిపాజిట్లను రాబట్టేందుకు చర్యలు తీసుకోవాలని, అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల(క్రిప్టో వంటి కొత్తగా ఉనికిలోకి వచ్చిన ఆర్థిక వ్యవస్థలను విశ్వసించే అమెరికా బ్యాంకింగ్ వ్యవస్థ కుప్పకూలుతోంది)కు రుణ పరపతి పెంచాలని ఆర్థిక మంత్రి నిర్దేశించారు. కానీ ఇవన్నీ సంక్షోభాన్ని మరింత జటిలం చేస్తాయే తప్ప పరిష్కారం చూపవు. ఒక జిల్లా-ఒక ఉత్పత్తి, ఇ-నామ్, డ్రోన్ల తయారీ వంటి ప్రచార ఆర్భాటపు ప్రకటనలకే పరిమితమవుతున్న మోడీ సర్కార్ దేశ ఆర్థిక వ్యవస్థలో కీలకమైన వ్యవసాయ రంగం వెన్ను విరుస్తోంది. గ్రామీణాభివృద్ధికి, ఉపాధి హామీ చట్టానికి నిధులు తెగ్గోయడంతో పాటు, ఆంక్షలతో వాటి ఉసురుతీస్తోంది. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం పోటాపోటీగా ఎగబాకుతున్నాయి. సంక్షోభాల నుంచి భారత్‌కు ఊరట దక్కాలంటే.. సమస్యల్లో కొట్టుమిట్టాడుతున్న ప్రజల మధ్య మత విద్వేషాలు, వైషమ్యాలు రాజేయడం ద్వారా వారి దృష్టిని పక్కదారి పట్టిస్తున్న బిజెపిని ఇంటికి సాగనంపాల్సిందే.

మంచి మాట



పెట్టుబడిదారీ ఉత్పత్తికి నిజమైన అడ్డంకి పెట్టుబడే. ఉత్పత్తి చేయాలన్న సంకల్పానికి, ఉత్పత్తి ప్రయోజనానికీ...రెండింటికీ ఆరంభం, అంతం కూడా పెట్టుబడీ, దాని స్వీయ విస్తరణ ప్రయోజనం మాత్రమే. ఇక్కడ ఉత్పత్తి అనేది పెట్టుబడి కోసమే కాని ఉత్పత్తి కోసం పెట్టుబడి కానే కాదు.

- డియొన్నె బ్రాండ్,
కెనడియన్ కవయిత్రి

వ్యాఖ్య

ఆశలన్నీ కర్ణాటక పైనే

ప్రస్తుత పరిస్థితుల్లో కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలు ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. దక్షిణాది లోని ఇతర రాష్ట్రాలకు తన ప్రభావాన్ని విస్తరింపజేయాలని, అన్ని చోట్లా రాజకీయ ఆధిపత్యాన్ని చలాయించాలని తహతహలాడుతున్న బిజెపికి ఈ దక్షిణాది రాష్ట్రాన్ని నిలబెట్టుకోవడం అత్యంత కీలకంగా మారింది.

కర్ణాటక ఎన్నికల ప్రచారం అన్ని విధాల ఉచ్ఛ స్థితికి చేరిన నేపథ్యంలో బిజెపి విస్తృత స్థాయి ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటోంది. తీవ్రంగా వున్న ప్రభుత్వ వ్యతిరేకత, విశృంఖలమైన అవినీతి, ధరల పెరుగుదల, నిరుద్యోగం, రైతుల దయనీయ పరిస్థితులు వీటన్నింటిపై ప్రజల్లో నెలకొన్న తీవ్ర అసంతృప్తి ఇందుకు కారణం.

'ఆపరేషన్ కమల్' పేరుతో పాలక కూటమి నుండి ఫిరాయింపులకు పాల్పడడం ద్వారా కాంగ్రెస్-జె.డి (ఎస్) సంకీర్ణ ప్రభుత్వాన్ని కూల్చివేసిన తర్వాత 2019 జులైలో బిజెపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. అప్పటి నుండి, గత నాలుగేళ్లలో, ఇద్దరు ముఖ్యమంత్రులను, ముగ్గురు డిప్యూటీ ముఖ్యమంత్రులను రాష్ట్రం చూసింది. 2021 జులైలో బి.ఎస్.యడ్యూరప్ప వైదొలగి ముఖ్యమంత్రిగా బసవరాజ్ బొమ్మైకి అవకాశం కల్పించారు. కానీ, బొమ్మై ప్రభుత్వం పూర్తిగా అవినీతితో నిండిపోయింది. జె.డి (ఎస్) నుండి బిజెపికి మారిన బొమ్మై, దూకుడుతో హిందూత్వ మతోన్మాద ఎజెండాను అనుసరించడం ద్వారా తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని చూశారు.

గో వధపై కఠోరమైన నిషేధం విధించడం, ప్రధానంగా ముస్లింలు సాగించే మాంసం వ్యాపారానికి ఆటంకం కలిగించడం వంటి చర్యలతో బొమ్మై ప్రభుత్వం మెజారిటీవాదుల మనోభావాలను రెచ్చగొట్టి సొమ్ము చేసుకునేందుకు నగ్నంగా ప్రయత్నిస్తున్నది. క్రైస్తవులకు వ్యతిరేకంగా నిరంకుశమైన మత మార్పిడి చట్టాన్ని ప్రభుత్వం తీసుకొచ్చింది. ప్లస్ టూ చదివే విద్యార్థులు హిజాబ్ ధరించడంపై నిషేధం విధించింది. ఒబిసి కేటగిరీలో ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్‌ను రద్దు చేసింది. టిప్పు సుల్తాన్‌ను చంపింది బ్రిటీష్ వారు కాదని, వొక్కలిగ పురాణ పురుషులు ఇద్దరు చంపేశారనే అర్థం లేని కథనాన్ని తెరపైకి తీసుకురావడం ద్వారా ఆయనపై బురద చల్లే యత్నం చేసింది. మైనారిటీ వ్యతిరేక ఎజెండాను అమలు చేయడానికి కర్ణాటక ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు చూస్తుంటే హిందూత్వను గౌరవించే వారి జాబితాలో అగ్ర స్థానానికి చేరేందుకు గుజరాత్, ఉత్తరప్రదేశ్‌లతో పోటీ పడుతున్నట్లుగా కనిపిస్తోంది. అయితే, మతోన్మాద పోకడలకు మరింత పదును పెట్టడం, మెజారిటీవాదుల మనోభావాలను రెచ్చగొట్టి తనవైపు తిప్పుకోవడానికి యత్నించడం ద్వారా...రికార్డు స్థాయిలో అవినీతి, కార్పొరేట్ అనుకూల, కార్మిక వ్యతిరేక, రైతు వ్యతిరేక విధానాలను కప్పిపుచ్చాలని చూస్తున్నది. 40 శాతం కమిషన్‌ని ముడుపులుగా తీసుకుని బొమ్మై ప్రభుత్వం అవినీతికి పర్యాయపదంగా మారింది. వివిధ విభాగాలు, మంత్రిత్వ శాఖలకు చెందిన బిల్లులు ఆమోదం పొందాలంటే మొత్తం బిల్లులో 40 శాతం చొప్పున చెల్లించాల్సి వుందంటూ రాష్ట్ర కాంట్రాక్టర్ల అసోసియేషన్ చేసిన విమర్శే ఇది. ముడుపులు కావాలని డిమాండ్ చేశారంటూ ఆరోపించి కాంట్రాక్టర్ సంతోష్ పాటిల్ ఆత్మహత్యకు పాల్పడడంతో మంత్రి కె.ఎస్.ఈశ్వరప్ప తన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. ఇటీవల కాలంలో, ముడుపులు కావాలని డిమాండ్ చేసినందుకు బిజెపి ఎంఎల్ఎ, ఆయన కుమారుడిని అరెస్టు చేశారు. వారి ఇళ్ళ నుండి విజిలెన్స్ బ్యూరో అధికారులు రూ.8.1 కోట్లను స్వాధీనం చేసుకున్నారు.

> **బిజెపి-ఆర్ఎస్ఎస్ కూటమి గణనీయమైన రాజకీయ, సైద్ధాంతిక ప్రభావాన్ని కలిగివున్న ఏకైక దక్షిణాది రాష్ట్రం కర్ణాటక మాత్రమే. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి హిందూత్వ శక్తులకు పెద్ద ఎదురుదెబ్బ కాగలదు. అలాగే 2024 లోక్‌సభ ఎన్నికల్లో బిజెపికి తీవ్రమైన సవాలును విసిరేందుకు లౌకిక, ప్రజాతంత్ర ప్రతిపక్ష ఐక్యతను ఇది మరింత వేగవంతం చేస్తుంది.**



PEOPLE'S DEMOCRACY
THE WEEKLY PAPER OF THE COMMUNIST PARTY OF INDIA (MARXIST)

వ్యవస్థీకృతమైన అవినీతి ద్వారా ఇలా బహిరంగంగా దోపిడీ చేయడంతోబాటు రైతాంగ వ్యతిరేక విధానాలకు కూడా ప్రభుత్వం పాల్పడింది. వ్యవసాయ భూములను వ్యవసాయేతర ప్రయోజనాల కోసం మార్చేందుకు అనుమతించేలా భూ సంస్కరణల చట్టాన్ని సవరించింది. పార్లమెంట్ ఆమోదించిన వ్యవసాయ బిల్లుకు అనుగుణంగా వ్యవసాయ వాణిజ్యంలోకి కార్పొరేట్ల ప్రవేశాన్ని అనుమతించేందుకు ఎపిఎంసి యంత్రాంగాన్ని నిర్వీర్యం చేసింది. నిత్యావసర ఆహార పదార్థాలు, వంటనూనెల ధరల పెరుగుదల అనేది నిరుపేద వర్గాలకు అతి పెద్ద సమస్యగా మారిందని తాజా సర్వేల్లో వెల్లడైంది. అవినీతి, ధరల పెరుగుదలతో పాటు నిరుద్యోగం కూడా ప్రధాన సమస్యగా మారింది. ప్రభుత్వ వ్యతిరేకత బాగా బలంగా వుందని స్పష్టంగా గ్రహించిన బిజెపి కేంద్ర నాయకత్వం హిందూత్వ విభజన ఎజెండాను ప్రముఖంగా తెరపైకి తీసుకురావడానికి ప్రయత్నిస్తోంది. ఈ ప్రచారానికి స్వయంగా అమిత్ షా, నరేంద్ర మోడీ నాయకత్వ బాధ్యతలు నెత్తినేసుకున్నారు. బిజెపి తిరిగి అధికారంలోకి వస్తే ముస్లింలకు రిజర్వేషన్ రద్దు చేస్తామని అమిత్ షా ప్రకటించారు. ఒకవేళ కాంగ్రెస్ గెలుపొందితే, కర్ణాటకలో అల్లర్లు చెలరేగుతాయని ఆయన బెదిరించారు. తీవ్రవాదులను రక్షించేవారిగా, బుజ్జగింపు మాస్టర్లుగా కాంగ్రెస్ నాయకత్వాన్ని నరేంద్ర మోడీ చిత్రీకరిస్తున్నారు. బిజెపి ఎన్నికల ప్రణాళికలో ఉమ్మడి పౌర స్మృతి, జాతీయ పౌర పట్టికలను ప్రవేశపెట్టారు. ఆలయాల చుట్టూ స్థానిక వ్యాపారాలను క్రమబద్ధీకరించడం గురించి కూడా ఆ ఎన్నికల మేనిఫెస్టో మాట్లాడుతోంది. అంటే ఆలయాల చుట్టుపక్కల ముస్లింలు దుకాణాలు ఏర్పాటు చేసుకోకుండా నిషేధించారని అర్థం.

> **ఇటీవలి ఎన్నికల్లో బిజెపి అనుసరించే సాధారణ ఎత్తుగడలు, నినాదాలు పెద్దగా ఫలితాలను ఇవ్వడం లేదని ఇప్పటివరకు సాగిన ఎన్నికల ప్రచారం తెలియచేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం అన్ని రంగాల్లో వైఫల్యం చెందిన తీరును దృష్టిలో పెట్టుకుంటే "డబుల్ ఇంజన్ సర్కార్" అన్న నినాదం పూర్తిగా కుప్పకూలింది. హిందూత్వ తరుపుముక్కకు కూడా కొన్ని పరిమితులు వున్నాయి. ఇప్పటికే మతపరంగా చీలిపోయిన ప్రాంతాల్లో ఇది కొంచెం పని చేసే అవకాశం వుంది కానీ, అసమ్మతి, అసంతృప్తితో రగిలిపోతున్న అనేక వర్గాల ప్రజలను అంతగా ఆకర్షించలేకపోవచ్చు.**

ఇటీవలి ఎన్నికల్లో బిజెపి అనుసరించే సాధారణ ఎత్తుగడలు, నినాదాలు పెద్దగా ఫలితాలను ఇవ్వడం లేదని ఇప్పటివరకు సాగిన ఎన్నికల ప్రచారం తెలియచేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం అన్ని రంగాల్లో వైఫల్యం చెందిన తీరును దృష్టిలో పెట్టుకుంటే "డబుల్ ఇంజన్ సర్కార్" అన్న నినాదం పూర్తిగా కుప్పకూలింది. హిందూత్వ తరుపుముక్కకు కూడా కొన్ని పరిమితులు వున్నాయి. ఇప్పటికే మతపరంగా చీలిపోయిన ప్రాంతాల్లో ఇది కొంచెం పని చేసే అవకాశం వుంది కానీ, అసమ్మతి, అసంతృప్తితో రగిలిపోతున్న అనేక వర్గాల ప్రజలను అంతగా ఆకర్షించలేకపోవచ్చు. హిందూత్వ పిలుపులు కేవలం కోస్తా తీర ప్రాంత జిల్లాలకు, అలాగే సెంట్రల్, మలనాడ్ ప్రాంతంలో కొన్ని భాగాలకు పరిమితమైనట్లు కనిపిస్తోంది. పైగా టిక్కెట్ల పంపిణీపై బిజెపిలో లింగాయత్ నాయకత్వంలో నెలకొన్న నిరాశ ఆ వర్గానికి చెందిన కొంతమంది ప్రముఖ నేతలు పార్టీ నుండి బయటకు వెళ్ళిపోవడానికి దారి తీసింది.

"డబుల్ ఇంజన్" నినాదంలో అంతర్లీనంగా వున్న కేంద్రీకృత ధోరణికి వ్యతిరేకంగా ఈ ఎన్నికల్లో ప్రాంతీయ కన్నడిగ గుర్తింపును పరిరక్షించడమన్నది ఆవిర్భవించింది. కేంద్ర పోటీ పరీక్షల్లో కన్నడాన్ని నిర్లక్ష్యం చేసి హిందీని రుద్దడానికి ఈ డబుల్ ఇంజన్ ప్రభుత్వం తెగించింది. రాష్ట్రంలో పేరుమోసిన పాల బ్రాండ్ నందినిని దెబ్బ తీసేలా కర్ణాటక పాల సహకార సమాఖ్యను గుజరాత్ పాల సమాఖ్యతో విలీనం చేయడం గురించి మాట్లాడుతూ, కర్ణాటకలో అమూల్ చొరబాటుకు అనుమతించింది.

తీవ్ర నైరాశ్యంలో వున్న బిజెపి మోడీ ప్రచారంపైనే పూర్తిగా ఆధారపడింది. బిజెపి అభ్యర్థులకు ఓటు వేయడం ద్వారా ప్రధాని నరేంద్ర మోడీ పట్ల మీరు అభిమానం చూపినట్లే అంటూ బసవరాజ్ బొమ్మై ఎన్నికల ర్యాలీల్లో చెబుతున్నారు. మోడీకి ఓటు వేయాలంటూ ఇలా విజ్ఞప్తి చేయడం ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన హిమాచల్ ప్రదేశ్ ఎన్నికలను గుర్తు చేస్తోంది. 'బిజెపి అభ్యర్థిని మీరు గుర్తుంచుకోనక్కరలేదు, కేవలం కమలం చిహ్నాన్ని గుర్తుంచుకోండి. కమలానికి ఓటు వేయడమంటే మోడీకి ఓటు వేసినట్లే' అంటూ మోడీ తన ప్రసంగాల్లో పిలుపు ఇస్తున్నారు. ఈ ఎన్నికల్లో ఏమవుతుందో మనకు తెలుసు-బిజెపి ఓడిపోయి, ప్రభుత్వాన్ని కోల్పోవడం తథ్యం.

బిజెపి-ఆర్ఎస్ఎస్ కూటమి గణనీయమైన రాజకీయ, సైద్ధాంతిక ప్రభావాన్ని కలిగివున్న ఏకైక దక్షిణాది రాష్ట్రం కర్ణాటక మాత్రమే. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి హిందూత్వ శక్తులకు పెద్ద ఎదురుదెబ్బ కాగలదు. అలాగే 2024 లోక్‌సభ ఎన్నికల్లో బిజెపికి తీవ్రమైన సవాలును విసిరేందుకు లౌకిక, ప్రజాతంత్ర ప్రతిపక్ష ఐక్యతను ఇది మరింత వేగవంతం చేస్తుంది.

('పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

★

జనవాక్యం

రాజకీయ యాగం

రేపు 12వ తేదీ నుండి విజయవాడ లోని ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో రాష్ట్ర ప్రభుత్వం పది కోట్ల ప్రజాధనం ఖర్చుపెట్టి 'రాజశ్యామల యాగం' చెయ్యాలని జీవో విడుదలచేసింది. కొంత ధనం టిటిడి వారు ఇస్తారట. ఈయాగం ఎవరికోసం? యాగం నిర్వహించే పురోహితుల కోసమా, ప్రజల సంక్షేమం కోసమా? లేక ముఖ్యమంత్రి మరలా ఆ పీఠం ఎక్కేందుకా? ముఖ్యమంత్రి చెప్పాలి. రాజుల కాలంలో పుత్రుల కోసం పుత్రకామేష్టి యాగం, శత్రువులను చంపటంకోసం శత్రుసంహారక యాగం, వర్షంకోసం వరుణయాగం, చావును జయించటం కోసం మృత్యుంజయ యాగం, పాములను చంపటం కోసం సర్పయాగం చేసేవారు. మరి ఈ ఆధునిక కాలంలో ముఖ్యమంత్రి ఈ యాగం ఏమి ఆశించి చేస్తున్నారు? యాగాలన్నీ పురోహితుల పొట్టలు నింపటం కోసమేనని అని వేమన నాలుగొందల సంవత్సరాల క్రితమే ఎలుగెత్తి చాటాడు. యాగాల వలన ఏమీ జరగదు. టన్నుల టన్నుల నెయ్యి, పాలు, కొబ్బరి, జీడిపప్పు బూడిద కావటం తప్ప ఫలితం ఏమీ ఉండదు. యాగం నిర్వహించిన పురోహితులకు సంభావనలు బాగా ముడతాయి. కోట్ల రూపాయలు ప్రజాధనం దుర్వినియోగం అవుతుంది. అసలు లౌకిక రాజ్యంలో ప్రజాధనంతో ప్రభుత్వ పరంగా యాగాలు నిర్వహించరాదు. అలా చెయ్యటం రాజ్యాంగ విరుద్ధం. చెయ్యాలనుకుంటే వ్యక్తిగతంగా నిర్వహించుకోవాలి. సొంత స్థలంలో, సొంత డబ్బుతో నిర్వహించుకోవాలి తప్ప అధికారికంగా, ప్రజాధనంతో, ప్రభుత్వ స్థలాలలో ఇలాంటి మతపరమైన వాటిని నిర్వహించరాదు. ఇది రాజ్యాంగ సూత్రాలకు వ్యతిరేకం. రాజ్యాంగం ప్రకారం నడుచుకుంటానని ప్రమాణం చేసిన ముఖ్యమంత్రి, ఇలా చెయ్యటం రాజ్యాంగ ధిక్కరణే. కనుక తక్షణం ముఖ్యమంత్రి తలపెట్టిన ఈ రాజకీయ యాగాన్ని నిలిపివేయాలి.

- నార్నె వెంకట సుబ్బయ్య,
ఎ.పి. హేతువాదసంఘం అధ్యక్షుడు.

ప్రచారం కోసమే ఆదేశాలు!

గత కొద్ది రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు రాష్ట్రంలో చాలా ప్రాంతాల్లో పంట నష్టం తీవ్రంగా జరిగింది. ఈ సందర్భంగా నష్టం అంచనా లెక్కలను (ఎన్యూమరేషన్) త్వరగా తయారు చేయమని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. అయితే గత మార్చి మాసంలో కూడా అధిక వర్షాలకు రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఆ నష్టం అంచనాలే ఇంకా పూర్తి కాలేదు. ఇచ్చే సాయం అరాకొరా! అందులో అంతులేని జాప్యం. ముఖ్యమంత్రి గారు నిత్యం అన్ని అధికార, అనధికార కార్యక్రమాలకు హాజరు కావడం చూస్తున్నాం! నష్టపోయిన రైతులను పరామర్శించకపోవడం వారికి రైతులపై ఉన్న ప్రేమకు అద్దం పడుతున్నది. 70 శాతం ప్రజలు వ్యవసాయ రంగంపై ఆధారపడిన మన రాష్ట్రంలో రైతుల పరిస్థితి దయనీయంగా ఉంది! పంటలు నష్టపోయిన రైతులు రుణాల ఊబిలో కూరుకుపోయి దిక్కుతోచక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. రైతాంగంపై ప్రభుత్వం చిన్నచూపు చూడటం తగదు!

- జి.రామకృష్ణ,
ముస్తాబాద.

అర్హులందరికీ మత్స్యకార భరోసా

సముద్రంలో వేట నిషేధిత సమయంలో మత్స్యకారులకు ఇచ్చే మత్స్యకార భరోసా పథకంలో కొత్త నిబంధనలు పెట్టి జాలర్లకు భృతిని అందకుండా చేయొద్దని మత్స్యకార నేతలు రాష్ట్ర ప్రభుత్వానికి వినతి చేస్తున్నారు. వేట నిషేధిత కాలంలో ఒక్కొక్క మత్స్యకార కుటుంబాలకు ప్రభుత్వం రూ.10 వేలు నగదును నేరుగా వారి ఖాతాలో జమచేస్తుంది. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి బటన్ నొక్కి మత్స్యకారుల ఖాతాలో వేస్తున్నారు. ప్రతి ఏటా లబ్ధిదారులకు కొత్త నిబంధనలు పెట్టి మత్స్యకార భరోసా పథకంలో కోతలు విధిస్తున్నారు. ఈ ఏడాది మత్స్యకారులకు పొలాలు వున్నాయని, కరెంటు బిల్లులు ఎక్కువగా వున్నాయని లబ్ధిదారుల సంఖ్య తగ్గించటంతో మత్స్యకారులు లబోదిబో మంటున్నారు. అర్హులైన వారందరికి మత్స్యకార భరోసాను అందించాలి.

- జి.సూర్యనారాయణ,
బందలాయి చెరువు, కృష్ణా జిల్లా,

చీప్ లిక్కర్‌కు చెక్

కరోనా తగ్గు ముఖం పట్టిందో లేదో చీప్ లిక్కర్ కోసం మళ్లీ బారులు తీరుతున్నారు. మత్తు మందుకు, చీప్ లిక్కర్ సేవనానికి బానిస అయిన వారి జీవితాలు నిరంతరం అల్లకల్లోల మయమే. మన దేశంలో జరిగే దాదాపు 60 శాతం నేరాలు, ఘోరాలు, అత్యాచారాలు, దౌర్జన్యాలు, దోపిడీలకు మూలం ఈ చీప్ లిక్కర్ మత్తు మందేనట. పరిస్థితి ఇంత దయనీయంగా, రాక్షసత్వంగా వుంటే...ఇక మన జాతిపిత మహాత్మా గాంధీ కలలుగన్న సంపూర్ణ మద్యపాన నిషేధానికి తావెక్కడిది? ఈ పాపకార్యంలో పాలకులు, ప్రభుత్వాలు, ప్రజలు అందరూ దోషులే. చీప్ లిక్కర్ వ్యసనానికి చెక్ పెడదాం. మన ఆరోగ్యాన్ని మరో పది కాలాల పాటు కాపాడుకుందాం. సమాజాన్ని బాగుచేసుకుందాం.

- బుగ్గన మధుసూదనరెడ్డి,
బేతంచెర్ల, నంద్యాల జిల్లా.


మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps@ gmail.com

విమర్శ

రెచ్చగొట్టే పశ్చిమ దేశాల మరో దుష్ట యత్నం!

ఉక్రెయిన్ సంక్షోభంలో మరో మలుపు ఏమిటి? కొద్ది రోజుల క్రితం చైనా అధినేత సీ జిన్‌పింగ్ ఫోన్ ద్వారా జెలెన్‌స్కీకి చేసిన శాంతి ప్రతిపాదనలను ముందుకు పోకుండా అడ్డుకునేందుకు కుట్ర జరుగుతోందా? తన చేజారిన ప్రాంతాలను తిరిగి స్వాధీనం చేసుకొనేందుకు పశ్చిమ దేశాల మద్దతుతో అటు ఉక్రెయిన్ సిద్ధం అవుతోంది. స్వాతంత్ర్యం ప్రకటించుకున్న డాన్ బోస్ రిపబ్లిక్‌లను కాపాడేందుకు, గత ఏడాది కాలంలో తన ఆధీనంలోకి తెచ్చుకున్న ప్రాంతాల మీద పట్టు నిలుపుకుంటూ భారీ ఎత్తున కొత్తగా దాడులు చేసేందుకు ఇటు రష్యా సన్నద్ధం అవుతోందన్న వార్తల గురించి తెలిసిందే. ఈ నేపథ్యంలో బుధవారం తెల్లవారు ఝామున మాస్కోలోని అధికార కేంద్రమైన క్రెమ్లిన్ సమీపంలో రెండు ఆధునిక డ్రోన్ల (పైలెట్లు లేని చిన్న విమానాలు)ను కూల్చివేసినట్లు రష్యా ప్రకటించింది. తమ నేత పుతిన్‌ను హతమార్చేందుకు ఉక్రెయిన్ జరిపిన ఉగ్రదాడి ఇది అని పేర్కొన్నది. వాటితో తమకు సంబంధం లేదని జెలెన్‌స్కీ, దాని గురించి మాస్కో చెప్పే మాటలను నమ్మటం లేదని అమెరికా ప్రకటించింది. గతంలో ఇలాంటి ఉగ్రదాడులు జరిపినప్పుడల్లా ఇలాగే రలాయించారు.

ఉక్రెయిన్‌లో వున్నది పేరుకు పౌర ప్రభుత్వం తప్ప దాని ఆచరణ, చర్యలన్నీ



> **పుతిన్ బతికి ఉన్నంత వరకు చర్చలు జరిపేది లేదని ఉక్రెయిన్ గతేడాది ఒక తీర్మానం చేసుకుంది. సీ జిన్‌పింగ్ ప్రారంభించిన శాంతి చర్చలను మొగ్గలోనే తుంచేందుకు జరిగిన కుట్రలో భాగంగా కూడా తాజా డ్రోన్ దాడి జరిగి ఉండవచ్చు. ఇలాంటి కుట్రలను లోకానికి వెల్లడిస్తూనే రాజకీయ పరిష్కారం కోసం పుతిన్ యంత్రాంగం రెచ్చిపోకుండా వ్యవహరించాల్సి ఉంది.**

ఉగ్రవాద శక్తుల స్వభావాన్నే కలిగి ఉన్నట్లు ఎప్పటి నుంచో అనేక మంది చెబుతున్నారు.గత ఏడాది కాలంలో రష్యా నుంచి ఐరోపాకు వెళ్లే ఇంధన పైప్‌లైన్ విధ్వంసం, క్రిమియాలో ఒక వంతెన పేల్చివేత ఉదంతం, రష్యా మిలిటరీ స్థావరాల మీద జరిగిన దాడులన్నీ ఉగ్రవాదులు జరిపే వాటి స్వభావం కలిగినవే. వీటిలో ఏ ఒక్కదానినీ జెలెన్‌స్కీ లేదా అతగాడికి మద్దతు ఇస్తున్న పశ్చిమ దేశాలేవీ ఖండించలేదు. నాటో, అమెరికా ఇచ్చిన పాత అస్త్రాలన్నింటినీ జెలెన్‌స్కీ సేనలు అవగొట్టాయి. ఆధునిక ఆయుధాలను ఇస్తే వాటిని సక్రమంగా వినియోగించే సత్తా వాటికి ఉందా లేదా అన్న అనుమానాలు పశ్చిమ దేశాలకు ఉన్నాయి. పరిమితంగా దాడులు చేస్తూ భారీ ఎత్తున విరుచుకుపడేందుకు పుతిన్ సేనలు సన్నాహాలు చేసుకుంటున్నట్లు చెప్పటం తప్ప అది ఎలా ఉంటుందన్నది ఇంతవరకు నాటో వేగులు తెల్చుకోలేకపోయారు. ప్రాణ నష్టం కలగకుండా ఉక్రెయిన్ మిలిటరీ, ఆర్థిక వ్యవస్థ, మౌలిక సదుపాయాలను ధ్వంసం చేస్తూ రష్యా మిలిటరీ చర్యలను కొనసాగిస్తున్నది. అందుకే పుతిన్‌ను రెచ్చగొట్టి సంక్షోభ తీవ్రతను పెంచాలని పశ్చిమ దేశాలూ, ఉక్రెయిన్ చూస్తున్నది. తాజా డ్రోన్ల ఉదంతం వాటిలో భాగమే అన్నది స్పష్టం. క్రెమ్లిన్ మీద డ్రోన్లు ఎగిరిన రోజే ఓల్నా అనే రష్యా చమురు నిల్వకేంద్రంపై జరిపిన డ్రోన్ దాడిలో అది దగ్ధమైనట్లు టాస్ వార్తా సంస్థ తెలిపింది. అది ఉక్రెయిన్ సరిహద్దుకు సమీపంలో ఉంది.

ఈ పరిణామం ప్రపంచ దేశాలకు సరికొత్త ఉగ్రవాద ముప్పును సూచిస్తున్నది. గంటకు 150 కిలోమీటర్ల వేగంతో ఏడు గంటల పాటు ఎగురుతూ 25 నుంచి 95 కిలోల బరువును మోసుకుపోగల మానవ రహిత డ్రోన్లు ఇప్పుడు అందుబాటులోకి వచ్చాయి. వీటి ధర కూడా పది నుంచి ఇరవై వేల డాలర్లలోపే ఉంటుంది. వాటి కొనుగోలుతో పోలిస్తే కూల్చివేసేందుకు లక్షా నలభై నుంచి ఐదు లక్షల డాలర్ల వరకు ఖర్చు అవుతుందని టైమ్ పత్రిక పేర్కొన్నది. వీటిని బాంబులతో నింపి నిర్ణీత లక్ష్యంపై పేలే విధంగా చేయవచ్చు. క్రెమ్లిన్ కూల్చివేసిన రెండు డ్రోన్లు ఇలాంటివే. పుతిన్‌ను లేదా మరే దేశ నేతనైనా ఇలాంటి వాటితో హతమార్చటం అంత తేలిక కాదు. అందుకే జనంలో దిగజారుతున్న తన ప్రతిష్టను నిలుపుకొనేందుకు జెలెన్‌స్కీ ఇలాంటి వాటితో పబ్బం గడుపుకొనే ప్రచార ఎత్తుగడగా కొందరు వర్ణిస్తున్నారు. తాము కూడా రష్యన్ భూభాగంపై దాడులు జరపగలమనే సంకేతాలను పంపటం తప్ప ఇది మరొకటి కాదు. నిజానికి ఇలాంటి డ్రోన్లను ఒక్క క్రెమ్లిన్ మీదనే కాదు వాషింగ్టన్‌లోని వైట్‌హౌస్ మీదకూ పంపవచ్చు.

డ్రోన్ల ఉదంతంపై అమెరికా, ఇతర ప్రధాన దేశాల స్పందన వెల్లడి కావాల్సి ఉంది. తమ దాడులు తమ గడ్డ మీద తప్ప రష్యా మీద జరపటం లేదని జెలెన్‌స్కీ చేతులు దులుపుకుంటే కుదరదు. వీటిని తాము నమ్మటం లేదని అమెరికా అన్నా చెల్లదు. దీనికి ప్రతిగా జెలెన్‌స్కీనే లేపేయాలని రష్యా మాజీ అధ్యక్షుడు దిమిత్రి మెద్వెదేవ్ పిలుపునివ్వటం పశ్చిమ దేశాల వలలో పడటమే. రేపు పశ్చిమ దేశాలే ఆ పని చేసి దాన్ని రష్యా మీద నెట్టగల సమర్థులున్నారు. గతంలో జరిగిన అనేక యుద్ధాలు ఇలాంటి గిల్లి కజ్జాలు, కుట్రలతోనే ప్రారంభమయ్యాయి. పుతిన్ బతికి ఉన్నంత వరకు చర్చలు జరిపేది లేదని ఉక్రెయిన్ గతేడాది ఒక తీర్మానం చేసుకుంది. సీ జిన్‌పింగ్ ప్రారంభించిన శాంతి చర్చలను మొగ్గలోనే తుంచేందుకు జరిగిన కుట్రలో భాగంగా కూడా తాజా డ్రోన్ దాడి జరిగి ఉండవచ్చు. ఇలాంటి కుట్రలను లోకానికి వెల్లడిస్తూనే రాజకీయ పరిష్కారం కోసం పుతిన్ యంత్రాంగం రెచ్చిపోకుండా వ్యవహరించాల్సి ఉంది.

- ఫీచర్స్ అండ్ పొలిటిక్స్

★

అనంతలో పిస్తాహౌస్ ప్రారంభం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

పేదలకు ఇళ్ల స్థలాలివ్వడంపై హైకోర్టు ఇచ్చిన తీర్పు విపక్షాలకు చెంపపెట్టు వంటిదని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి రోజా ఘాటుగా విమర్శించారు. అనంతపురం నగరంలో పిస్తాహౌస్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. రాజధానిలో పేదలకు ఇళ్ల స్థలాలివ్వాలని వైసిపి ప్రభుత్వం ఆలోచిస్తే అందుకు చంద్రబాబునాయుడు అడ్డుపడే ప్రయత్నం చేశారని విమర్శించారు. ప్రజా రాజధాని అని గతంలో ఆయనే చెప్పారని గుర్తుచేశారు. రాజధాని భూముల అవినీతిపైనా విచారణ జరగకుండా స్టే తెచ్చుకున్నారని, దానిపైనా ఇప్పుడు విచారణకు న్యాయస్థానం అనుమతినిచ్చిందని చెప్పారు.

వేరుశనగ సబ్సిడీ ఖరారు

- 40 శాతం రాయితీ
- ట్రైబల్ ఏజెన్సీలకు 90 శాతం



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

వేరుశనగ విత్తనకాయల సబ్సిడీని ప్రభుత్వం ఖరారు చేసింది. సాధారణ రైతులకు 40 శాతం సబ్సిడీ ఇవ్వగా, ట్రైబల్ రైతులకు 90 శాతం సబ్సిడీతో ఇవ్వాలని నిర్ణయించారు. కె-6కిలో సేకరణ ధర రూ.93 కాగా, కదిరి లేపాక్షి (కె-1812) రకం రూ.83గా నిర్ణయించింది. వీటికి 40 శాతం సబ్సిడీ ఇచ్చారు. దీని ప్రకారం కె-6కు ప్రభుత్వం 40 శాతం సబ్సిడీ ప్రకారం కిలోపైన రూ.37.20 ఇవ్వనుంది. రైతు చెల్లించాల్సింది కిలోపై రూ.55.80గా ఉంది. అదే ట్రైబల్ ఏజెన్సీల్లోని గిరిజన రైతులకు 90 శాతం సబ్సిడీ ప్రకారం కిలో రూ.9.30 చెల్లిస్తే సరిపోతుంది. ఇక కదిరి లేపాక్షి రకం 40 శాతం సబ్సిడీ ప్రకారం రూ.49.80 రైతు చెల్లించాలి. ట్రైబల్ ఏజెన్సీల్లో రైతులు 90 శాతం సబ్సిడీ ప్రకారం రూ.8.30 కిలోకు చెల్లించాల్సి ఉంటుంది.

గరిష్టంగా మూడు బస్తాలు

వేరుశనగ విత్తన కాయలకు సంబంధించి 30 కిలోల ఒక బస్తా చొప్పున పంపిణీ చేయనున్నారు. అర ఎకరానికి ఒక బస్తా, ఆపైన ఒక ఎకరా వరకు అయితే రెండు బస్తాలు, ఎకరాపైన ఉన్న రైతులకు మూడు బస్తాలు గరిష్టంగా ఇస్తారు. ఉమ్మడి అనంతపురం జిల్లాకు ఖరీఫ్‌లో విత్తన పంపిణీకి సంబంధించి కేటాయింపులను ప్రభుత్వం జరిపింది. అనంతపురం జిల్లాకు 78245 క్వింటాళ్ల కేటాయించారు. సత్యసాయి జిల్లాకు 100907 క్వింటాళ్లు ఖరీఫ్‌లో సబ్సిడీ విత్తనం కింద పంపిణీ చేయాలని నిర్ణయించారు.

పంపిణీ ఎప్పుడో .?

వేరుశనగ విత్తనకాయలను సాధారణంగా మే నెలలోనే పంపిణీ చేపట్టేవారు. కాని ఈసారి సేకరణ ధరయే ఇప్పుడు ఖరారైంది. ఇప్పుడు సేకరణ ప్రారంభించి ఎప్పటికి పంపిణీ జరుగుతుందన్నది చూడాల్సి ఉంది.

ధాన్యం.. గట్టెక్కేదెలా..!

- తుపాను హెచ్చరికలతో రైతుల్లో ఆందోళన
- కన్నీటి సంద్రంలో అన్నదాత
- సంచుల్లేక కల్లాల్లోనే ధాన్యం



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'నా పేరు సంపతి వెంకటేశ్వరరావు. మాది కైకరం గ్రామం. 11 ఎకరాలు కౌలుకు తీసుకుని వరి సాగుచేశాను. గతనెల 22న మాసూలు పూర్తిచేశాను. కానీ ఇప్పటి వరకూ సంచులు ఇవ్వలేదు. వర్షాలకు ధాన్యం తడిసి మొలకలు వస్తున్నాయి. రైతులకు రాజకీయాలు ఆపాదించి సంచులు ఇవ్వకుండా చేస్తున్నారు. ధాన్యాన్ని ఏ విధంగా గటెక్కించాలో తెలియడం లేదు.'

'నా పేరు సానం ఏడుకొండలు. మాది కైకరం. పదెకరాలు కౌలుకు తీసుకుని వరి సాగుచేశాను. గతనెల 18న మాసూలు చేశాను. ఇంకా 500 సంచుల్లేక అలానే ఉండిపోయాయి. వర్షాలకు తడిసి ధాన్యం మొలకలు వస్తున్నాయి. ధాన్యం కాపాడుకునేందుకు నానా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఎప్పటికి ధాన్యం వెళుతుందో తెలియడం లేదు.'

పైన పేర్కొన్న సమస్యలను ఎదుర్కొంటున్నది వెంకటేశ్వరరావు, ఏడుకొండలు మాత్రమే కాదు.. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల్లో వరిసాగుచేసిన వేలాది మంది రైతులది ఇదే పరిస్థితి. మాసూలు చేసిన కల్లాలో ఉన్న ధాన్యం అమ్ముకునేందుకు సంచుల్లేక, లారీలు లేక నానా అవస్థలు పడుతున్నారు. మాసూలు చేసి 20 రోజులు గడుస్తున్నా ఇప్పటికీ సంచులు ఇవ్వని పరిస్థితి కొనసాగుతోంది. ధాన్యం కొనుగోలులో నూతన విధానం అస్తవ్యస్తంగా తయారైంది. సంచులు, లారీల విషయంలో అధికారులు పూర్తిగా చేతులెత్తేశార. దీంతో రైతులు గందరగోళానికి గురవుతున్నారు. బంగాళాఖాతంలో పొంచి ఉన్న తుపాను హెచ్చరికలతో రైతులు మరింత ఆందోళనకు గురవుతున్నారు. ఈ నెల తొమ్మిదో తేదీకి అల్పపీడనం తుపానుగా మారనున్నట్లు చేస్తున్న హెచ్చరికలు రైతులకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. ఏలూరు జిల్లాలో 79వేల ఎకరాలు, పశ్చిమలో 2.13లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగుచేశారు. ఏలూరు జిల్లాలో 3.90 లక్షల మెట్రిక్ టన్నులు, పశ్చిమలో 9.28 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారు. రెండురోజుల క్రితం అధికారులు విడుదల చేసిన లెక్కల ప్రకారం చూస్తే ఇప్పటి వరకూ పశ్చిమలో 2.30 లక్షల మెట్రిక్ టన్నులు, ఏలూరులో 1.15 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. అంటే రెండు జిల్లాల్లో కలిపి 3.50 లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారు. అధికారుల లెక్కల ప్రకారం చూస్తే ఇంకా దాదాపు ఎనిమిది లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంది. దాదాపు 50 శాతంపైగా ధాన్యం కల్లాల్లోనే ఉండిపోయింది. లారీలు, సంచులు అందిచడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. మంత్రులు, ఎంఎల్‌ఎలు రైతుల వంక కనీసం చూడటం లేదు. రైతులకు రాజకీయాలు ఆపాదించి సంచులు ఇవ్వడం లేదంటూ పలువురు రైతులు గగ్గోలు పెడుతున్నారు. రైతులకు రాజకీయాలు ఆపాదించడం ఏమిటో కూడా అర్థంకావడంక లేదు.

ఆరబెట్టకపోతే మొలకలు.. ఆరబెడితే వర్షం

వారంరోజులగా వర్షం రైతులను వెంటాడుతోంది. ప్రతీరోజు ఏదో ఒక సమయంలో వర్షం పడుతూనే ఉంది. దీంతో రైతుల పరిస్థితి దారుణంగా మారింది. వర్షాలకు తడిసిన ధాన్యం అరబెట్టకపోతే మొలకలు వస్తున్నాయి. ఆరబెడితే వర్షానికి మళ్లీ తడిసిపోతుంది. ఆరబెట్టిన తర్వాత వర్షం వస్తే ధాన్యం మళ్లీ రాశులుగా చేయడం చాలా కష్టం. దీంతో రైతులకు ఏంచేయాలో అర్థంకాక తలలు పట్టుకుంటున్నారు. ఉంగుటూరు మండలం నాచుగుంట, కైకరం వంటి గ్రామాల్లో ఇప్పటికే తడిసిన ధాన్యం మొలకలు రావడంతో రైతులకు దిక్కుతోచని పరిస్థితి నెలకొంది.

రవాణాకు లారీలు రావడం లేదని, సంచులు ఇవ్వడం లేదని రైతులు మొత్తుకుంటున్నా ఏ ఒక్కరికీ పట్టడం లేదు. గతనెల 16వ తేదీన ధాన్యం కొనుగోలు ప్రారంభించారు. 20 రోజులు దాటుతున్నప్పటికీ సమస్యలు పరిష్కారంకాలేదు. మిల్లర్లు పెడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీకావు. ముక్క పేరుతో పెద్దఎత్తున డబ్బులు వసూలు చేస్తున్నారు. ఖరీఫ్‌లో తేమపేరుతో రైతుల నుంచి దోచేసిన మిల్లర్లు, రబీలో ముక్క పేరుతో దోపిడీ చేస్తున్నారు. మిల్లర్లను ప్రభుత్వం అదుపుచేయలేని పరిస్థితి నెలకొంది. ఈనెల మొదటివారం గడిచిపోతున్నా ఇంకా కల్లాల్లోనే ధాన్యం ఉండిపోవడంతో, వర్షాలతో పంట గట్టెక్కేదెలా అంటూ అన్నదాతలు మదనపడుతున్నారు.

ధాన్యం కొనుగోలు జాప్యంపై రైతుల ఆగ్రహం



ప్రజాశక్తి - ఉంగుటూరు (ఏలూరు జిల్లా)

గోనె సంచుల కొరత, ధాన్యం కొనుగోలులో ఆలస్యంపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఎపి రైతుసంఘం, ఎపి కౌలు రైతుల సంఘం ఆధ్వర్యంలో మండలంలోని కైకరం రైతు భరోసా కేంద్రాన్ని శుక్రవారం ముట్టడించారు. 'గోనె సంచులు ఇవ్వండి.. ధాన్యం రవాణాకు లారీలు ఏర్పాటు చేయండి అంటూ నినాదాలు చేస్తూ ధర్నా నిర్వహించారు. ధాన్యం కొనుగోలు చేయకుండా రైతులను ఇబ్బందులు పెట్టడంతో దిక్కు తోచని స్థితిలో ఉన్నామని కౌలు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సంచులు ఇచ్చి త్వరితగిన ధాన్యం కొనుగోలు చేయకపోతే ఆత్మహత్యే శరణ్యం రైతు భరోసా కేంద్రం అధికారులతో వాగ్వాదానికి దిగారు. చివరకు అధికారులు సమస్య పరిష్కారానికి హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఇన్‌ఛార్జి తహశీల్దార్ పోతురాజు స్పందించి గోనె సంచులు, లారీల సమస్య పరిష్కారానికి హామీ ఇచ్చారు.

ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే అన్నదాతకు కష్టాలు

ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే రైతులు కష్టాలు, నష్టాల బారిన పడ్డారనిఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ అన్నారు. ఈ ఆందోళనలో పాల్గొన్న వారు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కనీసం గోనె సంచులు కూడా అందించలేకపోతున్నారని విమర్శించారు. పలుకుబడి ఉన్న వారికే గోనె సంచులు ఇచ్చి లారీలు ఏర్పాటు చేయడం వల్ల కౌలు రైతులు, పేదరైతులు రైతు భరోసా కేంద్రం వద్ద పడిగాపులు పడాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. కొనుగోలు ఆలస్యం వల్ల వర్షాలకు ధాన్యం తడిసిపోయి మొలకలు వచ్చాయన్నారు. అకాల వర్షాలకు తడిసి మొలకలు వచ్చిన ధాన్యాన్ని కనీస మద్దతు ధరకే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ధాన్యం కొనుగోలులో సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు నిమ్మగడ్డ నరసింహ, సీనియర్ నాయకులు గుత్తికొండ వెంకటకృష్ణారావు, కౌలు రైతు సంఘం జిల్లా కన్వీనర్ కొర్ని అప్పారావు, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు సున్నా వెంకటరావు, గంటా పాపారావు, రైతులు, కౌలు రైతులు గున్ను సూర్యారావు, మన్నే జనార్ధనరావు, బలే పోతురాజు, ఒబిలినేని సత్యనారాయణ, సంపద వెంకన్న పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు బదిలీలు

- మంత్రికి ఎపిఎంఎస్‌టిఎఫ్ వినతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు సాధారణ బదిలీలు నిర్వహించాలని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణను ఆంధ్రప్రదేశ్ మోడల్ స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ కోరింది. యుటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్ వెంకటేశ్వర్లు, కెఎస్‌ఎస్ ప్రసాద్‌తో కలిసి ఆ సంఘం కన్వీనర్, కో కన్వీనర్ పి చంద్రశేఖర్, ఎస్ బాలాజీ మంత్రిని శుక్రవారం సమగ్ర శిక్షా కార్యాలయంలో కలిసి వినతిపత్రాన్ని అందించారు. పాఠశాల విద్యాశాఖలో ఉన్న ఉపాధ్యాయులలానే సాధారణ బదిలీలు నిర్వహించాలని కోరారు. 010 పద్దు ద్వారా జీతాలు చెల్లించాలని, సర్వీస్ రూల్స్ రూపొందించి ప్రమోషన్లు ఇవ్వాలని, హెల్త్‌కార్డులు విడుదల చేయాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని కోరారు. 18 నెలలుగా ఉపాధ్యాయుల జీతాలు సిపిఎస్ మినహాయింపులు చేసినా వారి ఖాతాల్లో జమకాలేదని, దీనిని పరిష్కరించాలన్నారు. ఇంటర్మీడియట్ అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టాలన్నారు.

చట్ట సభల్లో బిసి రిజర్వేషన్ కోసం పోరాటం

- రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం (తూర్పుగోదావరి జిల్లా)

చట్టసభల్లో బిసిలకు 50 శాతం రిజర్వేషన్లు సాధించేవరకు ఉద్యమం కొనసాగిస్తామని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య చెప్పారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని శుభమస్తు ఫంక్షన్ హాల్లో శుక్రవారం జరిగిన బిసి సంక్షేమ సంఘం జాతీయ కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మెడలు వంచి పార్లమెంట్‌లో బిల్లు పెట్టిస్తామన్నారు. బిసిలకు రాజ్యాధికారం దక్కాలంటే రిజర్వేషన్లు తప్పనిసరిగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎపిలో సిఎం జగన్ మోహన్ రెడ్డి బిసిలకు అన్ని విధాలుగా ప్రాధాన్యతాస్తున్నారు.

రేఖా.నెం.353/2023/ఎస్.ఎ(ఎల్.ఎ)తేది.30.04.2023 — కలక్టరు వారి కార్యాలయం, విజయనగరం

ఫారం నెం.VII

2013 వ సంవత్సర 30 వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పున;స్థాపనలలో న్యాయపరమైన నష్టపరిహారం పొందేహక్కు, పారదర్శకత చట్టంలో సెక్షస్ 19(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2004 లో రూలు 25, సబ్ రూలు(1) ననుసరించి

రూఢి ప్రకటన

విజయనగరం జిల్లా, బొబ్బిలి మండలం పక్కి గ్రామంలో ఈ దిగువ నుదహరించి షెడ్యుల్ దాఖలు భూములను ప్రజా ప్రయోజనముకై అనగా సర్దార్ గౌతు లచ్చన్న తోటపల్లి బ్యారేజ్ ప్రొజెక్ట్ ప్రదాన కుడి కాలువకు సంబంధించిన కి.మీ.23.975 వద్ద బర్లి డిస్ట్రిబ్యూటరీ వద్ద మైనర్ నిర్మాణం కి.మీ.0.000 నుండి కి.మీ.0.990 వరకు భూమి కావలెనని జిల్లా కలక్టర్, విజయనగరం వారు భావించినందున, 2013వ సంవత్సరము 30వ చట్టంలోని 15వ విభాగం ననుసరించి సంబందిత వ్యక్తులనుండి వచ్చిన అభ్యంతరంలపై విచారణ జరిపిన పిమ్మట విజయనగరం జిల్లా కలక్టరు వారు సంతృప్తి చెంది ఈ దిగువ షెడ్యూల్ దాఖలా భూములను ప్రజా ప్రయోజనాల నిమిత్తం భూసేకరణ గావించుటకు నిర్ణయించినారు. మరియు భూసేకరణ కోరిన సంస్థ వారు అవసరమగు బడ్జెట్ నిధులను ఆర్థిక సంవత్సరం 2023/24 నకు సమకూర్చినారు. ఈ క్రింది రూఢి ప్రకటన 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 19(1) విబాగం ననుసరించి చేయబడినది.

రూఢి ప్రకటన

విజయనగరం జిల్లా కలక్టరు వారు 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 19(1) విబాగం ననుసరించి ఈ దిగువ నుదహరించిన షెడ్యూల్ దాఖలా భూములు మరియు సుమారుగా వాటి విస్తీర్ణంలను ప్రజా ప్రయోజనమునకై అనగా సర్దార్ గౌతు లచ్చన్న తోటపల్లి బ్యారేజ్ ప్రాజెక్టు క్రింద ప్రదాన కుడి కాలువకు సంబంధించిన కి.మీ.23.975 వద్ద బర్లి డిస్ట్రిబ్యూటరీ వద్ద మైనర్ నిర్మాణం కి.మీ.0.000 నుండి కి.మీ.0.990 వరకు నిర్మాణం కొరకు భూమి అవసరమైనదని ఇందు మూలముగా ప్రకటన చేసియున్నారు.

షెడ్యూల్

మండలం: బొబ్బిలి — గ్రామం: పక్కి (ప్రదాన కుడి కాలువకు సంబంధించిన కి.మీ.23.975 వద్ద బర్లి డిస్ట్రిబ్యూటరీ వద్ద మైనర్ నిర్మాణం కి.మీ.0.000 నుండి కి.మీ.0.990 వరకు నిర్మాణం)

వ. నెం.	సర్వే నెంబరు	మొత్తం విస్తీర్ణం ఎ.సెంట్లు	భూసేకరణ కొరకు పట్టిన విస్తీర్ణం	భూ స్వభావం	పేరు మరియు చిరునామా	పట్టాదారు/ అనుభవదారు	సరిహద్దులు: ఉత్తర	దక్షిణ	తూర్పు	పడమర	చెట్లు మరియు కట్టడములు వివరములు ఉన్నచొ
(1)	(2)	(3)	(4)	(5)	(6)	(7)	(8)				(9)
1	1-1బి	3.58	0.18	రై.పుంజ	కర్రి అప్పలనాయుడు చింతపల్లి కూర్మినాయుడు కొత్తకోట వెంకటరమణ శంబాన సురేంద్ర శంబాన క్రిష్ణ చైతన్య గుల్లిపల్లి వెంకటరమణ కొత్తకోట వెంకటరమణ తండ్రి అప్పారావు	పట్టాదారు పట్టాదారు పట్టాదారు పట్టాదారు పట్టాదారు పట్టాదారు అనుభవదారు	139	3	1C	1ఎ	నీలగిరి మొక్కలు , టేకు -2
2	4-1ఎ	3.31	0.12	రై.పుంజ	పాలూరి గౌరినాయుడు బొనకల నర్సయ్య బొనకుల అక్కులు మరడా సింహాచలం పాలూరి సత్యంనాయుడు తండ్రి గౌరినాయుడు	పట్టాదారు పట్టాదారు పట్టాదారు పట్టాదారు అనుభవదారు	సర్వే నెం.3	1బి	31ఎ	1బి	
3	4-31ఎ	0.79	0.32	రై.పుంజ	గుల్లిపల్లి శంకరరావు గుల్లిపల్లి అప్పలనాయుడు	పట్టాదారు అనుభవదారు	3	31బి	సర్వే నెం. 6	1ఎ	టేకుమొక్కలు -20, పాచి-14
4	6-1	0.26	0.26	రై.పుంజ	చుక్క అప్పలస్వామి మరడాన శ్రీరామ మూర్తి తండ్రి జోగినాయుడు మరడాన అప్పలనాయుడు తండ్రి జోగినాయుడు మరడాన కూర్మినాయుడు తండ్రి జోగినాయుడు	పట్టాదారు అనుభవదారు అనుభవదారు అనుభవదారు	సర్వే నెం.3	2ఎ, 5ఎ, 3ఎ	సర్వే నెం.7	సర్వే నెం.3	టేకు -13, పాచి-20
5	6-2ఎ	0.47	0.17	రై.పుంజ	మరడాన అప్పలస్వామినాయుడు తండ్రి రామినాయుడు మరడాన అప్పలనాయుడు తండ్రి జోగినాయుడు	పట్టాదారు అనుభవదారు	సబ్,డి. నెం.1	2బి	5ఎ	సర్వే నెం.4	
6	6-3ఎ	0.92	0.14	రై.పుంజ	మరడాన జోగినాయుడు తండ్రి చిన అప్పలస్వామి నాయుడూ i)మరడాన శ్రీరామ మూర్తి తండ్రి జోగినాయుడు ii)మరడాన అప్పలనాయుడు తండ్రి జోగినాయుడు	పట్టాదారు అనుభవదారు అనుభవదారు	సబ్,డి. నెం.1	3బి	సర్వే నెం.7	5ఎ	i) టేకు మొక్కలు-7, ii) టేకు మొక్కలు-3, మామిడి-4, కుంకుడు-1
7	6-5ఎ	1.47	0.10	రై.పుంజ	మరడాన జోగినాయుడు తండ్రి చిన అప్పలనాయుడు	పట్టాదారు అనుభవదారు	సబ్,డి. నెం.1	5బి	3ఎ	2ఎ	
8	7-1ఎ	0.32	0.09	రై.పుంజ	అల్లు సత్యం తండ్రి దాలినాయుడు అల్లు రామ్మూర్తినాయుడు తండ్రి దాలినాయుడు అల్లు సత్యవతమ్మ అల్లు సత్యంనాయుడు తండ్రి దాలినాయుడు	పట్టాదారు అనుభవదారు అనుభవదారు అనుభవదారు	2ఎ	1బి	2ఎ	సర్వే నెం.6	టేకు మొక్కలు-2, పాచి-6, మద్ది-3, విప్ప-1, ఉసిరి-1
9	7-2ఎ	0.33	0.31	రై.పుంజ	తాండ్రి జగ్గునాయుడు తండ్రి రామస్వామి i) అల్లు రామ్మూర్తినాయుడు తండ్రి దాలినాయుడు ii) శంబంగి క్రిష్ణ iii) అల్లు సత్యంనాయుడు తండ్రి ద్యాలినాయుడు	పట్టాదారు అనుభవదారు అనుభవదారు అనుభవదారు	సర్వే నెం.2	1ఎ,3,2 బి	20ఎ	సర్వే నెం.2	ii) టేకు మొక్కలు-38, మామిడి-2 i&iii) టేకు-8 ,మామిడి-5, పాచి-36, మద్ది-6
10	7-20ఎ	0.60	0.06	రై.పుంజ	బంకురు పారినాయుడు తండ్రి జోగినాయుడు బంకురు సూర్యనారాయణ తండ్రి రామినాయుడు	పట్టాదారు అనుభవదారు	సర్వే నెం.2	20బి	21ఎ	2ఎ	టేకు -22
11	7-21ఎ	0.61	0.05	రై.పుంజ	బంకురు అన్నమ్మ భర్త పాపినాయుడు బంకురు ఎరుకునాయుడు తండ్రి [illegible]	పట్టాదారు అనుభవదారు	సర్వే నెం.2	21బి	సర్వే నెం. 8	20ఎ	టేకు -7, మామిడి-1
12	8-1ఎ	0.24	0.07	రై.పుంజ	బంకురు పాపినాయుడు తండ్రి లకుంనాయుడు పలగర చిన్నారావు తండ్రి అప్పలస్వామి	పట్టాదారు అనుభవదారు	సర్వే నెం.2	1బి	2ఎ	సర్వే నెం.7	టేకు మొక్కలు-40, చింత-1, తాటి-1
13	8-2ఎ	0.24	0.08	రై.పుంజ	బంకురు అప్పలనాయుడు తండ్రి ముసలినాయుడు గారి లకుంనాయుడు పలగర చిన్నారావు తండ్రి అప్పలస్వామి	పట్టాదారు అనుభవదారు	సర్వే నెం.2	2బి	3ఎ	1ఎ	టేకు -40, మామిడి-1 కొబ్బరి-1
14	8-3ఎ	0.16	0.08	రై.పుంజ	శంబంగి భీముడు గారి సన్యాసినాయుడు పలగర చిన్నారావు తండ్రి అప్పలస్వామి	పట్టాదారు అనుభవదారు	సర్వే నెం.2, బర్లి గ్రామం	3బి	4ఎ	2ఎ	టేకు మొక్కలు -10, మామిడి-3, కొబ్బరి-1, చింత-1
15	8-4ఎ	1.16	0.07	రై.పుంజ	బంకురు అప్పలనాయుడు తండ్రి రామినాయుడు పలగర చిన్నారావు తండ్రి అప్పలస్వామి	పట్టాదారు అనుభవదారు	బర్లి గ్రామం	4బి	సర్వే నెం.9	3ఎ	టేకు -10, మామిడి-2, చింత-1
16	9-1ఎ	0.74	0.08	రై.పుంజ	బంకురు సత్యంనాయుడు తండ్రి సన్యాసినాయుడు రాయిపల్లి శీతాలక్ష్మి భర్త వెంకటనాయుడు	పట్టాదారు అనుభవదారు	బర్లి గ్రామం	1బి	6బి	సర్వే నెం.8	టేకు -50, మల్బరి-63
17	9-6బి	1.15	0.31	రై.పుంజ	గురుపిల్లి సత్యం, అప్పలస్వామి తండ్రి రామినాయుడు	పట్టాదారు అనుభవదారు	6ఎ	6C	7బి	1ఎ	నీలగిరి తోట
18	9-7బి	0.40	0.15	రై.పుంజ	రాయిపల్లి శీతాలక్ష్మి రాయిపల్లి శీతాలక్ష్మి భర్త వెంకటనాయుడు	పట్టాదారు అనుభవదారు	7ఎ,8	7C	సర్వే నెం. 10	6బి	టేకు -3
19	10-5బి	0.08	0.03	రై.పుంజ	మెండి సంఘమ్మ భర్త కన్నయ్య చప్పా సత్యనారాయణ తండ్రి క్రిష్ణమూర్తి నాయుడు	పట్టాదారు అనుభవదారు	5ఎ	6ఎ	21ఎ	8బి	టేకు -2
20	10-6ఎ	0.08	0.04	రై.పుంజ	బొనకాల దాలయ్య తండ్రి నారాయణ శంబంగి వెంకట చినప్పలనాయుడు తండ్రి సూరపునాయుడు	పట్టాదారు అనుభవదారు	5బి	6బి	21ఎ	8బి	టేకు -22
21	10-8బి	0.30	0.12	రై.పుంజ	గోద క్రిష్ణమూర్తి నాయుడు తండ్రి సూరపునాయుడు బొనకాల లక్ష్మి భర్త ఆదినారాయణ	పట్టాదారు అనుభవదారు	8ఎ	8C	5బి,6ఎ	సర్వే నెం.9	టేకు మొక్కలు-14
22	10-20ఎ	0.10	0.02	రై.పుంజ	బొనకాల దాలయ్య తండ్రి జగ్గయ్య చేట్ల లక్ష్మి భర్త సింహాచలం	పట్టాదారు అనుభవదారు	26బి	20బి	30బి	21ఎ	టేకు -4
23	10-21ఎ	0.10	0.06	రై.పుంజ	బొనకాల అప్పయ్య తండ్రి నారాయణ చప్పా సత్యనారాయణ తండ్రి క్రిష్ణమూర్తి నాయుడు	పట్టాదారు అనుభవదారు	22	21బి	20ఎ,2 6బి	5బి,6ఎ	టేకు -3
24	10-26బి	0.09	0.06	రై.పుంజ	మెండి రామయ్య తండ్రి లక్ష్మయ్య చప్పా సత్యనారాయణ తండ్రి క్రిష్ణమూర్తి నాయుడు	పట్టాదారు అనుభవదారు	26ఎ	20ఎ	27బి	21ఎ	
25	10-27బి	0.19	0.04	రై.పుంజ	మెండి సంగయ్య తండ్రి నర్సయ్య గిడిజాల సింహాచలం	పట్టాదారు అనుభవదారు	27ఎ	20ఎ	30బి	26బి	
26	10-30బి	0.74	0.25	రై.పుంజ	తెర్లి అప్పలనాయుడు తండ్రి రామినాయుడు తెర్లి సత్యంనాయుడు తండ్రి అప్పలనాయుడు	పట్టాదారు అనుభవదారు	30ఎ	30C	31బి, 32ఎ	27బి	
27	10-31బి	0.26	0.12	రై.పుంజ	శంబంగి సత్యంనాయుడు తండ్రి జోగినాయుడు శంబంగి జగన్నాధంనాయుడు తండ్రి సూరపునాయుడు	పట్టాదారు అనుభవదారు	31ఎ	32ఎ	38	30బి	టేకు మొక్కలు-6
28	10-32ఎ	0.24	0.03	రై.పుంజ	మరడాన రామినాయుడు తండ్రి చిన్న అప్పలనాయుడు శంబంగి జగన్నాధంనాయుడు తండ్రి సూరపునాయుడు	పట్టాదారు అనుభవదారు	31బి	32ఎ	38	30బి	
	మొత్తం		3.41								

ఈ భూముల ప్లాను, శ్రీ ప్రత్యేక ఉప కలెక్టరు (భూసేకరణ), తోటపల్లి బ్యారేజ్ ప్రాజెక్ట్, యునిట్-2, చీపురుపల్లి వారి కార్యాలయములో ఉంచడమైనది దానిని ఈ కార్యాలయపు పని వేళలలో ఏ సమయంలోనైన తనిఖీ చేసుకోవచ్చును. ఎల్ ఎ ఆర్ ఆర్ చట్టము, 2013 సెక్షస్ 16 నుండి 18 ప్రకారము జరిపిన విచారణలో సెక్షస్ 3(c)(ii) క్రింద నిర్వాసిత లేదా నష్టపోయిన కుటుంబములు ఏమియును లేవు.

బొగ్గు గనులు, ఇనుప రాయి, పలక రాయి లేదా ఇతర ఖనిజ సంపద సదరు భూమిలో గాని లేదా ఒక ప్రత్యేక భాగములో గాని ఉంటే అటువంటి భూములలో ప్రొజెక్టు నిర్మాణమునకు అవసరమైన భూభాగమును మాత్రమే త్రవ్వుట గాని తొలగించుట గాని చేయవలెను.

సం/-శ్రీమతి.ఎమ్ఎస్.నాగలక్ష్మి.ఎస్,ఐ.ఎ.ఎస్.,
జిల్లా కలక్టరు, విజయనగరం

ఉపాధి హామీలో కుటుంబాల సంఖ్య తగ్గుదల

తగ్గుతున్న సగటు ఉపాధి రోజులు ● ఒక్కో కుటుంబానికి 47.84 రోజుల మాత్రమే పని
- **వంద రోజుల ఉపాధి పొందిన కుటుంబాల సంఖ్య ఐదేళ్లలో కనిష్టం**
- **ఎన్‌ఎంఎంఎస్, ఎబిపిఎస్‌పై కేంద్రం చర్చలు**



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజిఎన్‌ఆర్‌ఈజిఎస్)లో పని కోరుకునే కుటుంబాల సంఖ్య క్రమంగా తగ్గుతూ వస్తుంది. ఒక్కో కుటుంబానికి అందించే సగటు ఉపాధి రోజులు కూడా తగ్గుతున్నాయి. ఈ మేరకు కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ అధికారిక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. 2020-21లో 7.55 కోట్ల కుటుంబాలు ఉపాధి పొందగా, 2021-22లో 7.25 కోట్ల కుటుంబాలు ఉపాధి పొందాయి. 2022-23లో 6.19 కోట్ల కుటుంబాలు ఉపాధి పొందాయి. అంటే 2020-21తో పోలిస్తే, 2021-22లో 30 లక్షల కుటుంబాలు ఉపాధికి దూరం అయ్యాయి. 2021-22తో పోలిస్తే, 2022-23లో 1.6 కోట్ల కుటుంబాలకు ఉపాధికి దూరం అయ్యాయి.

కోవిడ్ ముందు కంటే ఇప్పుడే ఉపాధి రోజుల సంఖ్య తక్కువ

ఎన్‌ఆర్‌ఈజిఎస్ ప్రతి గ్రామీణ కుటుంబానికి ఏడాదికి 100 రోజుల వేతన ఉపాధి హామీ ఇస్తుంది. కాని ఏడాదికి ఒక్కో కుటుంబానికి అందించిన సగటు ఉపాధి రోజులు 2020-21లో 51.52 రోజులు కాగా, 2021-22లో 50.07 రోజులకు తగ్గాయి. 2022-23లో అధికాస్తా 47.84 రోజులకు తగ్గాయని డేటా వెల్లడిస్తోంది. 2022-23లో ప్రతి కుటుంబానికి అందించిన ఉపాధి సగటు రోజులు కోవిడ్‌కు ముందు సమయంలో 2019-20లో నమోదైన 48.4 రోజుల సంఖ్య కంటే తక్కువగా ఉంది.

వంద రోజుల ఉపాధి పొందిన కుటుంబాల సంఖ్య ఐదేళ్లలో కనిష్టం

ఎన్‌ఆర్‌ఈజిఎస్ కింద 100 రోజుల వేతనంతో ఉపాధిని పొందిన కుటుంబాలు సంఖ్య 2022-23లో కేవలం 36.01 లక్షలు మాత్రమే. ఇది గత ఐదేళ్లలో కనిష్టంగా ఉంది. 2021-22లో 59.14 లక్షలు, 2020-21లో 71.97 లక్షలు, 2019-20లో 40.60 లక్షలు, 2018-19లో 52.59 లక్షల కుటుంబాలు మాత్రమే వంద రోజుల వేతనంతో ఉపాధిని పొందారు.

ఉపాధి హామీని నిర్వీర్యం చేసేందుకు కేంద్రం కుట్ర: బి.వెంకట్

ఉపాధి హామీని నిర్వీర్యం చేసేందుకు కేంద్రం కుట్ర పన్నుతోందని వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి. వెంకట్ విమర్శించారు. వలసను తగ్గించడం, వ్యవసాయంలో తగ్గిన ఉపాధిని పూడ్చడమే ఉపాధి హామీ లక్ష్యం. బడ్జెట్ కోతలు, కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన విధానాల వల్లే ఉపాధి హామీలో పని దినాలు, పని చేసే కుటుంబాల సంఖ్య తగ్గుతుంది. గత యుపిఎ ప్రభుత్వం కేంద్ర బడ్జెట్‌లో 4 శాతం నిధులు కేటాయిస్తే, ప్రస్తుత మోడీ సర్కార్ కేవలం 1.37 శాతానికి తగ్గించింది. అలాగే ఆధార్ ఆధారిత చెల్లింపులు, ఆన్‌లైన్ హాజరు వంటివి విధానాలను ప్రభుత్వం తీసుకొచ్చింది. ఉపాధి హామీని నిర్వీర్యం చేయడంలో భాగమే ఈ చర్యలను తీసుకొచ్చింది. రెండు పూట హాజరు రద్దు చేయాలి. వంద రోజుల పని కల్పించాలి. రోజుకు వేతనం రూ.600 ఇవ్వాలి" అని అన్నారు.

నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ (ఎన్‌ఎంఎంఎస్) యాప్, ఆధార్ ఆధారిత చెల్లింపు వ్యవస్థ (ఎబిపిఎస్)తో తప్పనిసరి హాజరును ప్రవేశపెట్టడం, బడ్జెట్‌లో ఉపాధి హామీకి నిధులు కోత విధించడం వల్ల ఉపాధి పొందుతున్న కుటుంబాల సంఖ్య తగ్గడానికి కారణమని సామాజిక కార్యకర్తలు పేర్కొన్నారు. 2023-24 బడ్జెట్‌లో గ్రామీణ ఉపాధి పథకానికి రూ. 29,400 కోట్ల తగ్గింపుపై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ కూడా ఆందోళన వ్యక్తం చేసింది. "ఈ పథకం గ్రామీణ ప్రజలలో పని చేయడానికి ఇష్టపడే అణగారిన వర్గాలకు 'పని చేసే హక్కు'ని అందిస్తుంది. ఆయా కుటుంబ సభ్యులకు ఆహారం ఇవ్వడానికి ఇతర మార్గాలు లేని నిరుద్యోగ వర్గానికి ఇది చివరి అస్త్రమని కమిటీ సమర్పించిన నివేదికలో పేర్కొంది. ఉపాధి హామీ పథకం 2006-07లో దేశంలో అత్యంత వెనుకబడిన 200 గ్రామీణ జిల్లాల్లో ప్రారంభించారు. 2007-08లో అదనంగా మరో 130 జిల్లాలకు విస్తరించారు. 2008-09లో దేశం మొత్తం అమలు చేశారు.

ఎన్‌ఎంఎంఎస్, ఎబిపిఎస్‌పై కేంద్రం చర్చలు

ఉపాధి హామీలో ఇటీవలి ప్రవేశపెట్టిన నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ (ఎన్‌ఎంఎంఎస్) యాప్, ఆధార్ ఆధారిత చెల్లింపు వ్యవస్థ (ఎబిపిఎస్)పై తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్న కేంద్ర ప్రభుత్వం, ఆ రెండు అంశాలపై చర్చలను ప్రారంభించింది. జనవరి 1 నుండి హాజరు కోసం ఎన్‌ఎంఎంఎస్ యాప్‌ను తప్పనిసరి చేయడం, జనవరి 30 నుంచి వేతనాల కోసం ఎబిపిఎస్ను అమలు చేయడం వంటి రెండు ఉత్తర్వులను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. వీటిపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తున్న నేపథ్యంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి శైలేష్ కుమార్ సింగ్ అధ్యక్షతన ఈ చర్చలు జరిగాయి. చర్చలకు రిలయన్స్ ఫౌండేషన్, స్వదేశ్ ఫౌండేషన్, ధన్ ఫౌండేషన్, స్వయం శిక్షన్ ప్రయోగ్, ట్రాన్స్‌ఫార్మింగ్ రూరల్ ఇండియా ఫౌండేషన్, మజ్దూర్ కిసాన్ శక్తి సంఘటన్ (ఎంకెఎస్ఎస్) సంస్థలను ఆహ్వానించారు.

ఈ సమావేశంలో ఉపాధి హామీ సంయుక్త కార్యదర్శి అమిత్ కటారియా, నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, యుఐడిఎఐ, ఎన్ఐసి, బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు. బీహార్, గుజరాత్, హర్యానా, తమిళనాడు కమిషనర్లు కూడా హాజరయ్యారు. ఎంకెఎస్ఎస్ వ్యవస్థాపక సభ్యుడు నిఖిల్ డే, లిబ్‌టెక్ సహ వ్యవస్థాపకుడు రాజేంద్రన్ నారాయణన్, సోషల్ అకౌంటబిలిటీ ఫోరమ్ ఫర్ యాక్షన్ అండ్ రీసెర్చ్ (సఫర్)కి చెందిన రక్షిత స్వామి సమావేశానికి హాజరైన తమ అభిప్రాయాలు చెప్పారు. ఈ సమావేశానికి ప్రముఖ ఆర్థికవేత్త జీన్ డ్రెజ్ లిఖితపూర్వక సమర్పణను పంపినట్లు తెలిసింది. గ్రామీణ ఉపాధి హామీ పథకంపై కేంద్రం "త్రిశూల్" దాడికి పాల్పడిందని డ్రెజ్ ఆరోపించారు.

రెండు వారాలకు చేరిన రెజ్లర్లు ఆందోళన

- **రానున్న రెండు రోజుల్లో జంతర్ మంతర్‌కు రైతులు, ఖాప్ పంచాయతీలు**



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

లైంగిక వేధింపులకు పాల్పడిన డబ్ల్యుఎఫ్ఐ చీఫ్, బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను అరెస్టు చేయాలని శాంతియుతంగా, ప్రజాస్వామ్య పద్ధతులో జంతర్ మంతర్ వద్ద దేశంలోని అగ్రశ్రేణి రెజ్లర్లు చేస్తున్న ఆందోళన శనివారానికి రెండు వారాలు కావస్తుంది. న్యాయం కోసం రోడ్డెక్కిన రెజ్లర్లు శుక్రవారం కూడా తమ ఆందోళనను కొనసాగించారు. రెజ్లర్లకు పౌర సమాజం మద్దతు పెరగడంతో ఉద్యమంలోకి అన్ని వర్గాలు చేరుతున్నాయి. హర్యానా, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల నుంచి ఖాప్ పంచాయతీలు నుండి వందలాది మంది రేపు (ఆదివారం) జంతర్ మంతర్‌కు చేరుకుంటారు. ఈ మేరకు ఖాప్ పంచాయతీలు నిర్ణయం తీసుకున్నాయి. శుక్రవారం రెజ్లర్లకు హర్యానా కాంగ్రెస్ నేత కుమారి సెల్జా, ఢిల్లీ పిసిసి అధ్యక్షుడు అనిల్ చౌదరి, ఐద్వా నేతలు జగ్మతి సంఘ్వాన్, ఎస్.పుణ్యవతి, ఆశా శర్మ, ఎన్ఎఫ్ఐడబ్ల్యు నేత అనీరాజా, ఎఐటియుసి నేత అమర్‌జీత్ కౌర్, రైతు నేతలు మద్దతు తెలిపారు. రెజ్లర్లకు హర్యానాలోని ప్రతిపక్ష పార్టీలు, ఖాప్ పంచాయితీల మద్దతు లభించడంతో అధికార బిజెపి, జెజెపి ప్రభుత్వంపై ఒత్తిడి పెరుగుతోంది. రెజ్లర్లకు హర్యానా ముఖ్యమంత్రి, బిజెపి నేత మనోహర్ లాల్ ఖట్టర్ మద్దతు ఇవ్వాలని డిమాండ్లు వెల్లువెత్తున్నాయి.

న్యాయం జరగకపోతే పతకాలు తిరిగి ఇస్తా: మహావీర్ ఫోగట్

డబ్ల్యుఎఫ్ఐ చీఫ్ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ, న్యాయం జరగకపోతే తన పతకాలను తిరిగి ఇచ్చేస్తానని ద్రోణాచార్య అవార్డు గ్రహీత, కోచ్ మహావీర్ సింగ్ ఫోగట్ ప్రకటించారు. "ఆయనఎదుర్కొనే ఆరోపణలు, ఆయనపై చర్యలు తీసు కోవాలి. ఆయనను అరెస్టు చేయాలి"అని మూడు సంవత్స రాల క్రితం బిజెపిలో చేరిన మహావీర్ ఫోగట్ పేర్కొన్నారు.

దేశ ప్రజలకు బజరంగ్ పునియా భావోద్వేగ పిలుపు

ఆందోళనలో తమ మద్దతు కోరుతూ స్టార్ ఇండియన్ రెజ్లర్ బజరంగ్ పునియా శుక్రవారం దేశ ప్రజలకు భావోద్వేగ పిలుపు ఇచ్చారు. తోటి రెజ్లర్లు సాక్షి మాలిక్, వినేష్ ఫోగట్‌లతో కలిసి "మేము మన దేశం గర్వం పడేలా పోరాడాము. ఈ రోజు మేము మీ ఛాంపియన్ల భద్రత, గౌరవం కోసం పోరాడుతున్నాము. దయచేసి మాకు మద్దతు ఇవ్వండి" అంటూ కోరారు.

డిమాండ్లు నెరవేరుతున్నాయి: అనురాగ్ సింగ్ ఠాకూర్

రెజ్లర్ల డిమాండ్లు నెరవేరుతున్నాయని కేంద్ర క్రీడల మంత్రి అనురాగ్ సింగ్ ఠాకూర్ అన్నారు. "ఒక కమిటీని ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఉంది. అది ఏర్పాటు చేయ బడింది. ఢిల్లీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. సుప్రీం కోర్టు కూడా తీర్పు ఇచ్చింది" అని అన్నారు.

పరిష్కారం అవుతుందని ఆశిస్తున్నా : సౌరభ్ గంగూలీ

"వారు తమ యుద్ధంలో పోరాడనివ్వండి. అక్కడ ఏమి జరుగుతుందో నాకు నిజంగా తెలియదు. నేను వార్తా పత్రికలలో చదివాను. క్రీడా ప్రపంచంలో నేను ఒక విషయం గ్రహించాను. మీకు పూర్తి అవగాహన లేని విషయాల గురించి మీరు మాట్లాడరు. అది పరిష్కా రమవుతుందని ఆశిస్తున్నా" అని గంగూలీ అన్నారు.

జెలెన్‌స్కీని భౌతికంగా నిర్మూలించాలి

మెద్వదెవ్ పిలుపు

మాస్కో: ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లదిమిర్ జెలెన్‌స్కీని, ఆయన ముఖ్య అనుచరులను భౌతికంగా నిర్మూలించాలని రష్యన్ భద్రతా మండలి డిప్యూటీ చైర్మన్ డిమిత్రో మెద్వదెవ్ పిలుపునిచ్చారు. రష్యా ఈ విధమైన పిలుపునివ్వడం ఇదే మొదటిసారి. రష్యా అధ్యక్ష భవనం క్రెమ్లిన్‌పై ఉక్రెయిన్ డ్రోన్ల దాడి తరువాత మెద్వదెవ్ సోషల్ మీడియాలో ట్వీట్ చేస్తూ ఈ సంగతి వెల్లడించారు. జెలెన్‌స్కీ, అతని అనుచరులను భౌతికంగా నిర్మూలించడం మినహా మరో మార్గం లేదు అని ఆయన ఆ ట్వీట్‌లో వెల్లడించాడు. రష్యా, నిజానికి ఆ పనిచేస్తుందా? జెలెన్‌స్కీ, అతని అనుచరులను భౌతికంగా తొలగించే సామర్థ్యం రష్యాకు ఉండా? అన్న ప్రశ్నలు తలెత్తాయి. రష్యా , ఉక్రెయిన్ యుద్ధం తలెత్తిన తరువాత ఒకరి నాయకుడ్ని మరొకరు గాయపరచడం కూడదనే నిబంధన ఉంది. పుతిన్, జెలెన్‌స్కీ ఇద్దరూ యుద్ధ క్షేత్రంలోకి వెళ్లి తమ తమ బలగాలకు ధైర్యం చెప్పివచ్చారు. ఇరు పక్షాల నాయకుల ప్రయాణ కదలికలను రహస్యంగా ఉంచుతారు. పాశ్చాత్య ఇంటెలిజెన్స్ నెట్‌వర్కు, ఉపగ్రహాల సహాయంతో పుతిన్ ప్రతి కదలికపైన నిఘా పెడుతున్నాయి.


హైదరాబాద్‌లో తగ్గిన ఇళ్ల అమ్మకాలు

- **ఏప్రిల్‌లో 18% పతనం**
- **నైట్ ఫ్రాంక్ ఇండియా వెల్లడి**



హైదరాబాద్ : హైదరాబాద్ రియల్ ఎస్టేట్ ప్రగతి కుంటుపడింది. ప్రస్తుత ఏడాది ఏప్రిల్‌లో ఇక్కడ నివాస గృహాల రిజిస్ట్రేషన్లు 18 శాతం పతనమై 4,398 యూనిట్లకు పరిమితమయ్యాయి. విలువ పరంగం 20 శాతం కోల్పోయి రూ.2,230 కోట్లుగా నమోదయ్యిందని నైట్ ఫ్రాంక్ ఇండియా ఓ రిపోర్ట్‌లో వెల్లడించింది. హైదరాబాద్, మెడ్చల్- మల్కాజిగిరి, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల్లోని అమ్మకాలను పరిగణలోకి తీసుకుని ఈ రిపోర్ట్‌ను రూపొందించింది. 2022 ఇదే ఏప్రిల్‌లో రూ.2,784 కోట్ల విలువ చేసే 5,366 యూనిట్ల రిజిస్ట్రేషన్లు జరిగాయి. వీటితో పోల్చితే గడిచిన నెలలో అమ్మకాలు తగ్గాయి. మొత్తం విక్రయాల్లో రూ.25-50 లక్షల విలువ చేసే నివాసాల వాటా 54 శాతంగా ఉంది. రూ.25 లక్షల దిగువన కలిగిన ఆస్తుల వాటా 18 శాతంగా నమోదయ్యింది. రూ.1 కోటి పైన విలువ చేసే గృహాల వాటా 13 శాతంగా ఉంది. కాగా.. అధిక ధర కలిగిన ఈ విభాగం విక్రయాల్లో మాత్రం 11 శాతం పెరుగుదల చోటు చేసుకోవడం విశేషం. "ఏప్రిల్ 2023లో హైదరాబాద్ మార్కెట్ రిజిస్ట్రేషన్లలో తగ్గుదల నమోదు చేసినప్పటికీ.. ఇది గత సంవత్సరం ఇదే నెలలో కనిపించిన నమూనాకు అనుగుణంగా ఉంది. 1000-2000 చదరపు అడుగుల గృహాలకు డిమాండ్ పెరిగింది. ఇది మరింత స్థలం, సౌకర్యాలతో అప్‌గ్రేడ్ చేసిన గహాల కోరికను ప్రతిబింబిస్తుంది." అని నైట్ ఫ్రాంక్ ఇండియా సీనియర్ బ్రాంచ్ డైరెక్టర్ శాంసన్ ఆర్థర్ పేర్కొన్నారు.

మీ షోలో మరో 251 మందిపై వేటు



న్యూఢిల్లీ : ఇ-కామర్స్ వేదిక మీషో మరోసారి ఉద్యోగుల తొలగింపునకు పాల్పడింది. సాఫ్ట్‌బ్యాంక్ మద్దతు కలిగిన ఈ సంస్థ రెండో దఫాలో 251 మంది సిబ్బందికి ఉద్వాసనకు పలికింది. ఈ సంఖ్య కంపెనీ మొత్తం సిబ్బందిలో 15 శాతానికి సమానం. తొలగింపు విషయమై శుక్రవారం ఉద్యోగులకు ఇ-మెయిల్ ద్వారా సమాచారం ఇచ్చింది. గతేడాది చివరలో 150 మంది ఉద్యోగులకు ఉద్వాసన పలికింది. తాజాగా తొలగింపునకు గురైన సిబ్బందికి ఒకేసారి 2.5 నుంచి 9 నెలల వేతనాన్ని పరిహారంగా అందజేస్తామని ఆ కంపెనీ తెలిపింది. ఉద్యోగుల పదవి, పనిచేసిన కాలం, వేతనం ఆధారంగా పరిహార ప్యాకేజీ ఉంటుందని మీషో సిఇఒ విదిత్ ఆత్రే తెలిపారు. బీమా ప్రయోజనాలను కూడా కొనసాగిస్తామన్నారు. కొత్త ఉద్యోగాన్ని వెతుక్కోవడంలోనూ సహకరిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

ఫైబ్‌తో కేర్ హాస్పిటల్స్ భాగస్వామ్యం



హైదరాబాద్ : కన్స్యూమర్ లెండింగ్ వేదిక ఫైబ్‌తో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు ప్రముఖ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ నెట్‌వర్క్‌ల్లో ఒక్కటైన కేర్ హాస్పిటల్స్ ప్రకటించింది. దీని ద్వారా రోగులు రూ.10 లక్షల వరకు జీరో కాస్ట్ ఇఎంఐ రుణాలను పొందవచ్చని తెలిపింది. అన్ని రకాల చికిత్సలకు ఫైబ్ రుణ మద్దతును అందించనుందని పేర్కొంది. తొలుత ఈ సేవలు హైదరాబాద్, భువనేశ్వర్‌లోని కేర్ హాస్పిటల్స్‌లో లభ్యమవుతాయని వెల్లడించింది. ఫైబ్‌తో తమ భాగస్వామ్యం రోగులు, వారి కుటుంబాలు వైద్య ఖర్చుల వల్ల ఎదురయ్యే ఆర్థిక భారం నుంచి బయటపడేందుకు సహాయపడనుందని కేర్ హాస్పిటల్స్ గ్రూప్ సిఎఫ్ఒ వికాస్ రస్తోగి తెలిపారు.

గ్రామీణ ప్రాంతాలపై హెచ్‌డిఎఫ్‌సి దృష్టి

ముంబయి : ప్రయివేటు రంగంలోని హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ గ్రామీణ ప్రాంతాల్లో విస్తరణపై ప్రధాన దృష్టి సారించినట్లు తెలిపింది. దేశంలోని చిన్న పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో తన ఉనికిని విస్తరించేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు పేర్కొంది. ఈ నేపథ్యంలోనే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆ ప్రాంతాల్లో 675 పైగా శాఖలను తెరువడం ద్వారా 5000కు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించింది. 2023 మార్చి 31 నాటికి తనకున్న 7821 శాఖల్లో 52 శాతం సెమీ అర్బన్, గ్రామీణ ప్రాంతాల్లోనే ఉన్నాయని పేర్కొంది.


పసిడికి అధిక ధరల దెబ్బ

- **డిమాండ్‌లో 17% పతనం**

న్యూఢిల్లీ : అధిక ధరల దెబ్బకు బంగారం అమ్మకాలు భారీగా పడిపోయాయి. ప్రస్తుత ఏడాది జనవరి నుంచి మార్చి కాలంలో భారత్‌లో పసిడి డిమాండ్ 17 శాతం పతనమై 112.5 టన్నులకు పరిమితమయ్యిందని వాల్డ్ గోల్డ్ కౌన్సిల్ (డబ్ల్యుజిసి) వెల్లడించింది. అధిక ధరలు డిమాండ్‌లో అస్థిరతను పెంచాయని తెలిపింది. గతేడాది ఇదే త్రైమాసికంలో 135.5 టన్నుల డిమాండ్ చోటు చేసుకుంది. దీంతో పోల్చితే దాదాపు 17 టన్నుల అమ్మకాలు పడిపోయాయి. 2010 నుంచి కరోనా సంక్షోభం ముందు వరకు దేశంలో నాలుగు సార్లు 100 టన్నుల దిగువన బంగారానికి డిమాండ్ చోటు చేసుకుందని డబ్ల్యుజిసి రీజినల్ సిఇఒ ఇండియా సోమసుందరం పేర్కొన్నారు. గత కొన్ని నెలలుగా దేశంలో 10 గ్రాముల బంగారం ధర రూ.60వేల ఎగువన నమోదవుతోంది. దీంతో వినియోగదారులు కొనుగోళ్లు చేయలేకపోతున్నారు.

ఒలెక్ట్రా గ్రీన్‌టెక్‌కు రూ.66 కోట్ల లాభాలు

బలమైన ఆర్డర్ బుక్ మద్దతు



హైదరాబాద్ : విద్యుత్ బస్సుల తయారీ సంస్థ ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. గడిచిన ఆర్థిక సంవత్సరం 2022-23లో 84 శాతం వృద్ధితో రూ.1,090 కోట్ల రెవెన్యూ ఆర్జించి.. నికర లాభాల్లో 86 శాతం పెరుగుదలతో రూ.65.59 కోట్లను సాధించింది. ఇంతక్రితం ఏడాది రూ.35.35 కోట్ల లాభాలు నమోదు చేసింది. గడిచిన ఆర్థిక సంవత్సరంలో 563 విద్యుత్ బస్సులను డెలివరీ చేసింది. ఇంతక్రితం 2021-22లో 259 ఇ-బస్సులను అందించింది. ప్రస్తుతం 3,394 యూనిట్ల ఆర్డర్ బుక్‌ను కలిగి ఉన్నట్లు ఆ కంపెనీ తెలిపింది. 2022-23 మార్చితో ముగిసిన త్రైమాసికంలో ఒలెక్ట్రా రెవెన్యూ 39 శాతం పెరిగి రూ.375 కోట్లకు చేరడంతో రూ.27.81 కోట్ల నికర లాభాలు సాధించినట్లు పేర్కొంది. "2023 మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో రెవెన్యూ, నికర లాభాల పరంగా మెరుగైన వృద్ధిని కనబర్చినందుకు సంతోషంగా ఉంది. మా తయారీ సామర్థ్యాన్ని సాంకేతిక సామర్థ్యాలను పెంపొందించడంపై మా దృష్టి కొనసాగుతుంది. దేశ క్లీన్ మొబిలిటీ ఎజెండాకు మా వంతు సహకారం అందించడమే లక్ష్యం." అని ఒలెక్ట్రా గ్రీన్ టెక్ సిఇఒ కెవి ప్రదీప్ తెలిపారు.

2024లో మతం కార్డు పని చేయదు

• మోడీ సర్కార్ జిమ్మిక్కులు ప్రజలకు అర్థమయ్యాయి • ఈ దఫా ఇంటికే • బిబిసి ప్రత్యేక ఇంటర్వ్యూలో సత్యపాల్ మాలిక్

న్యూఢిల్లీ : 2024 సార్వత్రిక ఎన్నికల్లో మతతత్వ కార్డు పని చేయదని జమ్ముకాశ్మీర్ మాజీ గవర్నరు సత్యపాల్ మాలిక్ చెప్పారు. నిరుద్యోగం, అధిక ధరలు వంటి అనేక సమస్యలు ఎదుర్కొంటున్న ప్రజల ఐక్యతను దెబ్బతీసేందుకు మోడీ సర్కార్ విసురుతున్న మతం పాచికలు ఈ దఫా ఎన్నికల్లో ఫలించబోమని ఆయన పేర్కొన్నారు. పుల్వామా ఉగ్రదాడికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ఉదాసీన వైఖరే కారణమంటూ విమర్శలు గుప్పించిన అనంతరం ఆయనను మోడీ సర్కార్ లక్ష్యంగా చేసుకోవడం, మద్దతుదారులను నిర్బంధించడం వంటి పరిణామాల నేపథ్యంలో బిబిసి ప్రతినిధి సర్వప్రియ సాంఘ్వాన్‌కు సత్యపాల్ మాలిక్ ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ సారాంశం క్లుప్తంగా..



ప్రశ్న: మీరు గవర్నర్‌గా ఉన్నా, లేకున్నా, ఎన్నో వేదికలపై బిజెపి ప్రభుత్వ విధానాలు, నిర్ణయాలకు వ్యతిరేకంగా మాట్లాడుతూ వచ్చారు. మీ ఫిర్యాదులను పార్టీ అగ్రనేతల వరకూ చేర్చగలిగానని చెప్పారు. కానీ పార్టీ గురించి బహిరంగంగా మాట్లాడాలని ఎప్పుడు అనిపించింది?

జవాబు: రైతుల ఉద్యమం. దాని గురించి బయట మాట్లాడ్డానికి ముందు నేను ప్రధానిని కలిసి మాట్లాడాను. ఆయన వైఖరి చూశాక.. లేదు, ఇక మాట్లాడాలి పదవి పోయినా ఫర్వాలేదు అనుకున్నాను.

ప్రశ్న: ఆయన వైఖరి ఎలా ఉంది?

జవాబు: రైతుల గురించి ఆయనలో అసలు ఎలాంటి బాధా కనిపించలేదు.వెళ్లిపోతారులే, ఏం కాదు సత్యపాల్ అన్నారు.

ప్రశ్న: మీరు మేఘాలయ గవర్నర్‌గా ఉన్నప్పుడు రాజస్థాన్‌లో ఒక సభలో మాట్లాడారు. కాశ్మీర్ గురించి చెబుతూ నా దగ్గరకు రెండు ఫైల్స్ వచ్చాయని, వాటిలో ఒకదానిలో సంఘ్‌కు చెందిన ఒక పెద్ద వ్యక్తి, మరోదాన్లో అంబానీ ప్రమేయం ఉందని రెండు విభాగాల సెక్రటరీలు చెప్పారని, ఆ ఒప్పందాలు రద్దు చేశానని తెలిపారు. దానిపై ప్రధానిని కూడా కలిశానని, ఆయన అవినీతిపై రాజీ పడాల్సిన అవసరం లేదని మీతో అన్నారని చెప్పారు.

జవాబు: ఆ విషయంలో ఆయన నాకు మద్దతిచ్చారు.

ప్రశ్న: కానీ ఇటీవల మీరు ఒక ఇంటర్వ్యూలో ప్రధాని అవినీతి గురించి పెద్దగా పట్టించుకోవడం లేదన్నారు.

జవాబు: లేదు, నేను చాలా విషయాల్లో చూశాను. అవినీతి గురించి ఆయన పెద్దగా పట్టించుకోవడం లేదు. గోవాలో నేను అవినీతిపై ఫిర్యాదు చేసినందుకే నన్ను తొలగించారు. అవినీతిపరులను తొలగించడానికి బదులు నన్ను బదిలీ చేశారు.

ప్రశ్న: కానీ ఈ రెండూ పరస్పరం విరుద్ధంగా ఉన్నాయి కదా? ఆయన అక్కడ మిమ్మల్ని సపోర్ట్ కూడా చేశారని చెప్పారు కదా?

జవాబు: వాటిని నేను అప్పటికే రద్దు చేశాను. రద్దు చేసిన తర్వాత వెళ్లాను. సర్ నేను వీటిని రద్దు చేశాను, కావాలంటే నన్ను తొలగించి వేరే వాళ్లను నియమించండి అని చెప్పా. కానీ, ఆయన అవినీతిపై రాజీపడేది లేదన్నారు.

ప్రశ్న: పుల్వామా గురించి మీరు కొత్త విషయం మాట్లాడారు. ఇటీవల దానిపై అసదుద్దీన్ ఒవైసీ కూడా మాట్లాడేసరికి అది చాలా పెద్ద విషయం అయ్యింది. జవాన్లు మరణించినా, మీరు రాజీనామా చేయలేదు. ఆ విషయానికి అంత ప్రాధాన్యం ఇవ్వలేదు అన్నారు. మిమ్మల్ని అడ్డుకున్నది ఏది? పదవీ వ్యామోహమా?

జవాబు: లేదు. ఆయనకు తెలీదు. నేను, దానికి చాలా ప్రాధాన్యం ఇచ్చాను. ప్రధానితో ఇది మన వాళ్ల తప్పిదం వల్లే జరిగిందని చెప్పాను. దానిపై విచారణ జరగాలని కూడా కోరుకున్నా. దర్యాప్తు జరుగుతుందనే అనుకున్నా. అందుకే, దానిపై రాజీనామా చేయాల్సిన అవసరం కలగలేదు.

ప్రశ్న: అయినా ఏడాది తర్వాత, ఏడాదిన్నర తర్వాత కూడా మీరు రాజీనామా చేయలేదు. కాశ్మీర్ నుంచి గోవాకు, గోవా నుంచి మేఘాలయ గవర్నర్‌గా వెళ్లారు?

జవాబు: కానీ నేను రాజీనామా చేయడం వల్ల ఏదైనా పరిష్కారం అయితే, ఏదైనా ఎక్కువ హైలైట్ అయ్యేలా ఉంటే చేసేవాడిని.

ప్రశ్న: మీరు బిజెపి ప్రభుత్వంపై ఇన్ని ఆరోపణలు చేయడాన్ని చూసి జనం మిమ్మల్ని అవకాశవాది అంటున్నారు? వారితో మీ బంధం చెడిన తర్వాత ఇలాంటివి మాట్లాడుతున్నారని అంటున్నారు. మీరు దీనిపై ఏం చెబుతారు?

జవాబు: ఆ బాధ్యత హోం మినిస్ట్రీది. నేను వారి దగ్గర లేవనెత్తాను. వారికి చెప్పాను. వాళ్లు అది చేసుండాల్సింది. దానికి బాధ్యులైన వాళ్ళు రాజీనామా చేసుండాల్సింది. నేనెందుకు చేయాలి? పుల్వామా ఘటన జరిగిన తొలిరోజే నేను దీన్ని లేవనెత్తాను. మీరు నోరు విప్పకండి అన్నారు. తర్వాత దీన్ని పాకిస్తాన్‌వైపు, మరో దిశగా తీసుకెళ్తన్నారని నాకు అనిపించింది. ఆ సమయంలో వారిని వ్యతిరేకించడం చాలా ప్రమాదకరం. దేశద్రోహి అని ముద్ర కూడా వేసుండేవారు. రైతుల ఉద్యమం విషయంలో కూడా వీళ్ల రైతులను నిర్లక్ష్యం చేస్తున్నారని నాకు అనిపించగానే నేను ఆ విషయాన్ని లేవనెత్తా!

ప్రశ్న: ఒక పత్రికలో కూడా వచ్చింది. నాలుగు నెలల నుంచీ దీనిపై చర్చ జరుగుతోంది. విమానం కోసం డిమాండ్ చేస్తున్నారు. నేను చెప్పినా విమానం ఇవ్వలేదని మీరొక ఇంటర్వ్యూలో చెప్పారు.

జవాబు: లేదు, నేను చెప్పలేదు. అది సరైన సమాచారం కాదు. నేను అందులో అసలు లేను. సీఆర్పీఎఫ్ నన్ను విమానం అడిగుంటే ఇప్పించే వాడిని. నేను అందులో ఎక్కడా లేను. సీఆర్పీఎఫ్ హోం మినిస్ట్రీని అడిగింది. వాళ్ళు ఇవ్వలేదు.

ప్రశ్న: అప్పటి హోం మినిస్టర్‌గా రాజ్‌నాథ్ సింగ్ ఉన్నారు. అయితే దీనికి బాధ్యత ఎవరిదని మీరు భావిస్తున్నారు?

జవాబు: దీనికి బాధ్యత అంతా రాజ్‌నాథ్ సింగ్, ప్రధానిదే అనుకుంటున్నా!

ప్రశ్న: చాలామంది నేతలపై సిబిఐ, ఈడీ కేసులు నడుస్తున్నాయి. కొందరు జైల్లో కూడా ఉన్నారు. మీకు కూడా అలాంటిది ఏదైనా జరగవచ్చు అని భయం వేయడం లేదా?

జవాబు: లేదు.. లేదు.. నేను అన్నింటికీ సిద్ధంగా ఉన్నా..

ప్రశ్న: వాళ్ళు కూడా మేము ఏమీ చేయలేదనే చెబుతున్నారు. అయినా జైల్లో ఉన్నారు కదా?

జవాబు: నేను జైలుకు చాలాసార్లు వెళ్ళాను.

ప్రశ్న: మీకు ఈ కాన్ఫిడెన్స్ ఎక్కడ్నుంచి వచ్చింది?

జవాబు: దృఢ నిశ్చయం నుంచి వచ్చింది. నేను సరైన దిశలో ఉన్నాను. సరైన ప్రశ్ననే వస్తున్నాను అనుకుంటున్నా. దీనిపై నేను జైలుకు వెళ్ళాల్సి వచ్చినా వెళ్తాను.

ప్రశ్న: మీరు ఎన్నికల్లో పోటీ చేయాలనుకుంటున్నారా?

జవాబు: అసలు పోటీచేయను. ఎవరైనా అడిగినా పోటీ చేయను?

ప్రశ్న: జమ్ము-కాశ్మీర్, బీహార్‌లలో అవినీతి ఉందని మీరు మాట్లాడారు. మీరు అక్కడ గవర్నర్‌గా పనిచేశారు కదా? అలాగే దేశమంతా ఇదే పరిస్థితి ఉందన్నారు. అవినీతికి వ్యతిరేకంగా మీకు దేశంలో ఎవరైనా వ్యక్తి కనిపిస్తున్నారా?

జవాబు: ఒక వ్యక్తి అని నేను చెప్పను. చాలామంది ఉన్నారు. దేశంలో అలాంటి వాళ్లు లేరని కాదు. చాలామంది మిగిలే ఉన్నారు. బీహార్‌లో నితీశ్ మచ్చలేని వ్యక్తి. అలాగే ఉత్తరప్రదేశ్‌లో కూడా. ఇక ఢిల్లీ వారు మద్యం విషయంలో ఏం జరిగిందో తెలీదు. కానీ వారు మంచి వారే.

ప్రశ్న: కానీ బీహార్‌లో చాలాకాలం సిఎం నితీశ్ కుమారే ఉన్నారు? ఆ సమయంలో మీరు గవర్నర్‌గా ఉన్నప్పుడు అక్కడ విద్యావ్యవస్థలో అవినీతి ఉందన్నారు? అలాంటప్పుడు మీరు నితీశ్‌ది మచ్చలేని ఇమేజ్ అని ఎలా చెప్పగలరు?

జవాబు: అంటే, మిగతా వాళ్లతో పోల్చిచూస్తే, ఆయనే మెరుగైనవారు.

ప్రశ్న: మీరు చెప్పిన విషయాలను అరవింద్ కేజ్రీవాల్ కూడా ప్రస్తావిస్తున్నారు. మీరేమంటారు?

జవాబు: అరవింద్ కేజ్రీవాల్ మిగతావారికంటే మెరుగైనవారు.

ప్రశ్న: ఏ విషయంలో?

జవాబు: అవినీతి విషయంలో...

ప్రశ్న: కానీ ఢిల్లీలో కూడా ఆయనపై ఆరోపణలు వస్తున్నాయి కదా?

జవాబు: ఢిల్లీలో ఎన్నికలకు ముందు ఆయన్ను జైల్లో పెడతారని నాకు అనిపిస్తోంది.

ప్రశ్న: అంటే ఆయన్ను అరెస్టు చేస్తారన్నమాటర.!

జవాబు: వంద శాతం..

ప్రశ్న: అయితే ఆయన మోడీకి దీటైన వ్యక్తి కాగలరంటారా?

జవాబు: లేదు, మోడీకి దీటైన వ్యక్తి ఎవరూ లేరు. మోడీకి వ్యతిరేకంగా ప్రజలే ముఖచిత్రం కావాలి. అంటే పీపుల్ వర్సెస్ మోడీ ఎన్నికలు జరగాలి.

ప్రశ్న: నరేంద్ర మోడీ పాపులారిటీకి కారణం ఏదనిపిస్తోంది?

జవాబు: అది ఒక విధంగా మేనేజ్ చేసింది.

ప్రశ్న: కానీ అది ఇప్పటికీ ఉంది. 2014లో విజయమే కాదు, 2019లో కూడా జనం ఆయనకు భారీ మెజారిటీ ఇచ్చారు?

జవాబు: అది ఉత్తరాదిన మతపరమైన నిర్ణయం వల్ల జరిగింది.

ప్రశ్న: అయితే 2024లో అది పనిచేయదా?

జవాబు: పనిచేయదు. నేనిప్పటి వరకు చూస్తున్న దాని ప్రకారం, 2024 ఎన్నికల్లో ఇది పనిచేయదు. ప్రజలకు ఈ గేమ్ అర్థమైంది. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం వల్ల ప్రజలు బాధపడుతున్నారు.

ప్రశ్న: కానీ క్షేత్రస్థాయిలో చూసినప్పుడు జనం ఆయన చేతిలో ఏం లేదు, స్థానిక ప్రజా ప్రతినిధుల వల్లే అలా అయ్యిందంటున్నారు. మోడీపై ప్రజలు ప్రశ్నలు లేవనెత్తడం లేదు?

జవాబు: ప్రశ్నిస్తున్నారు. నేను కూడా నెలలో 8-10 సమావేశాలు నిర్వహిస్తా.. ప్రజలను కూడా కలుస్తున్నాను.

ప్రశ్న: మీరు ఒక ఇంటర్వ్యూలో మోడీతో ఆర్ఎస్ఎస్ అంత సంతోషంగా లేదని అన్నారు. ఎందుకు?

జవాబు: నాకు వచ్చిన సమాచారం అది. ఆర్ఎస్ఎస్‌లో ఆదాయం సంపాదిస్తున్నవారంతా సంతోషంగానే ఉన్నారు. అన్ని సెంట్రల్ యూనివర్శిటీల వీసీలు, ప్రిన్సిపల్ కూడా కాలేనివారు ఆర్ఎస్ఎస్ కనెక్షన్ వల్ల ఆ పదవులు పొందారు. కానీ ఆరెస్సెస్ కోర్ అంటే కీలకమైన భగవత్ లాంటి నేతలు, బహుశా ఆయన అహంకారం వల్ల అంత సంతోషంగా లేరు.

ప్రశ్న: ఆరెస్సెస్ వేరే ఎవరినైనా అధికారంలో చూడాలని అనుకుంటోందా?

జవాబు: యోగీజీని చూడాలని అనుకుంటోంది.

రాజీనామాపై శరద్ పవార్ యూటర్న్

ముంబయి : నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సిపి) జాతీయ అధ్యక్షులుగా రాజీనామా చేస్తూ తీసుకున్న నిర్ణయాన్ని శరద్ పవార్ శుక్రవారం వెనక్కి తీసుకున్నారు. పార్టీ కార్యకర్తల నుంచి వచ్చిన తీవ్రమైన స్పందన కారణంగానే రాజీనామా నిర్ణయాన్ని ఉపసంహరించుకుంటున్నట్లు శరద్ పవార్ తెలిపారు. ' నా నిర్ణయాన్ని పునరాలోచించుకోవాలని పార్టీ సభ్యులతో సహా కార్యకర్తలు, శ్రేయోభిలాషులు కోరారు. మీ మనోభావాలను నేను ఆగౌరవ పర్చలేను. నాపై మీరు చూపిన ఆప్యాయత, విశ్వాసం నన్ను ముంచెత్తింది. కమిటీ నిర్ణయాన్ని గౌరవిస్తూ, నా రాజీనామాను వెనక్కి తీసుకుంటున్నాను' అని పార్టీ క్యాడర్‌ను ఉద్దేశించి శరద్ పవార్ తెలిపారు. కాగా, అంతకు ముందు శుక్రవారం ఉదయం ముందుగా జరిగిన ఎన్‌సిపి కమిటీ సమావేశం శరద్ పవార్ రాజీనామాను ఏకగ్రీవంగా తిరస్కరించింది. పార్టీ అధ్యక్ష పదవిలో కొనసాగాలని శరద్ పవార్‌ను కోరాలని కూడా నిర్ణయం తీసుకుంది. ముంబయిలోని ఎన్‌సిపి ప్రధాన కార్యాయలంతో ఈ కమిటీ సమావేశం 30 నిమిషాలకు పైగా కొనసాగింది. సమావేశం అనంతరం మీడియాతో పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు ప్రఫుల్ పటేల్ మాట్లాడుతూ ' ఎన్‌సిపి జాతీయ అధ్యక్ష పదవి నుంచి వైదొలగాలన్న శరద్ పవార్ నిర్ణయాన్ని కమిటీ ఏకగ్రీవంగా తిరస్కరిస్తూ ప్రతిపాదనను ఆమోదించింది. ఎన్‌సిపికి పవార్ మూలస్తంభం. ఈ పదవిలో ఆయన శాశ్వతంగా ఉండాలన్నదే మా కోరిక' అని చెప్పారు. అనంతరం కమిటీ నిర్ణయాన్ని శరద్ పవార్ 'సిల్వర్ ఓక్' నివాసంలో పవార్‌కు పటేల్, అజిత్ పవార్, జయంత్ పాటిల్, సుప్రియా సూలే తదితర పార్టీ సీనియర్ నాయకులు తెలియ చేశారు.

రియల్ కేరళ స్టోరీ యూట్యూబ్ ఛానెల్ ప్రారంభం

- కేరళపై సంఘ్ పరివార్ విద్వేషపూరిత దాడికి డివైఎఫ్ఐ కౌంటర్
- సోషల్ మీడియా ప్రచారాన్ని ప్రారంభించిన యువజన సంఘం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేరళపై సంఘ్ పరివార్ విద్వేషపూరిత దాడికి కౌంటర్‌గా డివైఎఫ్ఐ సోషల్ మీడియా ప్రచారాన్ని ప్రారంభించింది. డివైఎఫ్ఐ 'రియల్ కేరళ స్టోరీ (నిజమైన కేరళ కథ)' పేరుతో యూట్యూబ్ ఛానెల్‌ను ప్రారంభించింది. తమకు రాష్ట్రానికి సంబంధించిన వాస్తవ కథనాలను ఎవరైనా పంపవచ్చని ప్రజలను కోరింది. కేరళకు వ్యతిరేకంగా సంఘ్ పరివార్ ద్వేషపూరిత ప్రచారం చేస్తోందని ఆరోపిస్తూ, వాస్తవాన్ని ప్రపంచానికి చాటిచెప్పేందుకు తాము పెద్దఎత్తున సోషల్ మీడియా ప్రచారాన్ని ప్రారంభించనున్నామని డివైఎఫ్ఐ శుక్రవారం తెలిపింది. డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు వికె సనోజ్ మాట్లాడుతూ.. కేరళ స్టోరీ పేరుతో యూట్యూబ్ ఛానల్‌ను ప్రారంభిస్తున్నామని, రాష్ట్రంలోని వాస్తవ కథనాలను ప్రజలెవరైనా తమకు పంపవచ్చని తెలిపారు. 'మేము ఈ వీడియోలను తనిఖీ చేసి వాటిని అప్‌లోడ్ చేస్తాము. ఈ వీడియోలు ఇతర సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లకు కూడా అప్‌లోడ్ చేయబడతాయి' అని సనోజ్ చెప్పారు. డివైఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షులు, రాజ్యసభ ఎంపి ఎఎ రహీమ్ మాట్లాడుతూ.. 'కేరళకు వ్యతిరేకంగా ద్వేషపూరిత ప్రచారాన్ని సమర్థించాలనే ఆలోచనతో ఆర్ఎస్ఎస్ ఉంది. లవ్ జిహాద్, నార్కోటిక్స్ జిహాద్ ప్రచారాల నుండి వారు ఇలాంటి విద్వేష ప్రచారాలకు పాల్పడుతున్నారు. కేరళ ప్రతిష్టను దిగజార్చడానికి వారు సోషల్ మీడియా హ్యాండిల్స్ ద్వారా ఇలాంటి అనేక తప్పుడు ప్రచారాలను ప్రసారం చేస్తున్నారు' అని విమర్శించారు. 'మత సామరస్యం నుండి పర్యాటక ప్రాంతాల వరకు, విద్య, పేదలకు ఇళ్లు అందించే లైఫ్ మిషన్ వంటి సామాజిక సంక్షేమ పథకాల వరకు ఏవైనా అంశాలు కేరళ అభివృద్ధిని ప్రతిబింబించే వాస్తవ వీడియో ఉండాలి. మేము ప్రజలకు వాట్సాప్ నెంబరును షేర్ చేస్తాము. వారు వీడియోలను ఆ నెంబరుకు పంపవచ్చు' అని తెలిపారు.

అవినీతి చేసినట్లు రుజువయితే ఉరితీయండి : కేజ్రీవాల్

లుధియానా: కేంద్ర దర్యాప్తు సంస్థలు ఎలాగైనా తనను 'దొంగ' అని నిరూపించేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయని ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ మండిపడ్డారు. తాను ఒక్క పైసా అవినీతికి పాల్పడినట్టు రుజువైనా తనని బహిరంగంగా ఉరితీయాలని ప్రధాని నరేంద్ర మోడీకి సూచించారు. శుక్రవారం పంజాబ్‌లో పర్యటించిన కేజ్రీవాల్ 80 ఆమ్ ఆద్మీ క్లినిక్‌లను ప్రజలకు అంకితం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..' కేజ్రీవాల్ అవినీతిపరుడైతే ఈ ప్రపంచంలో నిజాయతీపరులెవరూ లేనట్టే. నేను ఒక్క పైసా అవినీతికి పాల్పడినట్టు తేలిన రోజే నన్ను బహిరంగంగా ఉరి తీయండి. కానీ, రోజూ చేస్తున్న ఈ డ్రామాలను ఆపండి" అంటూ కేంద్రంపై ధ్వజమెత్తారు. ఢిలీ మద్యం కుంభకోణం కేసులో ఇప్పటికే ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా అరెస్టు చేసిన సిబిఐ అధికారులు.. గత నెల 16న కేజ్రీవాల్‌ను సైతం సుదీర్ఘంగా విచారించిన విషయం తెలిసిందే. ఆమ్ ఆద్మీ క్లీనిక్‌ల ప్రారంభోత్సవం సందర్భంగా పంజాబ్ సిఎం భగవంత్ మాన్ మాట్లాడారు. పంజాబ్‌లో ఇప్పటివరకు 580 ఆమ్ ఆద్మీ క్లీనిక్‌లను ప్రారంభించామన్నారు. ఆయా క్లీనిక్‌లలో 48 రకాల టెస్టులు, అన్ని ఔషధాలు ఉచితంగా అందిస్తున్నట్టు చెప్పారు.

అంగారకుడిపై ద్రవ నీటి ఆధారాలు

- కనుగొన్న చైనా పరిశోధకులు

బీజింగ్ : చైనా పరిశోధకులు తొలిసారిగా అంగారకుడిపై మంచు లేదా హిమపాతం కారణంగా ఏర్పడిన ద్రవ నీటి ఆధారాలను కనుగొన్నారు. చైనా అంగారకుడిపై ప్రయోగించిన రోవర్ జురాంగ్ నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా ఈ విషయాన్ని కనుగొన్నారు. ఇది అంగారక గ్రహం వాతావరణాన్ని, ఆ గ్రహంపై నివాసయోగ్యమైన వాతావరణం కోసం అన్వేషణను అర్థం చేసుకోవడానికి ఎంతోగానో ఉపయోగపడుతుంది. జురాంగ్ రోవర్ దిగిన ప్రాంతంలో ఉపరితలాలు నీటిని కలిగి ఉన్న ఖనిజాలతో సమృద్ధిగా ఉన్నాయని డేటా విశ్లేషణ తెలుపుతుంది. అంగారకుడిపై ద్రవ నీటి ఉనికి చాలా కాలంగా ఆసక్తిని కలిగిస్తోంది. ఎందుకంటే ద్రవ నీటి ఉనికి నివాసయోగ్యమైన వాతావరణాన్ని, జీవం యొక్క ఉనికిని కూడా సూచిస్తుంది.

తల్లి గర్భంలోనే శిశువుకు శస్త్ర చికిత్స

- ప్రపంచంలో తొలిసారి
- అమెరికా వైద్యుల ఘనత


వాషింగ్టన్: అమెరికా వైద్యులు అరుదైన ఘనత సాధించారు. తల్లి గర్భంలోని శిశువు మెదడుకు శస్త్ర చికిత్స చేశారు. ప్రపంచంలోనే ఈ తరహా ఆపరేషన్ ఇదే తొలిసారి కావడం విశేషం. బోస్టన్‌లోని పిల్లల ఆసుపత్రిలో ఈ ఆపరేషన్ జరిగింది. దీనికి సంబంధించిన వివరాలు స్ట్రోక్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. సాధారణ వైద్యపరీక్షల్లో భాగంగా తల్లిగర్భంలోని 30 వారాల శిశువు మెదడులో ఉన్న సమస్యను వైద్యులు గుర్తించారు. మెదడులో అరుదైన రక్తనాళాల సమస్య వారి దృష్టికి వచ్చింది. ఈ సమస్యతో బాధపడే శిశువు గుండె వైఫల్యం లేక మెదడు దెబ్బతినడం జరుగుతుంది. చాలావరకు ఇలాంటి కేసుల్లో జీవించడం అరుదు. మెదడు నుంచి గుండెకు రక్తాన్ని సరఫరా చేసే నాళాలు సరిగా అభివృద్ధి చెందక పోతే ఈ పరిస్థితి వస్తుంది. 'ఈ సమస్యతో జన్మించినవారిలో 50 నుంచి 60 శాతం మంది వెంటనే అనారోగ్యానికి గురవుతారు. బిడ్డపుట్టగానే మెదడు, గుండె వైఫల్యానికి ఆస్కారం ఎక్కువగా ఉంటుంది. అందులో 40 శాతం మంది చనిపోయే అవకాశం ఉంటుంది' అని బోస్టన్ పిల్లల ఆసుపత్రి వైద్యనిపుణులు తెలిపారు. ఆ శిశువును ఎలాగైనా కాపాడాలని నిర్ణయించుకున్న వైద్య బృందం 34 వారాల ఆ గర్భస్థ శిశువుకు శస్త్రచికిత్స నిర్వహించి, విజయవంతమైంది. కొద్దిరోజులకు బిడ్డ జన్మించిందని, పూర్తిస్థాయి ఆరోగ్యంగా ఉందని వైద్యులు తెలిపారు.

సెర్బియాలో మూకుమ్మడి హత్యలు

- 8 మందిని కాల్చి చంపిన సాయుధుడు

బెల్గ్రేడ్ : సెర్బియాలో రెండు రోజుల వ్యవధిలో రెండు మూకుమ్మడి హత్యాకాండ ఘటనలు చోటుచేసుకున్నాయి. ఒక బాలుడు ఎనిమిది మంది విద్యార్థులను కాల్చి చంపిన ఘటన మరువక ముందే శుక్రవారం మరో దారుణం చోటుచేసుకుంది. సాయుధుడైన ఒక వ్యక్తి మూడు గ్రామాల్లో మొత్తంగా ఎనిమిది మందిని కాల్చి చంపాడని, 14మందిని గాయపరిచారని పోలీసులు తెలిపారు. వెంటనే ఆ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.. రాజధానికి 50కిలోమీటర్ల దూరంలో మెడెనొవాక్‌కు సమీపంలోని గ్రామాల్లో ఈ ఘటనలు చోటుచేసుకున్నాయి.. ఇదొక తీవ్రవాద చర్య అని సెర్బియా హోం మంత్రి వ్యాఖ్యానించారు. బుధవారం బెల్గ్రేడ్‌లో 13ఏళ్ల బాలుడు తన తండ్రి తుపాకీ తీసుకుని ఎనిమిది మంది విద్యార్థులను, స్కూలు గార్డును కాల్చి చంపాడు. సెర్బియాలో పెరుగుతున్న తుపాకీ సంస్కృతి పట్ల అక్కడి పౌర సమాజం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోంది.

బిజెపి ఓటమి ఖాయం : మల్లికార్జున్ ఖర్గే



బెంగళూర్ : కర్నాటక అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించి పూర్తి మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని ఎఐసిసి చీఫ్ మల్లికార్జున్ ఖర్గే ధీమా వ్యక్తం చేశారు. బిజెపిని మట్టికరిపించాలనే కత నిశ్చయంతో కాంగ్రెస్ ముందుకెళుతున్నదని చెప్పారు. ఖర్గే శుక్రవారం ఓ న్యూస్ చానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కర్నాటక అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపికి భంగపాటు తప్పదని స్పష్టం చేశారు. కర్నాటక ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమిపాలైతే పూర్తి బాధ్యత తాను తీసుకుంటానని ఖర్గే పేర్కొన్నారు. రాష్ట్రంలో తాను సుడిగాలి పర్యటనలు చేస్తున్నానని, ఒక్కోసారి సాయంత్రం సభలో పాల్గొనేందుకు తాను 100 కిలోమీటర్లు ప్రయాణిస్తున్నానని చెప్పారు. బిజెపిని ఓడించాలనే కసితో అన్నింటిని భరిస్తున్నామని కర్నాటకలో తన నాన్ స్టాప్ ర్యాలీలను ప్రస్తావిస్తూ చెప్పుకొచ్చారు. కాగా, అసెంబ్లీ ఎన్నికలకు పోలింగ్ తేదీ దగ్గరపడుతుండటంతో ప్రధాన పార్టీలు ప్రచారాన్ని ముమ్మరం చేశాయి.

ప్రధానిపై ఇసికి కాంగ్రెస్ ఫిర్యాదు

న్యూఢిల్లీ : ప్రధానమంత్రి నరేంద్ర మోడీపై ఎన్నికల కమిషన్ (ఇసి)కి కాంగ్రెస్ ఫిర్యాదు చేసింది. కర్ణాటక ఎన్నికల ప్రచార సభల్లో హిందువుల దైవం హనుమంతుని పేరుని ప్రధాని ప్రస్తావించడంపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొంది. ప్రధాని ర్యాలీల్లో కాంగ్రెస్ పార్టీని పార్టీని హిందూ వ్యతిరేకిగా చిత్రీకరించేందుకు యత్నిస్తున్నారని, కాంగ్రెస్‌ను విమర్శించే పేరుతో జై బజరంగ్ బలి అంటూ ఓటర్లను ఆకట్టుకునేందుకు యత్నిస్తున్నారని పేర్కొంది.

మణిపూర్ హింసలో 31మంది మృతి

- స్థానిక వార్తా సంస్థల వెల్లడి
- అధికార ప్రకటన చేయని రాష్ట్ర ప్రభుత్వం
- ప్రస్తుతం పరిస్థితి అదుపులో వుందన్న అధికారులు



న్యూఢిల్లీ : గత రెండు రోజులుగా మణిపూర్‌లో చెలరేగుతున్న అల్లర్లు, హింసాత్మక ఘర్షణల కారణంగా 31మంది చనిపోయారని ఆస్పత్రి రికార్డులను ఉటంకిస్తూ ఉఖ్రుల్ టైమ్స్ పేర్కొంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో చోటు చేసుకున్న అశాంతి, ఘర్షణల వల్ల మరణించిన వారి సంఖ్యపై రాష్ట్ర ప్రభుత్వం ఇంతవరకు ఎలాంటి అధికార ప్రకటన చేయలేదు. అయితే స్థానిక వార్తా సంస్థలు మాత్రం ప్రత్యక్ష సాక్షుల కథనాలు, బాధిత కుటుంబాలు పేర్కొన్న వివరాలు, ఆస్పత్రి రికార్డుల ఆధారంగా మృతుల సంఖ్యను పేర్కొంటున్నాయి. గురువారం నాటికి ఇంఫాల్‌లోని రిమ్స్ శవాగారానికి వచ్చిన మృతుల సంఖ్య 18గా వుండగా, జవహర్‌లాల్ నెహ్రూ మెడికల్ సైన్స్‌కు వచ్చిన మృతదేహాల సంఖ్య 13గా వుందని ఉఖ్రుల్ టైమ్స్ తన నివేదికలో పేర్కొంది. అయితే మృతులను గుర్తించారా లేదా అన్న వివరం తెలియరాలేదు. కుకి గిరిజనులు, మీటె కమ్యూనిటీ మధ్య తలెత్తిన జాతుల హింస, ఘర్షణల కారణంగా మరణించిన వారి సంఖ్య ఇంకా ఎక్కువే వుండవచ్చని ఆ కథనం పేర్కొంది.

అంతకుముందు ప్రత్యక్ష సాక్షులు, బాధిత కుటుంబం చెప్పిన వివరాలను బట్టి మృతుల సంఖ్య 13గా ది వైర్ తన కథనంలో పేర్కొంది. కాగా, ఇంఫాల్‌కి చెందిన సాంగై ఎక్స్‌ప్రెస్ మరో 11మంది చనిపోయారని తెలిపింది. 4వ తేదీ ఉదయం నుండి కొంత ప్రశాంతంగా వుందని పలువురు తెలిపారు. చురాచంద్‌పూర్‌కి చెందిన ఢిల్లీలో చదువుకుంటున్న విద్యార్థి తవ్నా వాల్టె మాట్లాడుతూ పట్టణ ప్రాంతంలో, జిల్లాలో కొన్ని చోట్ల పోలీసులు కవాతు చేశారని, కానీ 3గంటల ప్రాంతంలో ఒక్కసారిగా సమీప గ్రామంలో రెండు కమ్యూనిటీల మధ్య కాల్పులు జరిగిన శబ్దం వినిపించిందని తన కుటుంబం తెలిపినట్లు చెప్పారు. అదే పట్టణానికి చెందిన మునాలిన్ టాన్సింగ్ మాట్లాడుతూ, అనేకమంది గిరిజనులు లోయలో చిక్కుకుపోయారని, రోడ్డు మార్గంలో కొండ ప్రాంతానికి వెళ్ళేందుకు వారు భయపడుతున్నారని, అల్లరి మూకలు తమని చుట్టుముడతాయని వారు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. 4వ తేది మధ్యాహ్నం కూడా తాను తుపాకీ కాల్పులు విన్నట్లు సైకుల్ పట్టణ వాసి తెలిపారు.

మణిపూర్‌లో మెజారిటీ కమ్యూనిటీ అయిన మీటెలకు ఎస్‌టి హోదా ఇవ్వాలన్న డిమాండ్‌కు గిరిజన కమ్యూనిటీలు తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే 3వ తేదీన హింస చెలరేగింది.

రాష్ట్రంలో ఐదు రోజుల పాటు ఇంటర్‌నెట్ సేవలు నిలిపివేశారని, గిరిజనేతరులు ఎక్కువగా వుండే ఇంఫాల్ వెస్ట్‌తో సహా 8జిల్లాల్లో కర్ఫ్యూ విధించారని ది వైర్ పేర్కొంది. కాల్పులతో చెలరేగుతున్న మంటలు, తుపాకీ కాల్పులు, రాళ్ళు విసురుకున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

అసాధారణ ప్రశాంతత

మణిపూర్‌లో శుక్రవారం అసాధారణ రీతిలో ప్రశాంతత నెలకొంది. కాగా భారీ బందోబస్తు నేపథ్యంలో రెండు కమ్యూనిటీల మధ్య గత రాత్రి నుండి ఎలాంటి హింస చెలరేగినట్లు వార్తలందలేదు. అయితే వివిధ ప్రాంతాల్లో భద్రతా బలగాలు, కొండ ప్రాంతాల్లోని తీవ్రవాదుల మధ్య కాల్పులు జరిగినట్లు పోలీసులు తెఇపారు. అన్ని పక్షాల వారూ సమన్వయంతో తీసుకున్న చర్యల ఫలితంగా ప్రస్తుతం పరిస్థితి అదుపులోనే వుందని రక్షణ శాఖ పిఆర్‌ఓ ఒక ప్రకటనలో పేర్కొంది. అస్సాంలోని రెండు విమానాశ్రయాల నుండి ఐఎఎఫ్ విమానాలు రెండు చక్కర్లు కొడుతునే వున్నాయి. ఆర్మీ, అస్సాం రైఫిల్స్‌కి చెందిన 55 కాలమ్స్ బలగాలను మోహరించారు. నాగాలాండ్ నుండి మరింతమంది రప్పిస్తున్నారు. ఇంఫాల్ నగరంలో రెండు షాపింగ్ మాల్స్‌ను ధ్వంసం చేసి, తగలబెట్టారు. గురువారం అల్లరి మూక జరిపిన దాడిలో గిరిజన ఎంఎల్‌ఎ తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

ఇంగ్లండ్ స్థానిక ఎన్నికల్లో టోరీల వెనుకంజ

- ముందంజలో లేబర్ పార్టీ, లిబరల్ డెమొక్రాట్లు

లండన్ : ఇంగ్లండ్ వ్యాప్తంగా జరిగిన స్థానిక ఎన్నికల్లో పాలక కన్జర్వేటివ్ పార్టీ పేలవమైన పనితీరును కనబరుస్తుండగా, ప్రతిపక్ష లేబర్ పార్టీ, లిబరల్ డెమోక్రాట్లు ముందంజలో ఉన్నారు. మొత్తంగా 230 స్థానిక మండళ్లకు ఎన్నికలు జరగ్గా, వాటిలో తొలిగా 61 మండళ్ల ఫలితాలు వెలువడ్డాయి. అందులో టోరీలు తొమ్మిది కౌన్సిళ్లను అంటే మొత్తంగా 190 సీట్లను కోల్పోగా, మరోపక్క లేబర్ పార్టీ మూడు కౌన్సిళ్లను అంటే 138 సీట్లను గెలుచుకుంది.

వచ్చే ఏడాది జరిగే సార్వత్రిక ఎన్నికలకు ఈ ఫలితాలను ఒక సూచికగా భావిస్తున్నారు. పాలక కన్జర్వేటివ్ పార్టీ దాదాపు ఏడాది కాలంగా తీవ్ర కల్లోలాన్ని ఎదుర్కొంటోంది. ఇదే కాలంలో ముగ్గురు ప్రధానులు మారారు. ఆర్థిక ఇబ్బందులు, కుంభకోణాలు చోటు చేసుకున్నాయి. 2019 ఎన్నికల్లో టోరీల ఖాతాలో వున్న ప్లైమౌత్, స్టోక్ ఆన్ ట్రెంట్ అనే రెండు కీలకమైన కౌన్సిళ్లను ఈసారి లేబర్ పార్టీ గెలుచుకుంది. టోరీలకు బలమైన స్థానంగా వున్న విండ్సర్, మెయిడెన్‌హెడ్‌లపై లిబరల్ డెమోక్రాట్లకు ఆధిపత్యం వచ్చింది. బ్రిటన్ మాజీ ప్రధాని థెరిస్సా మే 1997 నుండి మెయిడెన్‌హెడ్ పార్లమెంటరీ సీటుకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇప్పటివరకు వచ్చిన ఫలితాల ప్రాతిపదికన ఓట్ల వాటా పరంగా చూసినట్లైతే ఎనిమిది పాయింట్ల ఆధిక్యతలో వుంటామని లేబర్ పార్టీ విశ్వాసం వ్యక్తం చేస్తోంది. సార్వత్రిక ఎన్నికల్లో లేబర్ పార్టీ 8శాతం ఆధిక్యతతో వుంటే మెజారిటీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలుగుతామని పార్టీ ప్రతినిధి వ్యాఖ్యానించారు. టోరీ నాయకత్వం మాత్రం ఈ ఎన్నికల ఫలితాలను తక్కువ చేసి చూపడానికి ప్రయత్నిస్తోంది. వచ్చే ఎన్నికల్లో లేబర్ పార్టీ గెలవాల్సిన అవసరం వున్న ఏరియాల్లో తాము విజయం సాధించామని టోరీల ప్రతినిధి హండ్స్ చెప్పారు.

తీవ్రవాదం ఏ రూపంలో వున్నా నిర్మూలించాల్సిందే!

ఎస్‌సిఓ సదస్సులో జై శంకర్

బెనాలిమ్ (గోవా) : సరిహద్దు ఆవలి తీవ్రవాదంతో సహా ఏ రూపంలోని తీవ్రవాదాన్నైనా నిర్మూలించాల్సిందేనని విదేశాంగ మంత్రి జై శంకర్ అన్నారు. తీవ్రవాద కార్యకాలాపాలకు ఆర్థిక సాయం అందే మార్గాలను కూడా మూసివేయాల్సిందేనన్నారు. గోవాలో జరుగుతున్న షాంఘై సహకార సంస్థ (ఎస్‌సిఓ) సదస్సుకు అధ్యక్షత వహించిన ఆయన శుక్రవారం మాట్లాడారు. పాకిస్తాన్ విదేశాంగ మంత్రి బిల్వాల్ భుట్టో సమక్షంలోనే ఆయన తీవ్రవాదంపై తమ వైఖరిని గట్టిగా వినిపించారు. ఒకపక్క ప్రపంచం కోవిడ్ మహమ్మారితో, తదనంతర పర్యవసానాలతో సతమతమవుతున్నా కూడా తీవ్రవాద ముప్పు అడ్డూ అదుపు లేకుండా సాగిందని విమర్శించారు. పరోక్షంగా పాకిస్తాన్‌ను ప్రస్తావిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. తీవ్రవా దం నుండి దృష్టి మళ్ళించడం వల్ల భద్రతా ప్రయోజనాలకు విఘాతం కలుగుతుందని హెచ్చరించారు. తీవ్రవా దానికి ఎలాంటి సమర్ధింపు వుండరాదని భారత్ దృఢంగా విశ్వసిస్తోందన్నారు. ఈ ముప్పును ఎదుర్కొనడమనేది ఎస్‌సిఓ ఆదేశాల్లో ఒకటని ఆయన పేర్కొన్నారు. ప్రగతికి అనుసంధానత అనేది చాలా కీలకమని ఆయన నొక్కి చెప్పారు. అన్ని సభ్య దేశాల సార్వభౌమాధికారాన్ని, ప్రాదేశిక సమగ్రతను తప్పనిసరిగా గౌరవించాల ని అన్నారు. ఈ సమావేశానికి చైనా, రష్యా విదేశాంగ మంత్రులతో సహా ఇతర సభ్య దేశాల విదేశాంగ మంత్రులు కూడా హాజరయ్యారు. ఆఫ్ఘనిస్తాన్‌లో పరిస్థితులను కూడా జైశంకర్ ప్రస్తావించారు. ఎస్‌సిఓలో సంస్కరణ లు తీసుకువచ్చి, ఆధునీకరించాలని, అప్పుడే మరింత సమకాలీన దృక్పథం రావడానికి దోహదపడుతుందని, దాని కోసం భారత్ తీవ్రంగా కృషి చేస్తుందని చెప్పారు. ఇంగ్లీషును ఎస్‌సిఓ మూడవ అధికార భాషగా తీసుకురావడానికి నిర్మాణాత్మక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇప్పటివరకు చైనీస్, రష్యన్‌లు మాత్రమే అధికార భాషలుగా వున్నాయి. స్టార్టప్‌లు, వినూత్న అన్వేషణలపై, సాంప్రదాయ మెడిసిన్‌పై కొత్తగా రెండు వర్కింగ్ గ్రూపులను ఏర్పాటు చేయాలన్న భారత్ ప్రతిపాదనకు సభ్య దేశాలు మద్దతివ్వ డాన్ని ఆయన అభినందించారు. కాగా ఈ సదస్సు సందర్భంగా భారత్‌తో ఎలాంటి ద్వైపాక్షిక సమావేశం వుండబోదని ముందుగానే చెప్పిన పాక్‌మంత్రి బిల్వాల్‌తో మర్యాదపూర్వకంగా జై శంకర్ కరచాలనం చేశారు.



మీ కోసం

చేపముక్కలకు కొద్దిగా ఉప్పు కలిపి డీప్‌ఫ్రిజ్‌లో ఉంచితే ఒకదానికొకటి అంటుకోకుండా ఉంటాయి.

జీవనసౌరభం

మర్యాదగా వినడం, వివేకంతో సమాధానమివ్వడం, ప్రశాంతంగా ఆలోచించడం, నిష్పాక్షికంగా నిర్ణయం తీసుకోవడం.. ప్రతి వ్యక్తికి అవసరం.

కాలములు



వచ్చిందండీ వచ్చింది
వేసవికాలం వచ్చింది
ఎండా వేడిని తెచ్చింది
మండే నేలను ఇచ్చింది
చెమటాచుక్కల ఇచ్చింది

కావాలండీ కావాలి
చల్లని నీరూ కావాలి
ఖద్దరు బట్టలు కావాలి
కాళ్లకు చెప్పులు కావాలి
తలకూ గొడుగూ కావాలి


వచ్చిందండీ వచ్చింది
వానాకాలం వచ్చింది
మెండుగ వానలు తెచ్చింది
జగతికి నీటిని ఇచ్చింది
వాగులు వంకలు తెచ్చింది

కావాలండీ కావాలి
ఆరిన దుస్తులు కావాలి
తలకూ గొడుగూ కావాలి
వేడిగ వంటలు కావాలి
వెచ్చని కాఫీ కావాలి

వచ్చిందండీ వచ్చింది
శీతాకాలం వచ్చింది
మంచుబిందువులు తెచ్చింది
పొగలమంచుతో నింపింది
వణుకుల ఒళ్లూ ఇచ్చింది

కావాలండీ కావాలి
చలికీ మంటలు కావాలి
ఉన్నీ దుస్తులు కావాలి
వెచ్చని దుప్పటి కావాలి
వెచ్చని నీరూ కావాలి!

– డి.కె.చదువులబాబు
94407 03716



దారి చూపండి

చిన్నారులూ, రాణి, రాజు స్కేటింగ్స్‌తో ఆడుకోవాలనుకుంటున్నారు. మరి వాటి దగ్గరకు వెళ్లే దారి చూపరూ !

నేను గీసిన బొమ్మ



- చుక్క, రిషిక,
4వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జగతి,
శ్రీకాకుళం జిల్లా.

రేపటి నుంచే వేసవి విడిది

నేస్తాలూ, రేపటి నుంచి ఈ పేజీలో విద్యార్థినీ విద్యార్థులు రాసే కథలూ కబుర్లూ, బొమ్మలూ గేయాలూ రాబోతున్నాయి. మిస్సవకండి. మీరూ మీ రచనలు పంపండి.

- ఎడిటర్

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఆనంద మజిలీలో మలి జీవితం

కరుస్సెరిల్ థంకమ్మ హిందీ టీచర్‌గా రిటైర్ అయ్యారు. కేరళ కొట్టాయమ్ జిల్లా కంజీరపల్లి సమీపాన ఓ గ్రామంలో ఆమె నివసిస్తున్నారు. రిటైరయ్యాక ఆ టీచరమ్మ కొడుకులు, కోడళ్లు, కూతురు, మనవళ్లతో తన విశ్రాంత జీవితం గడిపేస్తుందని అందరూ భావించారు. కాని థంకమ్మ అలా చేయలేదు. తన 84వ పుట్టినరోజున ఆమె తీసుకున్న ఓ నిర్ణయం తన జీవితంలో రెండో మజిలీకి దారి తీసింది. తాత ముత్తాతల నుండి వారసత్వంగా వచ్చిన తన ఇంటిని వృద్ధుల సంరక్షణాలయంగా మార్చివేసిన ఆమె సంకల్పాన్ని చూసి కుటుంబ సభ్యులు ఆశ్చర్యపోయారు. 2017లో 'మనోవాదాయ పాకలవీడు' పేరుతో ఓ స్వచ్ఛంద సంస్థను స్థాపించి ఎంతోమంది వృద్ధులకు కొండంత అండగా నిలబడింది.



'దుఃఖాన్ని విడిచిపెట్టు' అని అర్థం వచ్చే ఆ సంస్థను వృద్ధుల సంరక్షణ కోసమే స్థాపించానని చెబుతారు థంకమ్మ. 60 ఏళ్లు పైబడిన 30 మంది వృద్ధులు రోజంతా అక్కడ చాలా ఉత్సాహంగా గడుపుతున్నారు. సంస్థ తరపున చేస్తున్న ఉత్పత్తుల తయారీలో తమవంతు కృషి చేస్తున్నారు. థంకమ్మ లక్ష్యం వృద్ధుల సంరక్షణే అయినా సంస్థ నిర్వహణ కోసం కొంతమంది యువతతో చేతితో తయారుచేసే ఉత్పత్తులను తయారుచేయిస్తున్నారు. కొవ్వొత్తులు, అగరబత్తీలు, సబ్బులు, పేపర్ సంచులు వంటివి తయారుచేయడం, వాటిని మార్కెట్లో విక్రయించిగా వచ్చిన సొమ్మును సంస్థ నిర్వహణ కోసం ఉపయోగిస్తున్నారు.



ఉత్పత్తుల తయారీలో ఆసక్తి ఉన్న వృద్ధులు కూడా సహకరిస్తుంటారు. ఎవరిపైనా ఏవిధమైన నిర్బంధం ఉండదక్కడ.. ఎవరిష్టం వారిది అన్నట్లుగా ఎవరికి తోచిన పనుల్లో వారు నిమగ్నమవుతారు. ఓపికలేని కొంతమంది వృద్ధులు ఇంటి ప్రాంగణంలో మొక్కల సంరక్షణ చేస్తూ కనిపిస్తారు.

'ఉదయం 8 గంటలకు పాకలవీడు నుండి ఓ బస్సు వృద్ధుల ఇళ్లకు వెళుతుంది. వారిని ఎక్కించుకుని వస్తుంది. సాయంత్రం 5 గంటలకు తిరిగి మళ్లీ వాళ్లను ఇంటికి చేరుస్తుంది' అని చెబుతున్న థంకమ్మ 'ఈ వయసులో మాట్లాడేవాళ్లు లేక ఒంటరితనంతో వాళ్లంతా చాలా బాధపడుతుంటారు. ఇక్కడే ఉంచేసి వారిని సంరక్షిస్తే.. అది వృద్ధాశ్రమం అవుతుంది. నాకది ఇష్టం లేదు. ఈ వయసులో వారేం చేయగలరో.. మాట్లాడగలరో స్వేచ్ఛగా చేయాలి. ఇక్కడ ఆ స్వేచ్ఛ వారికి కల్పించాలి. ఇది వారి దు:ఖాన్ని పోగొట్టే చోటుగా భావించాలి' అంటారు ఆమె. ఇంకా 'సాధారణంగా వృద్ధులకు ఎదురయ్యే ఆరోగ్య సమస్యలపై శ్రద్ధ వహించేందుకు సంస్థ ఆధ్వర్యంలో మెడికల్ క్లినిక్, ల్యాబ్‌ను కూడా ఏర్పాటుచేశాను. నెలొకోసారి ఒక్కో వృద్ధురాలి కుటుంబం మాతో గడిపేందుకు ఇక్కడికి వస్తుంటారు. ఆ రోజంతా ఆటపాటలతో కాలక్షేపం చేస్తాం. ఇక్కడ ఓనమ్, క్రిస్టమస్ కూడా జరుపుకుంటాం. ఈ ఐదేళ్లలో ప్రతి ఏడాది ఓ ట్రిప్ వెళ్లాం' అంటూ మనోవాదయ గురించి థంకమ్మ టీచర్ చెబుతున్నప్పుడు ఆమె కళ్లు సంతోషంతో నిండిపోయాయి.

'ఈ వయసులో నీకెందుకమ్మా ఇవన్నీ.. హాయిగా కూర్చోక' అని విదేశాల్లో స్థిరపడిన నా పిల్లలు అన్నారు. కాని వాళ్లకేం తెలుసు.. నేను వాళ్ల నాన్న పోయినప్పుడు 2004లోనే వృద్ధుల కోసం ఏదైనా చేయాలని లక్ష్యం పెట్టుకున్నాను. ఇన్నేళ్ల తరువాత అది నెరవేరింది. ఇక్కడికి వచ్చిన తల్లులు తమ బాధలు మర్చిపోయి ఎంతో ఆనందంగా గడుపుతున్నారు. వారి కళ్లల్లో సంతోషం నాకు చాలా స్పష్టంగా కనిపిస్తోంది' అంటున్న థంకమ్మ కొన్ని నెలల క్రితమే తన 89వ పుట్టినరోజును మనోవాదాయ సభ్యుల మధ్య జరుపుకున్నారు. ఒక పక్క మహిళల సాధికారత కల్పిస్తూనే.. మరోపక్క వృద్ధులకు కొండంత అండగా నిలబడిన థంకమ్మ మనసు బహు దొడ్డది కదూ..!



పిల్లలు ఇష్టంగా తినేలా..

ఎదిగే వయసులో పిల్లలకి పోషకాహారం కావాలి – బ్రెయిన్ ఫంక్షన్ సరిగ్గా ఉండే ఆహారం ఇవ్వాలి. కాల్షియం కావాలి, మినరల్స్, విటమిన్స్ ఇంకా ఎన్నో కావాలి. మరి అవన్నీ పిల్లలకి ఇస్తున్నామా.. పిల్లలు అవి ఇష్టపడకపోతే ఎలా తినిపించాలి.. ఒకసారి చూద్దాం..

యోగర్ట్ : బ్రేక్‌ఫాస్ట్‌గా, స్నాక్‌గా, డెసర్ట్‌గా ఎలా అయినా యోగర్ట్ పిల్లలకి ఇవ్వొచ్చు. అది ఆరోగ్యంగా ఉంటుంది, పొట్ట నిండుతుంది, విటమిన్ డీ, ప్రొటీన్స్ ఉంటాయి. యోగర్ట్‌లో ప్రోబయోటిక్స్ కూడా ఉంటాయి. ఇది బాడీలో ఆరోగ్యకర బాక్టీరియాని పెంచుతుంది. మరి పిల్లలు దీన్ని ఇష్టంగా తినాలంటే వారికి నచ్చిన పండ్ల ముక్కలు వేస్తే సరి.

బీన్స్ : బీన్స్ చాలా మంచి ఫుడ్, కానీ, దీనిని తినేందుకు పిల్లలు అంతగా ఇష్టపడరు. వీటిలో ప్రొటీన్, ఫైబర్ పుష్కలంగా ఉంటాయి. అన్ని వేళలా దొరుకుతాయి. వీటిని పిల్లలు తినేలా వారు ఇష్టంగా తినే స్నాక్‌తో కలిపి పెట్టండి. పాస్తాతో గానీ, మాంసంతో గానీ కలిపి తినిపించొచ్చు.

ఎగ్స్ : ఒక ఎగ్‌లో 6 గ్రాముల ప్రొటీన్‌తో పాటూ, విటమిన్ డీ, విటమిన్ బీ12, ఐరన్ ఉంటాయి. కొన్ని ఎగ్స్‌లో ఒమేగా–3 ఫ్యాటీ ఆసిడ్స్ కూడా ఉంటాయి. పిల్లల ఎదుగుదలకు ఎంతో ఉపయోగపడే గుడ్లను పిల్లలు ఇష్టంగా తినేలా బ్రేక్ ఫాస్ట్ టైంలో ఉడికించి నేరుగా గాని, సలాడ్ రూపంలో గాని పెట్టాలి.

చిలగడ దుంప : ఉడికించిన చిలగడ దుంపల్ని తిన్నా అందులో ఉండే పోషకాలు, విటమిన్ ఏ, ఫైబర్, పొటాషియం పిల్లలకి సంవృద్ధిగా అందుతాయి.

పాలు : పాలలో ఉన్న కాల్షియం, విటమిన్‌డీ పిల్లల ఆరోగ్యానికి చాలా మంచివి. రోజూ పిల్లలతో పాలు తాగించాలి. ఇష్టపడకపోతే వేయించిన జీడిపప్పు, బాదంపప్పును పొడి చేసి పాలలో కలిపి ఇవ్వాలి.

నట్స్ : చిరుతిళ్లలా పిల్లలకు నట్స్ తినిపించవచ్చు. జీడిపప్పులు, వాల్‌నట్స్, బాదం పప్పులు, సన్‌ఫ్లవర్ సీడ్స్, చియా సీడ్స్ పిల్లలకి ఇవ్వొచ్చు. వాల్‌నట్స్, ఫ్లాక్స్ సీడ్స్, చియా సీడ్స్‌లో ఒమేగా–3 ఫాట్స్ ఉంటాయి. ఈ ఫ్యాట్స్ ఆహారంలోనే ఉంటాయి. శరీరం వాటిని తయారు చేసుకోలేదు.

కూరగాయలు : ఆకుకూరలు, కూరగాయల రకాలన్నింటినీ పిల్లలకి తినిపించవచ్చు. కూర రూపంలో విడిగా తిననప్పుడు స్నాక్స్‌లో కలిపి తినిపించాలి. క్యారెట్, దోసకాయల వంటివి ముక్కలుగా కోసుకుని స్నాక్‌గా తినొచ్చు.


'హనుమాన్' వాయిదా




ప్రశాంత్ వర్మ, తేజ సజ్జ కాంబినేషన్‌లో రాబోతున్న 'హను మాన్' చిత్ర విడుదల వాయిదా పడింది. మే 12న రిలీజ్ చేయాల్సిన ఈ సినిమా విడుదల తేదీ దగ్గర పడుతుండడంతో తాజాగా మేకర్స్ రిలీజ్ వాయిదా పడినట్లు ప్రకటించారు. సినిమాలో గ్రాఫికల్ వర్క్స్ ఇంకా పూర్తికాలేదని, అందుకే సినిమా వాయిదా వేస్తున్నామని తెలిపారు. కొత్త డేట్ త్వరలో ప్రకటించనున్నట్లు సమాచారం. ఈ చిత్రంలో అమృత అయ్యర్ హీరోయిన్‌గా నటించగా ప్రైమ్ షో ఎంటర్టైన్మెంట్స్ భారీ బడ్జెట్‌తో నిర్మాణం వహిస్తున్నారు.

12న ఓటీటీలో 'శాకుంతలం'

సమంత నటించిన 'శాకుంతలం' చిత్రం ఈ నెల మే 12వ తేదీన ఓటీటీల్లోకి రానుంది. ఈ మూవీ ఓటీటీ రైట్స్‌ని అమెజాన్ ప్రైమ్ దక్కించుకుంది. సినిమా విడుదలకు ముందే దాదాపు రూ.20 కోట్లకు అమెజాన్ ప్రైమ్ ఓటీటీ హక్కులను దక్కించుకుందని సమాచారం. ఈ సినిమాకి గుణశేఖర్ దర్శకత్వం వహించారు. దాదాపు రూ.అరవై కోట్ల బడ్జెట్‌తో ఈ చిత్రం రూపొందింది. శకుంతల పాత్రలో సమంత నటించగా దుష్యంతుడిగా దేవమోహన్ కనిపించారు. మోహన్‌బాబు, అనన్య నాగళ్ల, సచిన్ ఖేడ్కర్, గౌతమ్, మధుబాల కీలక పాత్రలను పోషించారు. ఈ సినిమాను గుణశేఖర్ తనయ నీలిమ గుణతో కలిసి దిల్ రాజు నిర్మించారు.





హీరోయిన్‌పై సోలో సాంగ్

సిద్ధార్థ్ హీరోగా 'టక్కర్' అనే సినిమా రాబోతోంది. ఈ చిత్రానికి కార్తీక్ జి. క్రిష్ దర్శకత్వం వహిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్, ప్యాషన్ స్టూడియోస్‌తో కలిసి టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. దివ్యాంశ కౌశిక్ కథానాయికగా నటిస్తున్నారు. 2023, మే 26న తెలుగు, తమిళ భాషల్లో భారీస్థాయిలో ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. చిత్ర ప్రమోషన్స్‌లో భాగంగా తాజాగా 'కయ్యాలే' అనే సాంగ్ ఫుల్ వీడియోని మేకర్స్ విడుదల చేశారు. ఈ సాంగ్ కేవలం హీరోయిన్‌పైనే చిత్రీకరించారు. కథానాయిక స్వభావాన్ని, సమాజం పట్ల ఆమెకున్న అభిప్రాయాన్ని తెలిపేలా ఈ పాట సాగింది.

జూన్ 2న 'పరేషాన్'



'మసూద'తో హిట్ అందుకున్న యంగ్ హీరో తిరువీర్. ఇప్పుడు రూపక్ రోనాల్డ్సన్ దర్శకత్వం వహించిన 'పరేషాన్' అనే హిలేరియస్ ఎంటర్ టైనర్‌తో వస్తున్నాడు. వాల్తేర్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సిద్ధార్థ్ రాళ్లపల్లి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఈ టీజర్‌కు ప్రేక్షకుల స్పందన బాగుంది. హీరో రానా దగ్గుబాటి సమర్పణలో జూన్ 2న ఈ చిత్రం విడుదల చేయనున్నట్లు మేకర్స్ తాజాగా అనౌన్స్ చేశారు. తెలంగాణ లోని ఒక పల్లెటూరి నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో పావని కరణం, బన్నీ అభిరన్, సాయి ప్రసన్న, అర్జున్ కృష్ణ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి వాసు పెండం డీవోపీగా వ్యవహరిస్తుండగా యశ్వంత్ నాగ్ సంగీతం సమకూర్చుతున్నారు.



ఉత్కంఠగా 'కస్టడీ' ట్రైలర్

అక్కినేని నాగచైతన్య నటిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ చిత్రం 'కస్టడీ'. ద్విభాషా చిత్రంగా తెరకెక్కిన ఈ సినిమాకు వెంకట్ ప్రభు దర్శకత్వం వహించాడు. తాజాగా మేకర్స్ ఈ సినిమా ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. ఫుల్ యాక్షన్ అండ్ లవ్, థ్రిల్ నేపథ్యంలో తీసిన ఈ చిత్రం ఉత్కంఠ భరితంగా సాగినట్లు కనిపించింది. సిఎంగా ప్రియామణి, విలన్‌గా అరవింద స్వామి నటన ప్రేక్షకులను ఉత్సాహపరుస్తుంది. నాగ చైతన్య శివ అనే పోలీస్ కానిస్టేబుల్ పాత్రలో అద్భుతంగా నటించారు. కృతిశెట్టి హీరోయిన్‌గా మంచి పాత్రలో కనిపించింది. విలన్ కాపాడుతూ హీరో ఫైట్ చేయడం అందరిలోనూ క్యూరియాసిటీని పెంచుతుంది. ఇళయరాజా, యువన్ శంకర్ రాజా నేపథ్య సంగీతం ట్రైలర్‌లో అద్భుతంగా వినిపించారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ సినిమా మే 12న థియేటర్లలో విడుదల కానుంది.

గర్జించిన గుజరాత్

రాజస్థాన్‌పై తొమ్మిది వికెట్ల తేడాతో గెలుపు
బౌలింగ్‌లో మెరిసిన రషీద్ ఖాన్, నూర్ అహ్మద్

జైపూర్: ఇండియన్ ప్రిమియర్ లీగ్(ఐపిఎల్)లో డిఫెండింగ్ ఛాంపియన్ గుజరాత్ టైటాన్స్ హవా కొనసాగుతోంది. రాజస్థాన్ రాయల్స్‌తో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ జట్టు 9 వికెట్ల తేడాతో గెలిచి పాయింట్ల పట్టికలో మళ్లీ అగ్రస్థానానికి ఎగబాకింది. టాస్ గెలిచి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన రాజస్తాన్ జట్టు 17.5ఓవర్లలో కేవలం 118పరుగులకే ఆలౌట్ కాగా.. ఛేదనలో గుజరాత్ జట్టు 13.5ఓవర్లలో వికెట్ కోల్పోయి 119పరుగులు చేసి ఘన విజయం సాధించింది. తొలుత రాజస్తాన్ కెప్టెన్ సంజు శాంసన్(30), బౌల్ట్(15), జైస్వాల్(14) మాత్రమే బ్యాటింగ్‌లో రాణించగా.. జోస్ బట్లర్(8) మరోసారి నిరాశపరిచాడు. హెట్‌మైర్(7), రియాన్ పరాగ్(4), ధ్రువ్ జోరెల్(9), అశ్విన్(2) పేలవంగా ఆడారు. ఆఖర్లో ట్రెంట్ బౌల్ట్(15) ఓ సిక్స్, ఓ ఫోర్ బాదడంతో రాజస్థాన్‌కు ఆ మాత్రం స్కోరైనా వచ్చింది. యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ 14, దేవదత్ పడిక్కల్ 12 పరుగులు చేశారు. గుజరాత్ టైటాన్స్ స్పిన్ ద్వయం రషీద్ ఖాన్, నూర్ అహ్మద్ కీలకపాత్ర పోషించారు. రషీద్ ఖాన్ కేవలం 14 పరుగులిచ్చి 3 వికెట్లు తీయగా, నూర్ అహ్మద్ 25పరుగులిచ్చి 2 వికెట్లు పడగొట్టాడు. మరోవైపు మహ్మద్ షమీ, కెప్టెన్ హార్దిక్ పాండ్యా 1, జాషువా లిటిల్ 1 వికెట్ తీసి రాజస్థాన్ ను కుప్పకూల్చడంలో తమ వంతు సహకారం అందించారు. ఛేదనలో గుజరాత్ ఓపెనర్లు సాహా(41నాటౌట్), శుభ్‌మన్ గిల్(36) తొలి వికెట్‌కు 71పరుగులు జతచేశారు. ఆ తర్వాత కెప్టెన్ హార్దిక్ పాండ్యా(39నాటౌట్) మరో వికెట్ పడకుండా మ్యాచ్‌ను ముగించారు. దీంతో గుజరాత్ పాయింట్ల పట్టికలో మళ్లీ అగ్రస్థానానికి ఎగబాకింది. చాహల్‌కు ఒక వికెట్ లభించింది.

స్కోర్‌బోర్డు..

రాజస్తాన్ రాయల్స్ ఇన్నింగ్స్: జైస్వాల్ (రనౌట్) మోహిత్/రషీద్ ఖాన్ 14, బట్లర్ (సి)మోహిత్ శర్మ (బి)హార్దిక్ పాండ్యా 8, సంజు (సి)హార్దిక్ (బి)జోషూ లిట్టిల్ 30, పడిక్కల్ (బి)నూర్ అహ్మద్ 12, అశ్విన్ (బి)రషీద్ ఖాన్ 2, రియాన్ పరాగ్ (ఎల్‌బి)రషీద్ ఖాన్ 4, హెట్‌మైర్ (ఎల్‌బి)రషీద్ ఖాన్ 7, ధృవ్ జోరెల్ (ఎల్‌బి)నూర్ అహ్మద్ 9, బౌల్ట్ (బి)షమీ 15, జంపా (రనౌట్) మనోహర్ 7, సందీప్ శర్మ (నాటౌట్) 2, అదనం 8. (17.5ఓవర్లలో ఆలౌట్) 118పరుగులు. **వికెట్ల పతనం:** 1/11, 2/47, 3/60, 4/63, 5/59, 6/77, 7/87, 8/96, 9/112, 10/118

బౌలింగ్: షమీ 4-9-27-1, హార్దిక్ పాండ్యా 2-0-22-1, రషీద్ ఖాన్ 4-0-14-3, జోష్ లిట్టిల్ 4-0-24-1, నూర్ అహ్మద్ 3-0-25-2, మోహిత్ శర్మ 0.5-0-5-0

గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్: సాహా (నాటౌట్) 41, శుభ్‌మన్ గిల్ (స్టంప్) సంజు (బి)చాహల్ 36, హార్దిక్ పాండ్యా (39నాటౌట్), అదనం 3. (13.5ఓవర్లలో వికెట్ నష్టానికి) 119పరుగులు. **వికెట్ల పతనం:** 1/71 **బౌలింగ్:** బౌల్ట్ 3-0-28-0, సందీప్ శర్మ 3-0-19-0, ఆడం జంపా 3-0-40-0, చాహల్ 3.5-0-22-1, అశ్విన్ 1-0-8-0





ఐపిఎల్‌లో నేడు..

చెన్నై × ముంబయి
(వేదిక: చెన్నై; రా.3.30గం॥లకు)
ఢిల్లీ × బెంగళూరు
(వేదిక: ఢిల్లీ, రా.7.30గం॥లకు)

ప్రి క్వార్టర్స్‌కు హుసాముద్దీన్
ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్



తస్కెంట్(ఉజ్బెకిస్తాన్): ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ ప్రి క్వార్టర్‌ఫైనల్లోకి హైదరాబాద్‌కు చెందిన మహ్మద్ హుసాముద్దీన్ ప్రవేశించాడు. శుక్రవారం జరిగిన 57కిలోల విభాగం రౌండ్–32లో హుసాముద్దీన్ 5–0పాయింట్ల తేడాతో ఛైనాకు చెందిన లూ–పింగ్ విజయం సాధించాడు. తొలిరౌండ్‌నుంచి హుసాముద్దీన్ బలమైన పంచ్‌లతో ప్రత్యర్థికి గుక్క తిప్పుకోకుండా చేశాడు. ఆదివారం జరిగే ప్రి క్వార్టర్‌ఫైనల్లో హుసాముద్దీన్ రష్యాకు చెందిన సవ్విన్ ఎడ్వర్డ్‌తో తలపడనున్నాడు. కామన్వెల్త్ గేమ్స్‌లో కాంస్య పతకం సాధించిన హుసాముద్దీన్ ఈ టోర్నమెంట్‌లో అప్రతిహత విజయాలతో దూసుకెళ్తున్నాడు. ఇక నవీన్(92కిలోలు), ఆకాశ్ సింగ్(67కిలోలు), నిషాంత్ దేవ్(71కిలోలు) రౌండ్–32కు చేరుకున్న సంగతి తెలిసిందే. ఈ టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు 107దేశాలనుంచి 538బాక్సర్లు విచ్చేయగా.. ఇందులో ఒలింపిక్ పతక విజేతలు కూడా బరిలోకి ఉన్నారు.

కెఎల్ రాహుల్‌కు శస్త్రచికిత్స
ఐపిఎల్, డబ్ల్యుటిసి ఫైనల్‌కు దూరం



లక్నో: గాయపడ్డ కేఎల్ రాహుల్ ఈ సీజన్ ఐపిఎల్ మిగతా మ్యాచ్‌లనుంచి, వచ్చే నెలలో జరిగే ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్(డబ్ల్యుటిసి) ఫైనల్‌కూ దూరమయ్యాడు. ఈమేరకు లక్నో సూపర్ జెయింట్స్ శుక్రవారం ఇన్‌స్ట్రాగ్రామ్‌లో ఈ విషయాన్ని వెల్లడించింది. 'బిసిసిఐ వైద్యబృందం నిశితంగా పరిశీలించిన అనంతరం కేఎల్ రాహుల్ తొడకు శస్త్రచికిత్స, ఆర్థో అవసరమైన డాక్టర్లు తెలుపగా.. కేఎల్ రాహుల్ అందుకు అంగీకరించడంతో అతనికి కనీసం రెండు నెలలు విశ్రాంతి కావల్సి ఉంటుందని వైద్యులు తెలిపారు. దీంతో లక్నో సూపర్ జెయింట్ ఫ్రాంఛైజీకి గట్టి ఎదురుదెబ్బ తగిలినట్లైంది. సోమవారం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో మ్యాచ్ సందర్భంగా బౌండరీ లైన్‌కు వెళ్లే బంతిని ఆపే క్రమంలో కేఎల్ రాహుల్ కుడికాలు తొడ కండరాలు పట్టేయడంతో మైదానంలోనే కుప్పకూలిన సంగతి తెలిసిందే.

మాడ్రిడ్ ఓపెన్ ఫైనల్లో అల్కరాజ్

మాడ్రిడ్: డిఫెండింగ్ ఛాంపియన్, స్పెయిన్‌కు చెందిన కార్లోస్ అల్కరాజ్ మాడ్రిడ్ ఓపెన్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. శుక్రవారం జరిగిన సెమీఫైనల్లో అల్కరాజ్ 6-4, 6-3తో బోర్నా కోరిక్‌పై వరుససెట్లలో గెలిచాడు. జాన్ లెనార్డ్ స్టఫ్–అస్లాన్ కరక్సేవ్ మధ్య జరిగే రెండో సెమీస్ విజేతతో ఫైనల్లో అల్కరాజ్ తలపడనున్నాడు. కార్లోస్ అల్కరాజ్ నేడు 20వ బర్త్‌డే వేడుకలను మైదానంలోనే జరుపుకున్నాడు. ఇక మహిళల సింగిల్స్ ఫైనల్లోకి టాప్‌సీడ్ ఇగా స్వైటెక్, 2వ సీడ్ అర్యానా సబలెంకా ప్రవేశించారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68